www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 24-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 207

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 1.59 తదుపరి నవమి; నక్షత్రం: పునర్వసు ఉ. 6.15 తదుపరి పుష్యమి; వర్జ్యం: మ.2.43-4.25; దుర్ముహూర్తం: ఉ.10.04-10.50, మ.2.40-3.26; అమృతఘడియలు: రా.12.53-2.35; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 5.43 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మీలో ఒకరిగా ఉంటా!

- 35 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా.. 17 ఏళ్ల వయస్సులోనే నా తండ్రి కోసం ప్రచారం చేశా
- మీరు నా సోదరుడికి అండగా నిలిచారు
- నాకు అవకాశం కల్పిస్తే.. అది నాకు ఎంతో గౌరవం
- వయనాడ్ ప్రజలకు ప్రియాంకా గాంధీ విజ్ఞప్తి
- భారీ రోడ్డు షోతో నామినేషన్.. పాల్గొన్న సోనియాగాంధీ, రాహుల్, సీఎం రేవంత్, భట్టి

2



నామినేషన్ సందర్భంగా ప్రియాంకతో రేవంత్

బాలికపై సీఐ అత్యాచారయత్నం



సీఐ రవికుమార్

చాక్లెట్ ఇస్తానని ఆశచూపి దుర్మార్గం

హనుమకొండలో ఘటన

పోక్సో కేసు నమోదు

బయటకు పొక్కకుండా పోలీసుల తీవ్ర యత్నాలు

కాజీపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బడి నుంచి వచ్చిన బాలికకు చాక్లెట్ ఇస్తానని ఆశచూపి ఓ సీఐ (వేకెన్సీ రిజర్వ్-వీఆర్) ఆమెపై అత్యాచారయత్నం చేశాడు. హనుమకొండలో ఈ ఘోరం వెలుగుచూసింది. ఈ ఘటనపై బాధిత కుటుంబం ఫిర్యాదు చేసినా పోలీసులు, ఉన్నతాధికారులు సదరు సీఐను కాపాడేందుకు విశ్వప్రయత్నం చేశారు. అయితే ఎట్టకేలకు నిందితుడిపై కాజీపేట పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో

మిగతా 13వ పేజీలో...

2021లోనే బ్యారేజీల్లో లోపాలు గుర్తించాం

అప్పుడే నివేదికిచ్చినా చర్యలు తీసుకోలేదు

కాళేశ్వరం కమిషన్ ఎదుట ఓఅండ్ఎం ఈఎన్‌సీ

120 ప్రశ్నలు.. మూడున్నర గంటల పాటు విచారణ

ఈ పోస్టు అలంకారానికేనా? అని ప్రశ్నించిన కమిషన్

3

ఈడీ ప్రశ్నల వర్షం

భూముల కేటాయింపుపై ఐఏఎస్ అమోయ్ కుమార్‌ను 7 గంటలపాటు విచారించిన ఈడీ ప్రత్యేక బృందం

నేడు మరోసారి విచారణకు రావాలని ఆదేశాలు

గత ప్రభుత్వంలోని కీలక నేతల మెడకు ఈడీ ఉచ్చు?

వారికీ నోటీసులు జారీ చేసి ప్రశ్నించే అవకాశం



అమోయ్ కుమార్



కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రతినిధులతో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు

ఫోర్త్‌సిటీకి స్మార్ట్ సొబగులు!

కొరియాలోని ఇంచియాన్ స్మార్ట్‌సిటీలాగే..

- నగరాన్ని సందర్శించిన మంత్రుల బృందం
- ఇంచియాన్‌లో అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో అభివృద్ధి
- పునరుత్పాదక విద్యుత్తు, పునర్వినియోగ నీటి పద్ధతులు, కాలుష్య రహిత విధానాలు
- వీటినే ఫోర్త్‌సిటీకి అనుసరించే యోచన
- హైదరాబాద్, జిల్లా కేంద్రాల్లోనూ స్మార్ట్ సేవలు
- కొరియా స్పోర్ట్స్ వర్సిటీతో త్వరలో ఒప్పందం
- క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు సహకారం

(సియోల్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక నగరంగా నిర్మించనున్న ఫోర్త్‌సిటీకి స్మార్ట్ సొబగులు అద్దాలని యోచిస్తోంది. కాలుష్యరహిత విధానాలు అనుసరిస్తూ.. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో అభివృద్ధి చేసే యోచనలో ఉంది. ఇందుకోసం సియోల్‌కు 30 కిలోమీటర్ల దూరంలో స్మార్ట్ సిటీగా ఉన్న ఇంచియాన్ నగరంలో అమలు చేస్తున్న విధానాలను ఫోర్త్‌సిటీలో అనుసరించాలని భావిస్తోంది. ఈ మేరకు.. సియోల్ పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని బృందం బుధవారం ఇంచియాన్ స్మార్ట్ సిటీని, అందులో భాగంగా ఉన్న చియోంగ్న, సాంగడో, ఇయాంగ్జాంగ్ ప్రాంతాలను సందర్శించింది. అక్కడి అధికారులతో చర్చలు జరిపింది. ఇంచియాన్ నగరంలో పునరుత్పాదక విద్యుత్తు, పునర్వినియోగ నీటి పద్ధతులు, పవన, సోలార్ విద్యుత్తు వ్యవస్థలు, ఇళ్లలో ఏసీ, ఉష్ణోగ్రతల నిర్వహణ, సెక్యూరిటీ, విద్యుత్తు సరఫరా నియంత్రణ

మిగతా 13వ పేజీలో...

ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలతాయి!

ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి సహా 10 అంశాల్లో చర్యలు

ప్రధాన నేతలకు షాక్ తప్పదు

పూర్తి ఆధారాలతో ఫైళ్లు సిద్ధం

తప్పు చేసింది ఎవరైనా విడిచిపెట్టం

దక్షిణ కొరియాలో రెవెన్యూ మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళికి ముందే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజకీయ బాంబు పేల్చారు. దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో హాన్ నది పునరుజ్జీవనంపై అధ్యయనానికి వెళ్లిన పొంగులేటి అక్కడ ఓ తెలుగు చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలబోతున్నాయని.. ప్రధాన నేతలకు పెద్ద షాక్ ఇవ్వబోతున్నట్లు చెప్పారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి వంటి సుమారు 8 నుంచి 10 ప్రధాన అంశాల్లో చర్యలు

మిగతా 13వ పేజీలో...

బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాల్సిందే!

13

- అవి ఇచ్చిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపులు
- ధాన్యం మిల్లింగ్ చార్జీలు పెంచేందుకూ ఓకే
- ఈ సిఫారసులతో ధాన్యం పాలసీ-24 సిద్ధం
- నేడు సీఎం రేవంత్‌కు అందజేత

మమకారం మాయమైంది!



- సొంత తల్లీ చెల్లిపైనే ఎన్‌సీఎల్‌టీలో జగన్ కేసు
- వాటాలు, గిఫ్ట్‌డీడ్‌ల రద్దు కోరుతూ పిటిషన్
- సరస్వతీ పవర్‌లో విజయమ్మకు పూర్తి వాటా
- అంతకుముందే జగన్, భారతి గిఫ్ట్ డీడ్
- బోర్డు ఆమోదంతో వాటాల బదిలీ పూర్తి
- చెల్లదంటూ సెప్టెంబరులో జగన్, భారతి పిటిషన్
- నా సొంత తెలివితేటలతో వ్యాపారం చేశాను
- ప్రేమతో షర్మిలకు కొంత వాటా ఇవ్వాలనుకున్నా
- 2019లో షర్మిలతో ఎంవోయూ కుదిరింది
- నాపై షర్మిల బహిరంగ విమర్శలతో మనస్తాపం
- ఆమెపై ప్రేమాభిమానాలు కరిగిపోయాయి
- ఆస్తుల్లో వాటా ఇవ్వాలనుకోవడం లేదు
- సరస్వతీ పవర్ షేర్ల బదలాయింపూ చెల్లదు
- తగిన ఉత్తర్వుల కోసం ఎన్‌సీఎల్‌టీకి జగన్ విన్నపం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

నా అక్కలూ, నా అమ్మలూ, నా చెల్లెమ్మలూ అని ఎన్నికల సమయంలో మైకు పట్టుకుని ఊదరగొట్టిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల మీదే కేసు వేశారు! వారిద్దరినీ ఎన్‌సీఎల్టీ బోనులో నిలబెట్టేందుకు పావులు కదిపారు. విజయలక్ష్మి సరస్వతీ పవర్‌లో తన వాటాను షర్మిలకు అప్పగించాలని నిర్ణయించుకోవడమే దీనికి కారణం! 'నేను నీకు గిఫ్టుగా ఇచ్చిన వాటాను షర్మిలకు ఎలా ఇస్తావు?' అంటూ తల్లిని ప్రశ్నించి, గద్దించి, ఏకంగా ఎన్సీఎల్టీలో పోరాటం మొదలుపెట్టారు. గతంలో కేవలం ప్రేమాభిమానాలతో షర్మిలకు కొన్ని ఆస్తులు ఇచ్చేందుకు అంగీకరిస్తూ ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ.. ఇప్పుడు

మిగతా 14వ పేజీలో...

నాన్నకు మాటిచ్చి తప్పావ్!



- నైతికంగా పతనమయ్యావ్
- ఆస్తులు మనుమడు, మనుమరాళ్లకు సమానంగా ఇవ్వాలని నాన్న ఆదేశం
- ఒప్పందం అమలు చేయకుంటే న్యాయపరమైన చర్యలు తప్పవు
- జగన్‌కు షర్మిల హెచ్చరిక
- లేఖపై సంతకం చేసిన విజయలక్ష్మి

14

పారిశ్రామిక ఆల్కహాల్‌పై రాష్ట్రాలదే అధికారం

తయారీ, సరఫరా తదితర అన్ని ప్రక్రియలపైనా చట్టాలు చేయొచ్చు

దీనిని కేంద్రం అడ్డుకోలేదు

రాజ్యాంగంలోని ఎంట్రీ 8 స్పష్టతనిస్తోంది

1990 నాటి తీర్పును తిరగరాస్తూ సుప్రీంకోర్టు 8:1 మెజారిటీ తీర్పు

ఆ అధికారం కేంద్రానిదేనంటూ జస్టిస్ నాగరత్న విడిగా తీర్పు



న్యూఢిల్లీ, అక్టోబరు 23: పారిశ్రామిక ఆల్కహాల్ తయారీ, సరఫరాలపై నియంత్రణ అధికారం రాష్ట్రాలదేనని (శాసన సభలదేనని) సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఔషధాలు, టెక్స్‌టైల్స్, డైలు, యాంటీఫ్రీజ్ సమ్మేళనాలు, ఇంక్‌లు, సాల్వెంట్లు, క్లీనర్లు, సౌందర్య సాధనాలు తదితర ఉత్పత్తుల తయారీలో ఉపయోగించే పారిశ్రామిక ఆల్కహాల్‌పై ఇప్పటి వరకూ కేంద్రప్రభుత్వానికే నియంత్రణ ఉంటూ వస్తోంది. 1990లో సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం పారిశ్రామిక ఆల్కహాల్ (రెక్టిఫైడ్ స్పిరిట్ అని కూడా అంటారు) ఉత్పత్తి, సరఫరా తదితర ప్రక్రియలపై కేంద్రానికే అధికారం ఉంటుందని తీర్పు ఇచ్చింది. దీనిని యూపీతోపాటు పలు రాష్ట్రాలు సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలు చేశాయి. 2010లో ఈ కేసును తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనానికి సిఫార్సు చేశారు. నాటి నుంచి విచారణ కొనసాగింది. బుధవారం సుప్రీంకోర్టు 8:1 మెజారిటీ తీర్పును వెలువరించింది. ధర్మాసనానికి నేతృత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్‌తో

మిగతా 2వ పేజీలో...



బ్రిక్స్ సదస్సులో దేశాధినేతలు రమఫోసా (దక్షిణాఫ్రికా), జిన్‌పింగ్ (చైనా), పుతిన్ (రష్యా), మోదీ, షేక్ అల్ నహ్యాన్ (యూఏఈ)

ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలొద్దు!

- అందరం ఏకతాటిపై నిలిచి ఎదుర్కోవాలి.. చర్చలు, దౌత్య మార్గాలకే భారత్ మద్దతు.. యుద్ధానికి కాదు
- బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ.. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలి.. బ్రిక్స్ దేశాధినేతల తీర్మానం
- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు.. సరిహద్దు గస్తీ ఒప్పందాన్ని స్వాగతించిన నేతలు
- వివాదాలను సరైన పద్ధతిలో పరిష్కరించుకోవాలి.. భారత్-చైనా బంధం ప్రపంచానికే కీలకమన్న మోదీ

2

శారదా పీఠానికి భూకేటాయింపులు రద్దు

14

- సంబంధిత జీవోల రద్దుకు ఏపీ క్యాబినెట్ ఆమోదం
- మహిళలకు మూడు ఉచిత సిలిండర్లకూ పచ్చజెండా
- ఇసుకపై సీనరేజ్ తదితర పన్నుల రద్దు
- రాష్ట్రంలోని ఆలయాల బోర్డుల్లో సభ్యుల పెంపు
- బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు
- రివర్స్ టెండరింగ్ రద్దు.. జ్యుడీషియల్ ప్రివ్యూ కూడా
- జీవోఐఆర్ పోర్టల్ పునరుద్ధరణ.. ఏపీ మంత్రివర్గం నిర్ణయాలు

ఆర్నెల్లలో వచ్చింది 39 శాతమే!

గత ఏడాది కంటే 6% తగ్గిన రాబడి

ప్రాధమ్యాలు పెరుగుతున్న వేళ రాబడి తగ్గుదలతో సర్కారు ఆందోళన

2652 కోట్ల పన్నేతర రాబడులే ఊరట

ఆర్నెల్లలో 1,01,131 కోట్ల వ్యయం

'కాగ్' సెప్టెంబరు నెల నివేదిక



హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరంలో ఆర్నెల్లు గడిచిపోయినా రాష్ట్ర ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో ఆదాయం రాలేదు. సర్కారు అంచనాలకు, వస్తున్న రాబడులకు పొంతన ఉండడం లేదు. బడ్జెట్‌లో అంచనా వేసిన దాని కంటే చాలా తక్కువ రాబడి వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఓవైపు ప్రభుత్వ ప్రాధమ్యాలు పెరిగిపోతుండగా.. అందుకు తగ్గట్లుగా రాబడులు లేకపోవడం ఇబ్బందికరంగా మారుతోంది. మూడో దశ రుణమాఫీ, ఖరీఫ్ సీజన్ రైతు భరోసా, సమగ్ర గురుకుల విద్యాలయాల భవనాల నిర్మాణం వంటివాటికి నిధులు అవసరమైన వేళ.. రాబడి తగ్గుతుండడం ఆందోళనకరమే. ఆదాయం కోసం భూములను విక్రయించడం, తనఖా పెట్టి రుణాలు తీసుకోవడం, భూముల మార్కెట్ విలువలు, మద్యం ధరల పెంపు వంటి మార్గాలు తప్ప.. ఇతర దారులేవీ కనిపించడం లేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అంచనా వేసిన బడ్జెట్ రాబడులు కూడా తగ్గుతుండడం ప్రభుత్వాన్ని కలవరపెడుతోంది. సెప్టెంబరు నెల రాష్ట్ర ఆదాయ, వ్యయాలకు సంబంధించి 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)' బుధవారం నివేదిక విడుదల చేసింది. సెప్టెంబరుతో ఆర్థిక సంవత్సరంలో ఆర్నెల్లు గడిచిపోయినా రాబడులు మాత్రం గత ఏడాదితో పోలిస్తే తగ్గిపోయాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి ఆర్నెల్లలో అన్ని రకాల రాబడులు 45.62 శాతం నమోదు కాగా.. ప్రస్తుత ఆర్థిక

మిగతా 13వ పేజీలో...

రాజకీయ కక్షసాధింపులో భాగంగానే.. కొండా సురేఖ దిగజారుడు వ్యాఖ్యలు

- పబ్లిసిటీ కోసమే అవాస్తవ ఆరోపణలు.. వ్యక్తిగతంగా నాకు, పార్టీకి తీవ్ర నష్టం
- ఆమె వ్యాఖ్యలు ఆవేదనకు గురిచేశాయి.. నాంపల్లి కోర్టులో కేటీఆర్ వాంగ్మూలం
- తదుపరి విచారణ 30కి వాయిదా.. బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసు
- నేనూ నోటీసులతోనే బదులిస్తా.. కేటీఆర్ సుద్దపూసేమీ కాదు: బండి సంజయ్

11

సిమెంట్ ఫ్యాక్టరీ మాకొద్దు

- 'గో బ్యాక్ అంబుజా'.. ప్రజల ఆందోళన
- నిరసనల మధ్య ప్రజాభిప్రాయ సేకరణ
- యాదాద్రి జిల్లా రామన్నపేటలో ఉద్రిక్తత
- తరలివచ్చిన పరిసర గ్రామాల రైతులు
- అదనపు కలెక్టర్‌ను అడ్డుకున్న జనం



సిమెంటు ఫ్యాక్టరీని నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజలు

బాస్మతియేతర బియ్యం ఎగుమతిపై ఎంఈపీ ఎత్తివేత

2

- ప్రస్తుతం టన్నుకు రూ.41,198 రుసుం
- ఎత్తివేతతో పెరగనున్న ఎగుమతులు



గాజా ఆర్థిక పునరుజ్జీవానికి 350 ఏళ్లు!

» ఐక్యరాజ్య సమితి నివేదిక

న్యూఢిల్లీ, అక్టోబరు 23: యుద్ధం మిగిల్చే నష్టాన్ని పూడ్చడం అంత సులువు కాదు. హమాస్ లక్ష్యంగా ఇజ్రాయెల్ చేస్తోన్న యుద్ధం వల్ల దెబ్బ తిన్న గాజా పునర్నిర్మాణానికి దశాబ్దాలు పడుతుందని గతంలో చెప్పిన ఐక్యరాజ్యసమితి.. సైనిక చర్య మొదలై ఏడాదికి పైగా దాటిన వేళ ఈ గడువును పెంచింది. గాజా ఆర్థిక పునరుజ్జీవానికి శతాబ్దాలు పడుతుందని తన తాజా నివేదికలో పేర్కొంది. యుద్ధం ఇప్పటికిప్పుడు ఆగిపోయి, 2023 అక్టోబరు 7న హమాస్.. ఇజ్రాయెల్‌పై దాడి చేయకముందు నాటి ఆర్థిక పరిస్థితులు గాజాలో తిరిగి రావాలంటే 350 ఏళ్లు పడుతుందని అంచనా వేసింది. 2007-22 ఏడాదుల్లో ఉన్న సగటు వృద్ధి రేటు 0.4 శాతాన్ని చేరుకునేందుకు గాజాకు కనీసం 350 ఏళ్లు అవసరమని అభిప్రాయపడింది. వృద్ధి రేటు సగటును సాధించినా జనాభా పెరుగుదల వల్ల స్థూలజాతీయ ఉత్పత్తి, తలసరి ఆదాయం మాత్రం క్షీణిస్తూనే ఉంటాయని పేర్కొంది. యుద్ధం దెబ్బకు గాజాలోని నిర్మాణాలు, రహదారులు, కీలక మౌలిక వసతులు పూర్తిగా ధ్వంసమవ్వగా, ఎక్కడ చూసినా శిథిలాలు, కుళ్లిన శవాలు కనిపిస్తున్నాయి. పునర్నిర్మాణం కంటే ముందు వీటిని శుభ్రం చేయాల్సి ఉంది. 1670-1699 మధ్య యుద్ధాలు చేసిన ఇంగ్లండ్, నెదర్లాండ్స్ దేశాలు ఆ పరిణామాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సంగతిని ఐరాస తన నివేదికలో ప్రస్తావించింది.

ఎక్స్‌క్యూజ్‌మీ.. అగ్గిపెట్టుందా!

» గంజాయి బీడీ నిప్పుకోసం ఎక్సైజ్ ఆఫీసుకెళ్లిన విద్యార్థులు

» నిర్ఘాంతపోయిన అధికారులు.. కేసు నమోదు

ఇడుక్కి, కేరళ, అక్టోబరు 23: కేరళ రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న కొందరు విద్యార్థులు చేసిన పనికి అక్కడి అబ్కారీ పోలీసులు షాక్ తిన్నారు. విద్యార్థులు తమ వద్ద ఉన్న గంజాయి బీడీలను వెలిగించుకునేందుకు ఏకంగా వారి కార్యాలయానికే వెళ్లి 'అగ్గిపెట్టుందా!' అని అధికారులను అడిగారు. దాంతో ఎక్సైజ్ అధికారులు నిర్ఘాంతపోయారు. అయితే పొరపాటున దుకాణం అనుకొని ఎక్కడికైతే వెళ్లకూడదో అక్కడికి వచ్చామనుకొని గ్రహించిన విద్యార్థులు పరుగు పెట్టారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొన్న అధికారులు ఇద్దరు మైనర్లపై కేసులు నమోదు చేశారు. ఈ ఘటన ఆదిమలై జిల్లాలో చోటుచేసుకుంది. త్రిసూర్‌లోని ఓ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు విహారయాత్ర నిమిత్తం అక్కడకు రాగా, భోజనం చేసిన తర్వాత అందులో గంజాయికి అలవాటుపడిన కొంతమంది విద్యార్థులు అగ్గిపెట్టె కోసమని పొరపాటున ఎక్సైజ్ ఆఫీసుకే వెళ్లి ఇరుక్కున్నారు. మరో ఘటనలో ముంబై సమీపంలోని నల్లసూపర ప్రాంతానికి చెందిన 9 ఏళ్ల బాలిక.. ట్యూషన్ టీచర్ కొట్టిన దెబ్బలకు వెంటిలేటర్ పై చికిత్స పొందుతోంది. అల్లరి చేస్తుండటంతో టీచర్ కొట్టిన దెబ్బలకు బాలిక చెవి రింగులు దవడ భాగంలోకి చొచ్చుకుపోయాయి. అక్టోబరు 5న ఈ ఘటన జరిగింది. తొలుత బాలికకు వినికిడి లోపం తలెత్తింది. మెదడుకూ గాయమవడంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు.

బియ్యం ఎగుమతిపై ఎంఈపీ ఎత్తివేత

న్యూఢిల్లీ, అక్టోబరు 23: భారత్ నుంచి విదేశాలకు ఎగుమతి చేసే బాస్మతియేతర తెల్లబియ్యానికి సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బియ్యాన్ని ఎగుమతి చేసే విషయంలో టన్నుకు 490 డాలర్ల (రూ.41,198) చొప్పున ఇప్పటివరకు అమల్లో ఉన్న కనీస ఎగుమతి ధర (ఎంఈపీ)ను ఎత్తివేస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. వాస్తవానికి గత ఏడాది దేశంలో బియ్యం కొరత ఏర్పడటంతో 2023 జూలై 20న బాస్మతియేతర తెల్లబియ్యం ఎగుమతులపైనే ప్రభుత్వం నిషేధం వి ధించింది. ఈ నిషేధాన్ని ఈ ఏడాది సెప్టెంబరు 28న ఎత్తివేస్తూ.. కనీస ఎగుమతి ధరను నిర్ణయించింది. తాజాగా ఈ బియ్యం ఎగుమతులను పెంచే దిశగా ఎంఈపీని కూడా ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నోటిఫికేషన్ విడుదల చేశారు.

బంగ్లాదేశ్‌లో మళ్లీ టెన్షన్.. టెన్షన్

» హసీనా రాజీనామాపై దేశాధ్యక్షుడి వ్యాఖ్యలతో ఉద్రిక్తత

ఢాకా, అక్టోబరు 23: బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్విగ్న వాతావరణం నెలకొంది. ఆ దేశ ప్రధానమంత్రి షేక్ హసీనా రాజీనామా లేఖ గురించి బంగ్లాదేశ్ అధ్యక్షుడు షహబుద్దీన్ చేసిన వ్యాఖ్యలు అక్కడ తీవ్ర దుమారాన్ని రేపాయి. గత వారం ఓ స్థానిక వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షహబుద్దీన్ మాట్లాడుతూ.. "ఆగస్టు 5న హసీనా రాజీనామా చేసినట్లు విన్నాను కానీ దాన్ని ధ్రువీకరించేందుకు ఆమె రాజీనామా లేఖ సహా నా వద్ద ఎటువంటి ఆధారం లేదు. ఎంత ప్రయత్నించినా ఆ లేఖ లభ్యం కాలేదు. బహుశా ఆ సమయంలో హసీనాకు రాజీనామా లేఖ ఇచ్చే సమయం దొరకలేదేమో" అని వ్యాఖ్యానించారు. దాంతో ఆందోళనకారులు భగ్గుమన్నారు. అధ్యక్ష భవనం బంగభవన్‌ను ముట్టడించి షహబుద్దీన్ రాజీనామాకు డిమాండ్ చేశారు. పోలీసులు.. ఆర్మీ సిబ్బంది సాయంతో బంగభవన్ దగ్గర పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు. ఆగస్టు 5న త్రివిధదళాధిపతుల సమక్షంలో అధ్యక్షుడు షహబుద్దీన్ జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో హసీనా రాజీనామా చేశారని.. తాను ఆమోదించానని చెప్పారని, ఇప్పుడేమో తన వద్ద రాజీనామా లేఖ లేదని పేర్కొనడం సరికాదని తాత్కాలిక ప్రభుత్వ న్యాయ వ్యవహారాల సలహాదారుడు ఆసిఫ్ నజ్రుల్ దుయ్యబట్టారు.

మన ఊర్లో వర్షం 5రోజుల ముందే
తెలుసుకోవచ్చు!

» నేడు ప్రారంభించనున్న కేంద్రం.. రైతులకు ఎంతో మేలు



న్యూఢిల్లీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మనం ఉంటున్న ఊర్లోనే వర్షం ఎప్పుడు పడుతుందనే విషయాన్ని ఐదు రోజుల ముందే కచ్చితంగా తెలుసుకోగలిగితే? అది రైతులకు ఎంతో ప్రయోజనం కదూ. వరి కోతలు, ధాన్యం ఆరబోత పనులను రైతన్నలు వాయిదా వేసుకునే అవకాశం ఉంటుంది. వర్షమే కాదు.. ఉష్ణోగ్రతలు గాలుల వేగం, మేఘాల కదలిక వంటి సమగ్ర సమాచారాన్ని ఐదు రోజుల ముందే గ్రామ ప్రజలకు తెలియనుంది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టనుంది. కేంద్ర పంచాయితీరాజ్ శాఖ ప్రారంభించబోయే ఆ వినూత్న పథకానికి భారత వాతావరణ సంస్థ (ఐఎండీ), భూవిజ్ఞాన మంత్రిత్వశాఖలు సంయుక్తంగా సహకరించనున్నాయి. 'గ్రామ స్థాయిలో వాతావరణ సమాచారం' అనే శీర్షికన ఈ కార్యక్రమాన్ని గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్ సింగ్) ప్రారంభించనున్నారు. ప్రకృతు విపత్తుల సమయంలో ముందస్తు వాతావరణ సమాచారాన్ని అందించడంవల్ల గ్రామస్థులు సురక్షిత ప్రాంతాలకు తరలేవీలుంది. కేంద్ర ప్రభుత్వ 100 రోజుల కార్యక్రమంలో భాగమైన ఈ పథకం, గ్రామస్థాయి పాలనను బలోపేతం చేయడం, సాగు విధానాలను మరింత సులభతరం చేయడం, పరోక్షంగా రైతులకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం వంటి లక్ష్యాలను నెరవేరుస్తుందని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ తెలిపింది. దీనివల్ల నాట్లు, పొలాలకు సాగునీరు అందించడం, నూర్పిళ్లు వంటి వ్యవసాయ కార్యకలాపాలకు సంబంధించిన నిర్ణయాలను తీసుకోవడం రైతులకు సులభతరం అవుతుంది. కాగా తొలిసారిగా స్థానిక వాతావరణ పరిస్థితుల గురించిన తాజా సమాచారాన్ని మూడు డిజిటల్ వేదికల ద్వారా మంత్రిత్వశాఖ గ్రామ పంచాయతీలకు అందిస్తుంది. 'ఇ-గ్రామస్వరాజ్', 'మేరీ పంచాయత్ యాప్', 'గ్రామ్ మన్ చిత్ర' వేదికల ద్వారా ఈ సమాచారాన్ని గ్రామస్థాయికి చేరవేస్తారు. మేరీ పంచాయత్ యాప్' స్థానికులు నేరుగా సమస్యల గురించి చెప్పుకోవడానికి, 'గ్రామ్ మన్ చిత్ర' యాప్‌ను అభివృద్ధి ప్రణాళికా రచనల కోసం ఉద్దేశించారు.

అధికారులు, ప్రజాప్రతినిధులకు ముందస్తు శిక్షణ

'గ్రామస్థాయిలో వాతావరణ సమాచారం' కార్యక్రమ ప్రారంభం సందర్భంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని కేంద్ర భావిస్తోంది. పంచాయితీరాజ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు సహా 200 మంది శిక్షణ ఇవ్వాలని కేంద్ర యోచిస్తోంది. ముందస్తుగా వాతావరణ సమాచారాన్ని అందుకుని, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం వీరి బాధ్యత. ఉష్ణోగ్రత ఎలా ఉండబోతుంది? వర్షం వచ్చే అవకాశమెంత? గాలుల వేగం ఎలా ఉండే అవకాశం ఉంది? మేఘాల కదలిక వంటి సమాచారాన్ని గ్రామ పంచాయతీలకు వీరు అందిస్తారు.

ఉగ్రవాదంపై పోరులో
ద్వంద్వ ప్రమాణాలొద్దు!

అందరం ఏకతాటిపై నిలిచి, ఎదుర్కోవాలి.. బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

కజాన్, అక్టోబరు 23: ఉగ్రవాదం అనే సవాలును ఎదుర్కోవడంలో ద్వంద్వ వైఖరికి తావు లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అందరూ ఏకతాటిపై నిలిచి, పరస్పరం పటిష్ఠ మద్దతుతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. భారత్ ఎప్పుడూ చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడానికే మద్దతు తెలుపుతుందని.. యుద్ధానికి కాదని చెప్పారు. శాంతి చర్చల ద్వారానే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం లభిస్తుందని పునరుద్ఘాటించారు. కొవిడ్ లాంటి సవాళ్లను సమష్టిగా ఎదుర్కొన్న తరహాలోనే మనమంతా కలిసి భావి తరాలకు భద్రతమైన, పటిష్ఠమైన భవిష్యత్తును అందించేందుకు సరికొత్త అవకాశాలను సృష్టించాలని మోదీ సూచించారు. రష్యాలోని కజాన్ నగరంలో జరుగుతున్న 16వ బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సదస్సులో బుధవారం ఆయన మాట్లాడారు. రష్యా, చైనా, ఇరాన్ అధినేతలు పుతిన్, జిన్‌పింగ్, మసౌద్ పెజెష్కియన్‌ల సమక్షంలో మోదీ మాట్లాడుతూ.. బ్రిక్స్ దేశాల్లో యువతను ఉగ్రవాదం వైపు పురికొల్పడాన్ని అడ్డుకోవడానికి క్రియాశీల చర్యలు చేపట్టాలన్నారు. ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదులకు ఆర్థిక సాయాన్ని అడ్డుకోవడంలో అందరూ కలిసి పనిచేయాలని, ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు లేదని తేల్చిచెప్పారు. 'పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు' అని పేర్కొనాలంటూ ఐరాసలో చేసిన అనేక ప్రతిపాదనలను చైనా అడ్డుకున్న నేపథ్యంలో మోదీ 'ద్వంద్వ ప్రమాణాలు' వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంతర్జాతీయ ఉగ్రవాద సమస్యపై ఐరాసలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అంశాలను పరిష్కరించేందుకు కలిసి పనిచేయాలని మోదీ ఉద్ఘాటించారు. ప్రస్తుతం ప్రపంచం అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని, యుద్ధాలు, ఆర్థిక అస్థిరతలు, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. ఇక బ్రిక్స్‌లోకి కొత్త దేశాలను చేర్చుకోవడాన్ని భారత్ స్వాగతిస్తోందని చెప్పారు. గాజాస్ట్రిప్‌లో తక్షణమే, శాశ్వత కాల్పుల విరమణ పాటించాలని, ఇరువైపుల నుంచి బందీలను విడిచిపెట్టాలని బ్రిక్స్ నేతలు తీర్మానం చేశారు. అలాగే సహాయ కార్యకలాపాలు చేపడుతున్న సంస్థలపై ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని బ్రిక్స్ సభ్యులు ఖండించారు.



బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ కరచాలనం

సరిహద్దు గస్తీ ఒప్పందాన్ని స్వాగతించిన జిన్‌పింగ్, మోదీ

బ్రిక్స్ సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బుధవారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు. దాదాపు ఐదేళ్ల తర్వాత ఇద్దరు నేతలూ భేటీ కావడం ఇదే తొలిసారి. భారత్-చైనాల మధ్య సరిహద్దు గస్తీకి సంబంధించి కుదిరిన ఒప్పందాన్ని ఇరువురు నేతలూ స్వాగతించారు. విభేదాలు, వివాదాలను సరైన పద్ధతిలో పరిష్కరించుకోవడం ప్రధానమని.. వీటి ప్రభావం శాంతి, సామరస్యాలపై పడకూడదని భేటీలో మోదీ.. జిన్‌పింగ్‌కు స్పష్టం చేశారు. భారత్-చైనా సంబంధాలు కేవలం ఇరుదేశాల ప్రజలకే కాదని, ఈ ప్రాంతంతోపాటు అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలకు కూడా ప్రధానమని వ్యాఖ్యానించారు. పరస్పర గౌరవం, పరిణతితోనే భారత్, చైనాల మధ్య శాంతియుత, సుస్థిర బంధాలు ఉంటాయని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. విభేదాల పరిష్కారంలో ఇరుదేశాల ప్రతినిధులు మరింత సమర్థంగా సహకరించుకోవాల్సిన అవసరం ఉందని జిన్‌పింగ్ చెప్పారు. ఇది ఇరుదేశాలకు అత్యంత ప్రాధాన్య అంశమన్నారు. ఇక సరిహద్దు అంశంపై ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల తదుపరి సమావేశం అతిత్వరలోనే ఉంటుందని మోదీ, జిన్‌పింగ్ పేర్కొన్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాతో చెప్పారు. కాగా, బుధవారం ఉజ్బెకిస్థాన్, యూఏఈ అధ్యక్షులతో కూడా మోదీ భేటీ అయ్యారు. ఆయా దేశాధినేతలతో ఫలప్రదమైన చర్చలు జరిగినట్లు మోదీ ట్వీట్ చేశారు.

బ్రిక్స్ తెర వెనుక తెలుగు అధికారి

న్యూఢిల్లీ, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): భారత-చైనా సంబంధాల్లో నూతన అధ్యాయానికి తెరలేపిన చరిత్రాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం వెనుక కీలక పాత్ర పోషించింది మన తెలుగోడే! ఈ సమావేశానికి రూపకల్పన చేసింది, బుధవారం పది దేశాలు ఆమోదించిన తీర్మానాన్ని రూపొందించింది.. భారత విదేశాంగ శాఖలో పనిచేస్తున్న సీనియర్ అధికారి దమ్ము రవి. విదేశాంగ శాఖలో ఆర్థిక సంబంధాల కార్యదర్శిగా ఉన్న ఆయన.. ఈ సమావేశాలకు ప్రధాన సంధానకర్త (షెర్పా)గా వ్యవహరించారు. కాగా ఈ సదస్సులో ఒకరి కరెన్సీని మరొకరు గుర్తించడం, వాతావరణ మార్పు, ఉగ్రవాదంపై పోరు, ఆర్థిక సంబంధాలు, ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలు మొదలైన వాటిపై చర్చలు జరిగాయని దమ్ము రవి విలేకరులకు తెలిపారు. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన ఆయన.. 1989లో భారత విదేశాంగ సర్వీసులో చేరారు.


విమానాలకు బాంబు బెదిరింపుల వ్యవహారం..

ఎక్స్‌పై కేంద్రం కన్నెర్ర!

» నేరానికి ఊతమిస్తున్నట్టుగా ఉందంటూ ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్టోబరు 23: కొద్ది రోజులుగా దేశీయ, అంతర్జాతీయ విమానాలకు వస్తున్న వరుస బాంబు బెదిరింపులు అటు విమానయాన సంస్థలు, కేంద్ర ప్రభుత్వం ఇటు ప్రయాణికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. అయితే సోషల్ మీడియా వేదికగా వస్తున్న బెదిరింపులకు సంబంధించి కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సంకేత్ ఎస్ బోండ్వే అధ్యక్షతన విమానయాన సంస్థలు, సోషల్ మీడియా దిగ్గజాలైన ఎక్స్, మెటా వంటి సంస్థల ప్రతినిధులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఎక్స్ వేదికగా బెదిరింపులు రావడంతో వాటి కట్టడి విషయంలో ఆ సంస్థ తీరుపై కేంద్రం తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ పరిస్థితిపై ఎక్స్ తీరు నేరానికి ఊతమిస్తున్నట్టుగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అలాగే ఇలాంటి ఆందోళనకరమైన వదంతులను నిలువరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. విమానాలకు బెదిరింపుల మెసేజ్‌లు పోస్ట్ చేసిన యూజర్ల ఐడీ లేదా అకౌంట్ల డొమైన్‌కు సంబంధించిన వివరాలను ఢిల్లీ పోలీసులు పొందడంలో విఫలమవడమే కేంద్రం ఆ సంస్థపై కన్నెర్రజేయడానికి కారణమని సమాచారం. బాంబు బెదిరింపులకు సంబంధించి ఢిల్లీ పోలీసులు ఎనిమిది ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు.

లోకం తీరు



పారిశ్రామిక ఆల్కహాల్‌పై
రాష్ట్రాలదే అధికారం

(మొదటి పేజీ తరువాయి)

పాటు జస్టిస్‌లు రిషికేశ్ రాయ్, అభయ్ ఒకా, జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రా, ఉజ్జల్ భుయాన్, సతీశ్ చంద్ర శర్మ, అగస్టీన్ జార్జ్ మాసి 364 పేజీల మెజారిటీ తీర్పును ఇచ్చారు. దీనితో జస్టిస్ నాగరత్న విభేదిస్తూ.. పారిశ్రామిక ఆల్కహాల్‌పై చట్టాలు చేసే అధికారం రాష్ట్రాల శాసనసభలకు అధికారం ఉండదని, ఆ అధికారం పార్లమెంటుదేనని విడిగా తీర్పును ప్రకటించారు.

ఇది కూడా 'మత్తు ద్రావకాల' పరిధిలోకే!

రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో రాష్ట్రాల జాబితాలో ఉన్న ఎంట్రీ 8లోని 'మత్తు కలిగించే ద్రావకాలు' అనే పదం పరిధిలోకి పారిశ్రామిక ఆల్కహాల్ కూడా వస్తుందని సీజేఐ వెలువరించిన మెజారిటీ తీర్పులో స్పష్టం చేశారు. 'మత్తు కలిగించే ద్రావకాల' తయారీ, నిల్వ, రవాణా, కొనుగోళ్లు, అమ్మకాలపై చట్టాలు చేసే అధికారం రాష్ట్రాలదేనని ఎంట్రీ 8 నిర్వచిస్తున్న విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. అయితే, రాజ్యాంగంలోని కేంద్రప్రభుత్వ జాబితాలో ఉన్న ఎంట్రీ 52, ఉమ్మడి జాబితాలోని ఎంట్రీ 33.. ఏయే పరిశ్రమలపై కేంద్రానికి అధికారం కట్టబెడుతూ పార్లమెంటు చట్టం చేస్తుందో ఆ పరిశ్రమలపై కేంద్రానికే సర్వాధికారాలు ఉంటాయని చెబుతోంది. ఎంట్రీ 52 ఆధారంగానే 1990లో పారిశ్రామిక ఆల్కహాల్‌పై కేంద్రానికే అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. తాజాగా దీనిని తిరగరాస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఎంట్రీ 52 కింద కేవలం ఒక డిక్లరేషన్ జారీ చేసి యావత్ పరిశ్రమను కేంద్రం పరిధిలోకి తీసుకొచ్చేలా పార్లమెంటు చట్టం చేయలేదని ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ నాగరత్న విడిగా 238 పేజీల తీర్పునిచ్చారు. ఫర్మెంటేషన్ (పులియబెట్టే ప్రక్రియలకు సంబంధించిన) పరిశ్రమలన్నింటిపై చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకే ఉందని, రాష్ట్రాల శాసనసభలకు ఆ అధికారం లేదని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

మీలో ఒకరిగా.. మీ కుటుంబసభ్యురాలిగా ఉంటా!

» వయనాడ్‌లో నామినేషన్ వేసిన ప్రియాంక గాంధీ

వయనాడ్, అక్టోబరు 23: తనను గెలిపిస్తే మీలో ఒకరిగా.. ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని వయనాడ్ ప్రజలకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా హామీ ఇచ్చారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల బరిలో దిగిన ఆమె బుధవారం భారీ రోడ్డుషో నిర్వహించి నామినేషన్ వేశారు. తద్వారా ప్రత్యక్ష ఎన్నికల్లోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా తనకు ఘన స్వాగతం పలికేందుకు హాజరైన వేలాది మంది ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర పార్టీ సీనియర్ నాయకులు ఈ సభలో పాల్గొన్నారు. ప్రియాంక తన ప్రసంగంలో రాజకీయాల్లో తనకు 35 ఏళ్ల అనుభవం ఉందని పేర్కొన్నారు. 17 ఏళ్ల వయస్సులోనే తన తండ్రి దివంగత రాజీవ్ గాంధీ కోసం 1989లో ప్రచారం చేశానని చెప్పారు. బీజేపీ నుంచి వయనాడ్ ఉప ఎన్నికల బరిలో దిగిన నవ్య హరిదాస్.. ప్రజలకు ప్రాతినిధ్యం వహించడంలో ప్రియాంకకన్నా తనకు ఎంతో అనుభవం ఉందని వ్యాఖ్యానించిన నేపథ్యంలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడినప్పుడు తాను ఇక్కడికి వచ్చానని, అప్పుడు తాను కలుసుకున్న వారందరూ బాధితులకు సాయం చేసినవారేనని ప్రియాంక తన ప్రసంగంలో తెలిపారు. వారి ధైర్యం తనను కదిలించిందన్నారు. మీలో ఒకరిగా, మీ కుటుంబసభ్యురాలిగా ఉండడం తనకు గౌరవం, అదృష్టం అవుతుందన్నారు. ప్రపంచమంతా తన సోదరుడు రాహుల్‌కి వెన్ను చూపినప్పుడు వయనాడ్ ప్రజలు అండగా నిలిచారని పేర్కొన్నారు. "మీ సమస్యలపై పోరాడతాను, ప్రతి ఒక్కరికి అండగా ఉంటాను" అని చెప్పారు. కేంద్రంలో బీజేపీ పాలనను వివరిస్తూ... తమను ఎన్నుకొన్న ప్రజలనే అధికారంలో ఉన్నవారు విభజించే పరిస్థితి నెలకొందన్నారు. వారు ప్రజాస్వామ్యాన్ని అణచివేయడానికి వెనుకాడరని ఆమె విమర్శించారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రియాంక గాంధీ

రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. తనను ఆదరించినట్లే తన సోదరిని కూడా ఆదరించాలని వయనాడ్ ప్రజలను కోరారు. రాహుల్ వయనాడ్‌తోపాటు యూపీలోని రాయబరేలి నుంచి లోక్‌సభకు ఎన్నికయి.. వయనాడ్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించడంతో ఇక్కడ ఉప ఎన్నిక తప్పనిసరి అయ్యింది. బహిరంగ సభలో ప్రసంగం అనంతరం ప్రియాంక వయనాడ్ కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె వెంట రాహుల్, సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఉన్నారు. అనంతరం రాహుల్, ప్రియాంక వయనాడ్‌లో కొండచరియలు పడి ప్రాణాలు కోల్పోయిన వారిని ఖననం చేసిన పుతుమల సామూహిక శ్మశానవాటికకు చేరుకుని నివాళులు అర్పించారు. కాగా తనకు రూ. 12 కోట్ల ఆస్తులు ఉన్నాయని ప్రియాంక తన నామినేషన్ పత్రాల్లో పేర్కొన్నారు.

'ఎక్స్'ను తొక్కేసేందుకు కుట్ర!

» కమలాహ్యారిస్ టీమ్‌పై మస్క్ ఆగ్రహం

» కమలకు మద్దతుగా నిలిచిన సంస్థకు రూ.420 కోట్ల విరాళం ఇచ్చిన బిల్‌గేట్స్

న్యూయార్క్, అక్టోబరు 23: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్‌కు చెందిన టీమ్.. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'ను తొక్కేయడానికి ప్రణాళికలు రచిస్తోందని ఈలన్ మస్క్ ఆరోపించారు. కమల ఎన్నికల ప్రచార బృందంలో.. బ్రిటన్‌కు చెందిన మోర్గాన్ మెక్‌స్వీనీ అనే వ్యూహకర్త ఉన్నారు. అతడి నేతృత్వంలో నడుస్తున్న 'సెంటర్ ఫర్ కౌంటరింగ్ డిజిటల్ హేట్ (సీసీడీహెచ్)' అనే సంస్థ ఈ ఏడాది మార్చిలో రూపొందించుకున్న కొన్ని వ్యూహాలకు సంబంధించిన పత్రాలను 'ద డిజిన్ఫర్మేషన్ క్రానికల్' బయటపెట్టింది. అందులో.. 'కిల్ మస్క్స్ ట్విటర్' అనే శీర్షికతో సవివర ప్రణాళిక ఉండడం గమనార్హం. దీన్ని మస్క్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. 'ఎక్స్'ను తొక్కేయడం ద్వారా అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడానికి కుట్ర పన్నుతున్నారని.. ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యం అమెరికా చట్టాల ప్రకారం నేరమని పేర్కొన్నారు. మరోవైపు.. ట్రంప్, కమలా హ్యారిస్ మధ్య 'నువ్వా నేనా' అన్నట్టుగా సాగుతున్న ఎన్నికల పోరు పతాకస్థాయికి చేరుకుంది! నవంబరు 5న ఎన్నిక జరగనున్న నేపథ్యంలో.. ఇరువురు నేతలూ పోటాపోటీగా ప్రచారం సాగిస్తున్నారు. అదే సమయంలో.. అపర కుబేరులైన ఇద్దరు టెక్ దిగ్గజాలు వీరిలో చెరొకరికీ తమ మద్దతు ప్రకటించడం విశేషం. 'స్పేస్‌ఎక్స్', టెస్లా వంటి సంస్థల వ్యవస్థాపకుడు ఈలన్ మస్క్ చాలాకాలంగా ట్రంప్‌కు అనుకూలంగా 'ఎక్స్'లో వ్యాఖ్యలు చేస్తుండగా.. మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కమలాహ్యారిస్‌కు పరోక్ష మద్దతు ప్రకటించారు. ఆమెకు మద్దతుగా ప్రచారం చేస్తున్న 'ఫ్యూచర్ ఫార్వర్డ్' అనే స్వచ్ఛంద సంస్థకు 5 కోట్ల డాలర్ల విరాళం ఇచ్చారు. 5 కోట్ల డాలర్లంటే.. మన కరెన్సీలో దాదాపు రూ.420 కోట్లు. బిల్‌గేట్స్ ఇచ్చిన ఈ విరాళం గురించి న్యూయార్క్ టైమ్స్ వార్తాసంస్థ వెల్లడించింది. మరోవైపు.. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి నెల రోజులకు పైగా జరుగుతున్న ముందస్తు ఓటింగ్ ప్రక్రియలో ఇప్పటిదాకా 2.1 కోట్ల మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

దక్షిణాదిన జన ఆందోళన!

జనాభా తగ్గుదలపై ఆంధ్ర, తమిళనాడుల్లో కలవరం

» భవిష్యత్‌లో యువత కంటే వృద్ధుల సంఖ్య పెరిగే ప్రమాదం

» నియోజకవర్గాల పునర్విభజన పైనా జనాభా లెక్కల ప్రభావం

» ఎక్కువ మంది పిల్లలను కనాలని ఏపీ సీఎం చంద్రబాబు పిలుపు

» తమిళనాడు సీఎందీ అదేమాట



న్యూఢిల్లీ, అక్టోబరు 23: దేశంలో జనాభా అపరిమితంగా పెరిగిపోవడంతో 40-50 ఏళ్ల క్రితం దాని నియంత్రణకు కేంద్ర, రాష్ట్రాలు నడుం బిగించాయి. జనాభా నియంత్రణ విధానాలు గట్టిగా అమలు చేశాయి. ముఖ్యంగా దక్షిణ భారతం ఈ విషయంలో ముందంజలో ఉంది. అయితే భవిష్యత్‌లో ఇదే తమకు ముప్పు తెచ్చిపెట్టే పరిస్థితి ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నేతలు ఆందోళన చెందుతున్నారు. వృద్ధుల జనాభా పెరిగిపోతుండగా.. జననాల రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేటు-టీఎఫ్ఆర్.. ప్రతి మహిళ తన జీవితకాలంలో కనే పిల్లల సగటు శాతం) తగ్గిపోతోంది. త్వరలోనే జనాభా లెక్కల సేకరణ ప్రారంభం కానుంది. దక్షిణాది జనాభా తగ్గిపోయే అవకాశం ఉందని.. ఇది వనరుల పంపిణీపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయా రాష్ట్రాలు అంటున్నాయి. అంతేగాక.. జనాభాను బట్టి జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది వాటా, పలుకుబడి తగ్గిపోతాయన్న ఆందోళన కూడా ఏర్పడింది. ఇన్నాళ్లూ జనాభా నియంత్రణ పాటిస్తే ప్రభుత్వాలు ప్రోత్సాహకాలిచ్చేవి. ఇప్పుడు ఎక్కువ మందిని కనాలని.. అలా కంటే ప్రోత్సాహకాలిస్తామని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు తాజాగా ప్రకటించారు. ఇందుకోసం ఓ చట్టం తెచ్చే యోచనలో ఉన్నామని సరిగ్గా ఐదు రోజుల కిందట బహిరంగ సభలో వెల్లడించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఒకడుగు ముందుకేసి.. తాజా జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే.. జాతీయ స్థాయిలో తమిళనాడు రాజకీయ పలుకుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని మూడ్రోజుల కిందట అన్నారు. జనాభా నియంత్రణలో దక్షిణ రాష్ట్రాలు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశంలో విజయాలు సాధించిన రాష్ట్రాలను నియోజకవర్గాల పునర్విభజన సమయంలో శిక్షించరాదన్నారు. జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ సీట్ల కేటాయింపు జరుగుతుందా అని ప్రశ్నించారు. అలా జరక్కుండా ఓ చక్కటి ఫార్ములాను రూపొందించాలని సూచించారు. 2031 జనాభా లెక్కల తర్వాత చేసే నియోజకవర్గాల పునర్విభజనలో లోక్‌సభ స్థానాలను జనసంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయాల్సి ఉండగా.. 2026లోనే సర్దుబాటు చేయాలని వాజపేయి ప్రభుత్వం 2001లో రాజ్యాంగ సవరణ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. రాజకీయాల సంగతి అటుంచితే దక్షిణ భారతంలో జననాల రేటు.. భర్తీ స్థాయి కంటే బాగా తగ్గిపోయిందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్)-5లో కూడా వెల్లడైంది. వాస్తవానికి ఈ ఏడాది జూలై 27న ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో.. జనాభా నిర్వహణ విధానాలను రాష్ట్రాలు సొంతగా రూపొందించుకోవలసిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. వృద్ధుల సంఖ్య పెరిగిపోతున్న సమస్యను అధిగమించడానికి చేపట్టే జనాభా నిర్వహణ విధానాలను కేంద్రం ప్రోత్సహిస్తుందని ప్రధాని తన ముగింపు ఉపన్యాసంలో పేర్కొనడం గమనార్హం. జనాభా నియంత్రణలో భాగంగా ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉన్నవారు స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధిస్తూ చాలా రాష్ట్రాలు చట్టాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం.. బిహార్, యూపీ, జార్ఖండ్ రాష్ట్రాల్లో మాత్రమే భర్తీ స్థాయి (2.1) కంటే టీఎఫ్ఆర్ ఎక్కువగా ఉంది. 15 ఏళ్ల నుంచి 49 ఏళ్లలోపు మహిళల్లో టీఎఫ్ఆర్ జాతీయ సగటు 1981 జనాభా లెక్కల ప్రకారం 4.5గా ఉండగా.. 1991లో 3.6, 2001లో 2.5, 2011లో 2.2గా ఉందని.. తన సర్వేలో ఇది 2.0 అని ఈ సర్వే వెల్లడించింది.

ఒక్కో పార్టీ 85 చోట్ల పోటీ!

మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ సీట్ల పంపకం కొలిక్కి

ముంబై, అక్టోబరు 23: మహారాష్ట్రలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు విపక్ష కూటమి మహా వికాస్ అఘాడీ (ఎమ్‌వీఏ) సీట్ల పంపకం ఓ కొలిక్కి వచ్చింది. ఆ కూటమిలో ప్రధాన పక్షాలైన కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే శివసేన, శరద్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చెరో 85 సీట్లలో పోటీ చేసేందుకు ఒప్పందం చేసుకున్నాయి. మొత్తం 288 అసెంబ్లీ నియోజకవర్గాలున్న ఆ రాష్ట్రంలో 270 స్థానాల గురించి ఏకాభిప్రాయం కుదరగా.. మిగిలిన 18 సీట్ల గురించి సమాజ్‌వాదీ పార్టీ సహా ఇతర భాగస్వామ్యపక్షాలకు ఇచ్చేందుకు చర్చలు జరుపుతున్నట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ అధినేత నానా పటోలే బుధవారం చెప్పారు. మరోవైపు అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) 38 అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసింది. 32 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈ జాబితాలో చోటిచ్చింది. పార్టీ అధినేత అజిత్ పవార్ తమ కుటుంబానికి కంచుకోట అయిన బారామతి నుంచి పోటీ చేయనున్నారు.

ఐదుగురి పేర్లను ప్రకటించిన మజ్లిస్

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మజ్లిస్ పార్టీ సమాయత్తమవుతోంది. మొత్తం 40 స్థానాల్లో రంగంలోకి దిగాలని భావిస్తున్న మజ్లిస్ బుధవారం ఐదుగురు అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటించింది. ధూలే సిటీ నుంచి పోటీకి దిగనున్న సిటింగ్ ఎమ్మెల్యే షా ఫరూఖ్ అన్వర్‌కు హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం దారుల్ సలాంలో అసదుద్దీన్ ఒవైసీ బీ ఫాం అందజేశారు. మాలేగావ్ సెంట్రల్ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే ముఫ్తీ మహ్మద్ ఇస్మాయిల్ అబ్దుల్, ఔరంగాబాద్ నుంచి ఇంతియాజ్ జలీల్, షోలాపూర్ నుంచి ఫరూఖ్ మహ్మద్ ఖలీల్‌షాహి, వెర్సోవా నుంచి రయీస్ లష్కారియా పోటీ చేయనున్నట్లు మజ్లిస్ పార్టీ ప్రకటించింది. 2019 ఎన్నికల్లో 40 స్థానాల్లో బరిలోకి దిగిన మజ్లిస్ 2 చోట్ల విజయం సాధించింది.

సోయాబీన్ కొనుగోలు పరిమితి 10 క్వింటాళ్లకు పెంపు

- మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సోయాబీన్ కొనుగోలు పరిమితిని ఎకరానికి 10 క్వింటాళ్లకు పెంచినట్లు తెలంగాణ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి తెలిపారు. మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ఎకరానికి 6 క్వింటాళ్లు మాత్రమే సేకరించాలనే నిబంధన ఉండేదని తెలిపారు. పెరిగిన దిగుబడి దృష్ట్యా 6క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్లకు పరిమితి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసి... ప్రత్యేక అనుమతి తీసుకున్నట్లు గంగారెడ్డి వెల్లడించారు. కనీస మద్దతు ధర (క్వింటాలుకు రూ.4,892)కు ఎకరానికి 10 క్వింటాళ్ల చొప్పున సేకరిస్తామని చెప్పారు. దీంతో ఇక రైతులు దళారులకు సోయాబీన్ విక్రయించుకునే పరిస్థితి ఉత్పన్నం కాదన్నారు. మార్క్‌ఫెడ్‌తోపాటు నాఫెడ్ కూడా సోయాబీన్ కొనుగోళ్లు చేస్తున్నదని తెలిపారు. ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగైందని, సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు.

2021లోనే బ్యారేజీల్లో లోపాలు గుర్తించాం

అప్పుడే నివేదికలు ఇచ్చినా చర్యలు తీసుకోలేదు.. కాళేశ్వరం కమిషన్ ఎదుట ఓఅండ్ఎం ఈఎన్‌సీ

- 120 ప్రశ్నలు.. మూడున్నర గంటల విచారణ

హైదరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాలను గుర్తించి, 2021 అక్టోబరు, నవంబరులోనే రామగుండం ఈఎన్‌సీగా ఉన్న నల్లా వెంకటేశ్వర్లుకు నివేదికలు ఇచ్చినా... నష్ట నివారణ చర్యలు తీసుకోలేదని ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) బి.నాగేంద్రరావు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో భాగంగా బుధవారం ఈఎన్‌సీ నాగేంద్రరావును కమిషన్ విచారించింది. దాదాపు మూడున్నర గంటల పాటు 120కి పైగా ప్రశ్నలు వేసి.. సమాధానాలు రాబట్టింది.

బ్యారేజీల వైఫల్యానికి ఓ అండ్ ఎం కూడా ఒక కారణమేనా?

ఈఎన్‌సీ(ఓఅండ్ఎం)కి క్షేత్ర స్థాయిలో అధికారుల వ్యవస్థ లేదు. ఏమైనా సమస్యలున్నాయని క్షేత్రస్థాయి నుంచి సమాచారం అందితే.. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అయితే, కాళేశ్వరంలోని 4 బ్యారేజీల్లో సమస్యలు/లోపాలు ఉన్నట్లు రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు నుంచి మాకు ఎప్పుడూ రిపోర్టులు రాలేదు. కానీ, 2021అక్టోబరు 25, మళ్లీ నవంబరు 24న బ్యారేజీలను పరిశీలించినప్పుడు.. ఎగువ, దిగువ భాగంలో సీసీ బ్లాకులు చెల్లాచెదురైనట్లు, వేరింగ్ కోట్ దెబ్బతిన్నట్లు గుర్తించి, ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లుకు నివేదికలు ఇచ్చాం. వాటి ఆధారంగా బ్యారేజీల రక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. ఆ పని చేయలేదు.

తనిఖీ నివేదికలు మీ వద్ద ఉన్నాయా?

ఉన్నాయి. ఇవిగో నివేదికలు అని కమిషన్‌కు రెండు రిపోర్టులు ఇచ్చారు.

డిఫెక్ట్ లయబులిటీ కాలంలో మరమ్మతులు చేయాలని నిబంధనల్లో ఉందా?

నిర్మాణం పూర్తయ్యాక రెండేళ్లపాటు డిఫెక్ట్ లయబులిటీ కాలం(డీఎల్‌పీ)ఉంటుంది. ఆ కాలంలో బ్యారేజీ దెబ్బతింటే... మరమ్మతుల బాధ్యత నిర్మాణ సంస్థదే. డీఎల్‌పీలో బ్యారేజీల రక్షణకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని, వానాకాలానికి ముందు, తర్వాత, మధ్యలో తనిఖీలు చేసి, నివేదికలు అందించాలని కోరినా.. వాళ్లు పట్టించుకోలేదు. ఐఎస్ కోడ్‌ను, సీడబ్ల్యూసీ మ్యానువల్‌ను పాటించలేదు.

బ్యారేజీల నిర్మాణం, డీఎల్‌పీ పూర్తయినట్లు సర్టిఫికెట్లు ఇచ్చారా? బ్యారేజీలు డ్యామ్ సేఫ్టీ చట్టం పరిధిలోకి వచ్చాయా?

బ్యారేజీల నిర్మాణం, డీఎల్‌పీ పూర్తయినట్లు ఎటువంటి సమాచారం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు ఇవ్వలేదు. 2021లో డ్యామ్‌సేఫ్టీ చట్టం అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత 2023లో కొన్ని సవరణలు చేశారు. ఆ సవరణల ప్రకారం స్పెసిఫైడ్ ప్రాజెక్టుల జాబితాలో బ్యారేజీలను చేర్చారు. గేట్ల ఆపరేషన్ ప్రొటోకాల్‌ను పాటించినట్లు సమాచారం లేదు. దాంతో వరద ఉధృతికి దిగువ భాగంలో నిర్మాణాలన్నీ దెబ్బతిన్నాయి.


కమిషన్ ఎదుట విచారణకు హాజరైన ఈఎన్‌సీ (ఓ అండ్ఎం) నాగేంద్రరావు

బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయాలని ఆదేశించింది ఎవరు?

నీటి నిల్వలు పెంచాలని మేము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. రామగుండం ఈఎన్‌సీకి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లున్నాయి.

గేట్ల ఆపరేషన్ షెడ్యూల్ పాటించకపోవడం వల్లే మేడిగడ్డ కుంగిందా?

మేడిగడ్డ కుంగుబాటుకు కారణాలు తెలియదు. నిర్మాణ సంస్థలు పనులు చేశాయా...? లేదా అనేది తెలియదు.

బ్యారేజీల్లో డ్యామేజీ జరిగినట్లు గుర్తించినప్పటికీ వాటిని సరిచేయకుండా బిల్లులు విడుదల చేశారా?

బ్యారేజీలను తనిఖీలు చేసి, డ్యామేజీ జరిగినట్లు నివేదికలు ఇచ్చినా చర్యలు తీసుకోలేదు. ప్రొటెక్షన్ వర్క్‌లు చేపట్టాలని కోరినా పట్టించుకోలేదు.

అలాంటప్పుడు ఈఎన్‌సీ ఓ అండ్ ఎం పోస్టు ఎందుకు? అలంకారానికా?

బ్యారేజీల్లో ఓ అండ్ ఎం పనులు చేసే బాధ్యత చీఫ్ ఇంజనీర్‌దే. ప్రాజెక్టుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ప్రతిపాదనలు తెప్పించుకొని, వాటి ప్రకారం పనులు చేయించాలని కోరడమే మా బాధ్యత. మ్యానువల్, సర్క్యులర్ల జారీ, వాటిని పాటించాలని కోరడం వరకే మా బాధ్యత.

బ్యారేజీల్లో నిల్వలు తగ్గిస్తే పనులు చేస్తామని నిర్మాణ సంస్థలు కోరాయా?

బ్యారేజీల్లో నీటి నిల్వ వల్ల ఎగువ భాగంలో మరమ్మతులు చేయలేని పరిస్థితి ఉండడం వాస్తవమే. కానీ.. దిగువ భాగంలోనూ మరమ్మతులు చేయలేదు. నిర్మాణ సంస్థలు ఆ విధంగా కోరినట్లు సమాచారం లేదు.

బ్యారేజీల్లో లోపాలున్నాయని నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోని అధికారులెవరు? వారిపై ఫిర్యాదు చేశారా?

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఆ తర్వాత ఎస్ఈలు, సీఈలదే బాధ్యత. వారిపై యాక్షన్ టేకెన్ రిపోర్టును మాత్రమే కోరాం.

ఈ బ్యారేజీలు నీటి నిల్వ కోసం కాదని మీకు తెలుసా? నిల్వ వల్లే ఇసుక జారి.. బ్యారేజీ కుంగింది వాస్తవమేనా?

నిజమే. ఉన్నతస్థాయి ఆదేశాల వల్లే నీటిని నిల్వ చేశారు. నీటి నిల్వ వల్ల బ్యారేజీలపై ఒత్తిడి పెరిగి... ఇసుక జారే అవకాశాలుంటాయి.

మూడు బ్యారేజీలు సంపూర్ణంగా పూర్తయ్యాయా?

అన్నారం, సుందిళ్లలో పనులు పూర్తయ్యాయి. మేడిగడ్డలో నిబంధనల ప్రకారం పనులు జరగలేదు. నిర్మాణ బాధ్యతలు చూసే అధికారులే పరీక్షలు చేసి, మెటీరియల్‌ను వినియోగించడానికి అనుమతించాల్సి ఉంటుంది.

మరో ఇద్దరు అధికారుల విచారణ

వరదల అనంతరం బ్యారేజీలు ఏమైనా దెబ్బతిన్నాయా? లేదా?అని పరిశీలించడానికి మనస్సాక్షిగా అంగీకరించలేదా? అని క్వాలిటీ కంట్రోల్ మాజీ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్‌ను కమిషన్ ప్రశ్నించగా... నిర్మాణం అనంతరం బ్యారేజీల తనిఖీ బాధ్యత తమపై ఉండదని, నిర్మాణం జరిగే క్రమంలో బిల్లులు ఇచ్చే క్రమంలో క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ అవసరమని అజయ్‌కుమార్ బదులిచ్చారు. డిఫెక్ట్ లయబులిటీ కాలంలో పనులు చేయకపోతే నిర్మాణ సంస్థలపై ఏమైనా చర్యలు తీసుకున్నారా? అని మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్దార్ ఓంకార్ సింగ్‌ను కమిషన్ ప్రశ్నించగా.. అసంపూర్తి పనులపై నిర్మాణ సంస్థలకు నోటీసులు ఇచ్చామని బదులిచ్చారు.

నేడు విచారణకు నల్లా వెంకటేశ్వర్లు

రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును కాళేశ్వరంవిచారణ కమిషన్ గురువారం మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. ఇప్పటికే ఒకసారి విచారణ పూర్తికాగా.. గురు,శుక్రవారాల్లో ప్రశ్నించే అవకాశం ఉంది.

భూముల కేటాయింపుపై ప్రశ్నల వర్షం

- ఐఏఎస్ అమోయ్ కుమార్‌ను 7 గంటలపాటు విచారించిన ఈడీ ప్రత్యేక బృందం అధికారులు
- నేడు మరో సారి విచారణకు రావాలని ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ కలెక్టర్, ప్రస్తుత పశుసంవర్థక శాఖ సంయుక్త కార్యదర్శి అమోయ్ కుమార్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు హాజరయ్యారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి చేరుకున్న అమోయ్‌ని సాయంత్రం వరకు ఈడీ ప్రత్యేక బృందం ప్రశ్నించింది. సమన్లలో పేర్కొన్న విధంగా పలు పత్రాలను అమోయ్ వెంట తీసుకెళ్లగా... ఈడీ అధికారులు వాటిని పరిశీలించినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా అమోయ్ పని చేసినప్పుడు మహేశ్వరం మండలం నాగారంలో వందల కోట్ల రూపాయల విలువైన భూదాన్ భూముల్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన అంశంపైనే ఈడీ అధికారులు ప్రధానంగా ప్రశ్నించినట్లు తెలిసింది. నాగారంలో 42 ఎకరాల ప్రభుత్వ భూమిని మహేశ్వరం తహసీల్దార్ జ్యోతి, మరికొందరు అధికారులు కలిసి ప్రైవేటు సంస్థకు అప్పగించగా.. ఈ విషయమై స్థానికులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు జ్యోతితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై గతంలోనే విజిలెన్స్ విభాగం విచారణ జరిపింది. పోలీసు కేసు, విజిలెన్స్ విచారణ ఆధారంగా ఐఏఎస్ అమోయ్ కుమార్‌ను ఈడీ బృందం ప్రశ్నించినట్లు తెలిసింది. అమోయ్ కుమార్ కలెక్టర్‌గా ఉన్న సమయంలోనే శేరిలింగంపల్లి, నానక్‌రాంగూడ భూములకు సంబంధించి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటి విషయంలోనూ ఈడీ అధికారులు ఆరా తీశారు. అమోయ్ కుమార్‌ను 7 గంటల పాటు సుదీర్ఘంగా విచారించిన ఈడీ.. గురువారం మరోసారి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. విచారణ అనంతరం తిరిగి వెళ్లే సమయంలో మీడియాతో మాట్లాడేందుకు అమోయ్ కుమార్ నిరాకరించారు.

నాయకుల మెడకు ఈడీ ఉచ్చు

మహేశ్వరం పరిధిలోని భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే క్రమంలో జరిగిన వందల కోట్ల లావాదేవీల్లో అప్పటి ప్రభుత్వంలో కీలక నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలున్నాయి. ఇద్దరు మంత్రులతోపాటు వారి కుటుంబ సభ్యులకు పెద్దమొత్తంలో డబ్బులు ముట్టాయని ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా మహేశ్వరం భూముల విషయంలో విచారణ జరుపుతున్న ఈడీ మరింత లోతుగా ముందుకెళ్తే గత ప్రభుత్వ నాయకుల ప్రమేయం కూడా బయటపడే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు తమ వద్ద ఉన్న సమాచారం మేరకు ఐఏఎస్ అమోయ్‌ని విచారిస్తున్న ఈడీ బృందం... తమకు లభించే వివరాల మేరకు అవసరమైతే నాయకులకు నోటీసులు జారీ చేసి ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బాంబు భయాలు

భారతీయ విమానాలకు ఒక్కసారిగా పెరిగిన బాంబు బెదిరింపు కాల్స్ మన వ్యవస్థలకు పెను సవాల్ విసురుతున్నాయి, మన సామర్థ్యానికి అగ్నిపరీక్ష పెడుతున్నాయి. వందకుపైగా బెదిరింపు కాల్స్‌తో పౌర విమానయానరంగం అప్పటికే వొణికిపోతుండగా, ఒక్క మంగళ వారం నాడే మరో యాభై బెదిరింపులు కాల్స్ రావడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. బాంబు బెదిరింపు కాల్స్ చేసినవారిని వదిలేది లేదని, జీవిత ఖైదు విధించేట్టుగా చట్టాలు చేస్తామని, వారిని జీవితంలో విమానం ఎక్కబోనివ్వమని పౌర విమానయానమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గట్టిగా బెదిరించినా ఈ ఉధృతి తగ్గలేదు. వారం రోజుల్లో మొత్తం 169 విమానాలకు బెదిరింపులు రావడమే కాక, దేశీయ సర్వీసులతో పాటు అంతర్జాతీయ నగరాలకు వెళ్ళే విమానాలకు కూడా అవి విస్తరించడం పెను సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. ఒకపక్కన ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నా, మెయిల్ ద్వారా హెచ్చరికలు వస్తున్నాయంటే, ఈ దుష్టచేష్టలకు పాల్పడేవారు బాగా తెగించారని అర్థం. ఒక పద్ధతి ప్రకారం సదరు శక్తులు ఈ బెదిరింపులకు పాల్పడుతున్నప్పటికీ, తేలికగా తీసుకొనే పరిస్థితి లేదు. చివరకు ఈ మెయిల్, సోషల్ మీడియా పోస్టుల్లో వచ్చే హెచ్చరికలకు విలువేమిటని కూడా ఊరుకోగలిగే అవకాశం లేదు. ఫలానా విమానంలో బాంబు ఉన్నదనో, దానికి ముప్పు ఉన్నదనో ఒక సమాచారం ఏ రూపంలో, ఎక్కడనుంచి అందినా దానిని నిశితంగా పరిశీలించాల్సిందే, విమానాన్ని క్షుణ్ణంగా గాలించి ఏ ప్రమాదమూ లేదని నిర్ధారించుకున్నాక ఎగరనివ్వాల్సిందే. ఈ కారణంగానే ఎగురుతున్న విమానాలను అర్థంతరంగా దింపాల్సివచ్చింది, ఎగరాల్సినవాటిని గంటల పాటు నిలిపివేయాల్సివచ్చింది. ఒక కాల్ లేదా ఒక హెచ్చరిక సందేశంతో దేశంలోని దాదాపు ప్రతీ ఎయిర్‌లైన్స్‌నీ దుండగులు భయపెట్టారు, బెదిరించారు. సదరు సంస్థల వ్యవస్థలన్నీ తీవ్రంగా భయపడ్డాయి, హడావుడి పడ్డాయి, ఆర్థికంగానే కాదు, పలురకాలుగా ఇబ్బందిపడుతున్నాయి. చేపట్టవలసిన చర్యలన్నీ పూర్తయితే కానీ విమానం కదిలేందుకు అవకాశం లేదు. ఈ బెదిరింపుల వెనుక ఉన్న వ్యక్తుల లేదా సంస్థల లక్ష్యం ఏమిటన్నది అటుంచితే, ఇంతటి దుర్మార్గానికి పాల్పడుతున్నవారిని జైల్లో పెడతామనో, రాబోయే రోజుల్లో విమానం ఎక్కబోనివ్వమనో హెచ్చరించినంత మాత్రాన ఫలితం ఉండబోదని ఇప్పటికే తేలిపోయింది.


ప్రభుత్వ విభాగాలు అనేకం రంగంలోకి దిగాయి, దోషులను గుర్తించేందుకు యథాశక్తి ప్రయత్నిస్తున్నాయి. బెదిరింపు సందేశాలు పుట్టింది ఎక్కడో, ద్రోహులెవ్వరో కనిపెట్టడం వేరు, వారిని ఎక్కడనుంచో ఇక్కడకు పట్టుకురావడం వేరు. ఒప్పందాలు, అవగాహనలు లేని దేశాలతో, సంయుక్త విచారణకు సహకరించనివారితో వ్యవహరించడం మరీ కష్టం. అయితే, ఒక్కసారిగా ఉధృతమైన ఈ బెదిరింపు సందేశాల వెనుక ఉన్నది ఎవరో అల్లరిచిల్లర వ్యక్తులు కారని మాత్రం రూఢీగా చెప్పవచ్చు. వారు తమ లొకేషన్ కనిపెట్టలేని రీతిలో, ఎవరికీ చిక్కని అత్యాధునిక సాంకేతిక విధానాల్లో ఈ పాడుపనిచేస్తున్నందున మనదేశానికి హానిచేయాలన్న వారి కసి స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. ఖలిస్తానీ తీవ్రవాది గురుపత్‌వంత్ సింగ్ పన్నూ ఎయిరిండియా విమానాలు లక్ష్యంగా చేసిన ప్రకటన, ఖలిస్తానీ శక్తులను వెనకేసుకొస్తున్నందుకు కెనడాతో పతాకస్థాయికి చేరిన వైరం ప్రస్తుత పరిణామాల నేపథ్యంగా చాలామందికి కనిపిస్తున్నది. ఒక్కో బెదిరింపు కాల్‌తో సదరు విమానయాన సంస్థకు మూడు నుంచి నాలుగుకోట్ల రూపాయల నష్టం వాటిల్లుతున్నదని అంచనా. ఇక, ప్రయాణీకులు అనుభవించిన ప్రాణభయం, మానసిక వేదన, ఇతరత్రా కష్టనష్టాలు వెలకట్టలేనివి. ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నవారిని పట్టుకోవడం, శిక్షించడం ఎప్పటికైనా జరిగితీరాలి. ఎంతకాలం పట్టినా, ఎంత ఖర్చయినా సరే, ఆ ద్రోహులను వదిలిపెట్టకూడదు. భవిష్యత్తులో ఈ తరహా బెదిరింపుకాల్స్‌తో మనను ఎవరూ భయపెట్టలేని రీతిలో నిర్దిష్టమైన వ్యవస్థలను రూపొందించుకోవాలి. విమానాలను మరింత క్షుణ్ణంగా పరిశీలించి, భద్రంగా మార్చడం, ప్రయాణీకులను, వారి సామగ్రిని మరింత శ్రద్ధగా పరీక్షించడం, ఆయా వ్యవస్థలనూ, విధానాలను లోపరహితంగా తీర్చిదిద్దుకోవడం వంటివి చేయగలిగినప్పుడు, ఒక ఉత్తుత్తి బెదిరింపునకు వెంటనే ఉలిక్కిపడి విమానాన్ని నేలమీదకు దించేయాల్సిన అవసరం ఉండదు.

అధర్మంపై మౌనమే అసలైన చెరసాల

'ఈ అంధకారం శాశ్వతమైనది కాదు. రేపటి ఉషోదయంతో ఈ చీకటి అదృశ్యమవుతుంది'– ఆత్మవిశ్వాసం ప్రతిబింబిస్తున్న ఈ మాటలు వసంత సాయిబాబా వి. ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా ఆంగ్ల పుస్తకం 'వై డు యు ఫియర్ మై వే సో మచ్? పొయెమ్స్ అండ్ లెటర్స్ ఫ్రమ్ ప్రిజన్' ప్రతి నొకదాన్ని సెప్టెంబర్ 18, 2022న వసంత నుంచి నేను కొన్నప్పుడు ఆమె ఆ మాటలు రాశారు.

ప్రొఫెసర్ సాయిబాబాను వ్యక్తిగతంగా కలుసుకునే అవకాశంగా నాకు లభించలేదు. అయితే సాయిబాబా జైలు కవితలు, లేఖల నుంచి ఆయన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. విజయదశమి నాడు ఆయన మరణం, జైలు నుంచి నిర్దోషిగా విడుదలైన కొద్ది నెలలకే సంభవించడం నన్ను ఎంతో బాధాతప్త హృదయుడిని చేసింది.

ఐదేళ్ల చిరుప్రాయంలోనే పోలియో వ్యాధి కారణంగా సాయిబాబా నడిచే సామర్థ్యాన్ని కోల్పోయారు. జీవితం విసిరిన ఎన్నో సవాళ్లు, సమస్యలను ఆయన చిన్ననాటి నుంచే ఎంతో ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నారు. పదవ తరగతి సంవత్సరాంతర పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని స్వాయత్తం చేసుకోవడం అందుకొక మొదటి నిదర్శనం.



భిన్న భావజాలాన్ని అనుసరిస్తున్నవారు, రాజకీయ అసమ్మతివాదులు, అంతరాత్మకు నిబద్ధులయి ఉండేవారి పట్ల రాజ్యం ఎలా వ్యవహరించాలి? భావాల రంగంలో ఆ చైతన్యశీలురుతో పోరాడటమా లేక కఠోర చట్టాలను వారికి వ్యతిరేకంగా ప్రయోగించడమా? జైళ్లలో ఖైదీలు, భిన్న రాజకీయ అభిప్రాయాలు కలవారిపట్ల రాజ్య వ్యవస్థ ఎలా వ్యవహరిస్తుందనేది మన నాగరికత ఔన్నత్యం, శక్తికి ఒక నిజమైన పరీక్ష.

జీవితం ఎన్ని కష్టనష్టాలకు గురిచేస్తున్నప్పటికీ సాయిబాబా తన నవయవ్వన కాలం నుంచీ ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారు. ఆదివాసీల, దళితుల, మహిళల, మైనారిటీల హక్కుల కోసం పోరాడారు. ప్రజా పోరాటాలు, సామాజిక ఉద్యమాలు సాయిబాబాకు పాదాలు అయి, ఆయన్ని ముందుకు నడిపించాయని వసంత అన్నారు. ఉన్నత విద్యాభ్యాసానంతరం ఢిల్లీ విశ్వవిద్యాలయ రామ్‌లాల్ ఆనంద్ కళాశాల ఇంగ్లీష్ భాషా, సాహిత్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అయ్యారు. సాయిబాబా కాళ్లు చలన రహితమైనా ఆయన చేతులే ఆయన శక్తి. జైలులో అధికారులు ఆయన ఆరోగ్యాన్ని అమానుషంగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఆయన చేతులు కూడా శక్తి హీనమయ్యాయి.

జైలు జీవితాన్ని తట్టుకుంటూ తన ప్రియమైన విద్యార్థులకు, సహచర అధ్యాపకులకు రాసిన ఒక లేఖలో ప్రొఫెసర్ సాయిబాబా ఇలా పేర్కొన్నారు: 'నాకు తెలిసిన జీవితమంతా విద్యా ప్రాంగణాలలోనే నివసించాను; జ్ఞానం, అనురాగం, స్వేచ్ఛను అన్వేషిస్తూ బోధనా విధులను నిర్వహించాను. కొద్దిమందికి మాత్రమే ఉండే స్వేచ్ఛ అసలు స్వేచ్ఛే కాదని ఆ అన్వేషణా ప్రస్థానంలో నేను నేర్చుకున్నాను'.

అసత్యారోపణలు, తప్పుడు తీర్పు కారణంగా ప్రొఫెసర్ సాయిబాబాను 2021లో అన్యాయంగా అధ్యాపక ఉద్యోగం నుంచి తొలగించారని వసంత బాధపడింది. సరైన చికిత్స చేయించుకునేందుకు జైలు అధికారులు ఆయనకు పదే పదే అనుమతి నిరాకరించారు. బెయిల్ మంజూరు చేయడానికి న్యాయస్థానాలు తిరస్కరించాయి.

పది సంవత్సరాలపాటు అమానుష జైలు జీవితంలో కఠోరమైన ఏకాంత వాసం గడిపినప్పటికీ, ఆరోగ్యం ఎంతగా క్షీణించిపోయినప్పటికీ ఆ కాలంలో ఆయన సృజించిన కవితలలో అసాధారణ ఆత్మవిశ్వాసం, ఆశాభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. వసంతకు పంపిన ఒక కవితలో సాయిబాబా ఇలా చెప్పారు: 'నీ స్వప్నాల గవాక్షాలను మూసివేయవద్దు. ఒక సుడిగాలిలో నిన్ను చూడడానికి వస్తున్నాను'. 26 అక్టోబర్ 2017న వసంతకు పంపిన మరొక కవితలో ఆయన ఇలా అన్నారు: 'నేను చనిపోయేలా ఏం చేయాలో/ వాళ్లకు తెలియడం లేదు/ ఎందుకంటే/ నాకు మొలకెత్తే గడ్డి సవ్వడులు/ చాలా ఇష్టం'.


జైలు జీవితంలో సాయిబాబా ఎదుర్కొన్న బాధలు మాటల్లో వ్యక్తం చేయలేనివి. తెలుగు (ఆయన మాతృభాష)లో చదివేందుకు, రాయడానికి అధికారులు అనుమతించలేదు. వసంతకు ఇంగ్లీష్ భాషలో ప్రావీణ్యం లేదు. భార్యాభర్తలు ఇరువురికీ అదొక బాధాకరమైన అనుభవం. ఇద్దరు మనుషులు అందునా జీవనసహచరులు తమ ఆత్మీయ భాషలో మాట్లాడుకోవడానికి అనుమతించకపోవడం ఎంత అమానుషం! నిజానికి సాహిత్యమే వసంత, సాయిబాబాలను సన్నిహితం చేసింది. ఆత్మీయ అనుబంధాన్ని ఏర్పరిచింది. ఉన్నతాదర్శాలతో సహజీవనం చేసేందుకు వారిని ప్రేరేపించింది. ఇరువురూ ఠాగూర్, ప్రేమ్‌చంద్, పెరియార్, శరత్, చలం, శ్రీశ్రీ, కొకు, కారా, రంగనాయకమ్మ సాహిత్యాన్ని చదివారు, స్ఫూర్తి పొందారు. కుల మత అంతరాలు, ధనిక– పేద, స్త్రీ –పురుష అసమానతలు లేని సమసమాజాన్ని స్వప్నించారు.

విప్లవ కవి వరవరరావును ఉద్దేశించి రాసిన ఒక కవితలో అన్యాయాలు చెలరేగుతున్నప్పుడు వాటిని ఎదిరించడానికి బదులు ప్రజలు తమకుతాముగా మౌనం పాటించడం పట్ల సాయిబాబా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధర్మంపై ప్రజల స్వచ్ఛంద మూకీ భావమే అసలైన చెరసాల అని ఆయన అభివర్ణించారు. దురదృష్టకరమైన ఈ లోక రీతిని ఆయన ఎలా నిరసించారో చూడండి: 'కొంత మౌనం బలవంతంగా విధించింది. మిగతా మూకీ భావం అంతా స్వయంగా పాటిస్తున్నదే. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై నిషేధం కొంత ఆదేశించబడింది. మిగతాది అంతా స్వయంగా ఆచరిస్తున్నదే. మన చుట్టూ ఉన్న ఈ సాలెగూడు పరిస్థితుల్లో వ్యక్తమవుతోన్న భయం అధికారంలో ఉన్న వారి గురించి కాదు. అది నోరు లేని అమాయకుల ఆవేదనలు వినిపించడానికి భయపడుతున్న గొంతుకలలోని భయం. అది నైతిక దుర్బలత్వం. అది ఒక నాగరికత దురహంకారం. స్వేచ్ఛాయుత సమాజం కోసం మనం ఉమ్మడిగా చేసిన పోరాటాల విస్మరణ అది'.

తాను, తన భార్య వసంత 'పేదల హక్కుల కోసం ప్రముఖం కాని మార్గాలలో పోరాడుతున్న సామాన్యులం. మరి బ్రహ్మాండమైన అధికారాలు గల రాజ్య వ్యవస్థ మా ఆశాభావాలు, మా అనురాగాలు, మా స్వప్నాలకు ఎందుకు భయపడుతుంది' అని ప్రొఫెసర్ సాయిబాబా విస్మయం వ్యక్తం చేశారు. భిన్న భావజాలాన్ని అనుసరిస్తున్నవారు, రాజకీయ అసమ్మతివాదులు, అంతరాత్మకు నిబద్ధులయి ఉండేవారి పట్ల రాజ్యం ఎలా వ్యవహరించాలి అన్నది ఒక ప్రధానాంశం. అదొక చిక్కు ప్రశ్న కూడా. భావాల రంగంలో ఆ చైతన్యశీలురుతో పోరాడటమా లేక కఠోర చట్టాలను వారికి వ్యతిరేకంగా ప్రయోగించడమా? జైళ్లలో ఖైదీలు, భిన్న రాజకీయ అభిప్రాయాలు కలవారిపట్ల రాజ్య వ్యవస్థ ఎలా వ్యవహరిస్తుందనేది మన నాగరికత ఔన్నత్యం, శక్తిశీలతకు ఒక నిజమైన పరీక్ష.

• డాక్టర్ వైఎస్ఆర్ మూర్తి
వైస్ ఛాన్సలర్, అస్సామ్ రాయల్ గ్లోబల్ యూనివర్సిటీ

'అధికార' చరిత్రకు పరిశోధక చికిత్స



akbar

భన్వర్ మేఘ్వంశీ. రాజస్థాన్‌కు చెందిన రచయిత, పాత్రికేయుడు, దళితోద్యమ కార్యకర్త. ఈయన రాసిన ఆత్మకథనాత్మక రచన తెలుగు అనువాదం "నేనెందుకు హిందువును కాలేకపోయాను?" ఆవిష్కరణ ఈ మధ్య రెండు తెలుగు రాష్ట్రాలలోను జరిగింది. తండ్రి హెచ్చరికను పెడచెవిన పెట్టి మరీ ఆర్ఎస్ఎస్‌లో చేరి, ఒకసారి అయోధ్య కరసేవకు కూడా వెళ్లిన మేఘ్వంశీ, సంఘ్‌లో కులవివక్ష కారణంగా తప్పుకున్నారు. హైదరాబాద్ 'లామకాన్'లో జరిగిన కార్యక్రమంలో మేఘ్వంశీ సంఘ్‌లో తన అనుభవాలను స్వయంగా వివరించారు. ఆర్ఎస్ఎస్ స్థాపన 1925లో జరిగితే, మూడేళ్లకే అది రాజస్థాన్‌కు వ్యాపించిందని, అంబేడ్కర్ వాదం మాత్రం 1990ల దాకా రాలేదని ఆయన చెప్పారు. ఆ సందర్భంగా, మేఘ్వంశీని ఒక ప్రశ్న అడిగాను: అంబేడ్కర్ ప్రభావం లేకపోతే, సంఘ్ దళితులకు మేలుచేయదని, అందులో చేరవద్దని మీ నాన్న మీకు సలహా ఎట్లా ఇవ్వగలిగారు? ఆయనకు ఆ అవగాహన ఎట్లా కలిగింది? అందుకు మేఘ్వంశీ సమాధానం, "అంబేడ్కర్ ప్రభావం లేదు కానీ, గాంధీ ప్రభావం ఉన్నది. కాంగ్రెస్ చేపట్టిన సంస్కరణాత్మక హరిజనోద్ధరణ కార్యక్రమాల ప్రభావం, రాజ్యాంగం ద్వారా వచ్చిన సంక్షేమం, హక్కులు కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారా అమలులోకి రావడం, ఈ కారణాల వల్ల రాజస్థాన్ దళితులు ఇటీవలి కాలం దాకా కాంగ్రెస్ వైపే ఉంటూ వచ్చారు." దళితులు ఎక్కడా ఎదురుచూపుల్లో మిగలలేదు. అందిన ఆధారంతోనే అడుగులు వేశారు.

ఆధునిక భారతదేశ చరిత్ర ఎంత అసమగ్రం అంటే, భౌగోళికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా కూడా కొన్ని స్థలాలు, శ్రేణుల ప్రయాణం ఇంకా అక్షరాలకు ఎక్కలేదు. మనం చరిత్ర అని చదువుకుంటున్నదానిలో ఎన్నో ఖాళీలు, విస్మరణలు, అగాధాలు! జాతీయోద్యమచరిత్ర అంతా ఉత్తరాది పురాణమే తప్ప, దక్షిణాదికి చెందిన నేతల, కార్యకర్తల, ప్రజల కథనాలే కనిపించవు! అట్లాగే, సామాజికంగా అట్టడుగున ఉన్న ప్రజాశ్రేణులు స్వాతంత్ర్య పోరాటానికి, జాతీయోద్యమవిలువలకు చేసిన దోహదాల స్మరణ ఏ దినోత్సవాలలోనూ వినము. స్థానికంగా పుట్టి పెరిగి ప్రభావశీలంగా మారిన ఉద్యమాల గురించి పెద్దగా చెప్పుకోము. గాంధీ 'హరిజన' అంశాన్ని జాతీయోద్యమానికి కీలకంగా పరిగణించకముందే, దేశంలోని దళితులకు ఆరాధ్య నాయకుడిగా, ఆశాజ్యోతిగా అంబేడ్కర్ కనిపించకముందే, దేశవ్యాప్తంగా సామాజిక ప్రజాస్వామ్యవాదానికి బీజాలు పడ్డాయని గ్రహించము.

సామాజికోద్యమాల చరిత్రకారుడు జంగం చిన్నయ్య రాసిన "ఆధునిక భారత నిర్మాణానికి దళితుల దోహదం" (దళిత్స్ అండ్ మేకింగ్ ఆఫ్ మోడర్న్ ఇండియా) అన్న పుస్తకం, కులనిర్మూలనా భావాల శతాబ్దాల చరిత్రను వివరిస్తూ, భారతదేశంలో ఈ చైతన్యం వలసవాద పూర్వదశకు, అనంతరదశకు నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నదని అంటారు. భారతదేశంలో ఆధునికత వలసపాలన ఫలితమేనా, స్థానికంగా మూలాలు లేవా అనే ప్రశ్నకు, చిన్నయ్య ఈ రూపంలో సమాధానం ఇచ్చారు. భారతదేశంలో కులనిర్మూలన, కులవ్యతిరేక భావాలకున్న సుదీర్ఘచరిత్రను ఆధునికతా ప్రయాణంలో భాగంగా పూర్వోత్తర వలసవాద మేధావులు పరిగణించకపోవడం అన్యాయం. చిన్నయ్య పుస్తకం జాతీయోద్యమ అధికారిక కథనాలు మరుగుపరచిన మరో చరిత్ర కథనాన్ని ఆవిష్కరించింది. సామాజిక సమానత్వాన్ని స్వాతంత్ర్యానికి ఒక ముందస్తు షరతుగా చేయడం ద్వారా దళిత ఉద్యమం జాతీయవాదానికి గొప్ప చేర్పు ఇచ్చిందని ఆ పుస్తకం సూచిస్తుంది. హిందూ శిష్ట వర్గాల జాతీయవాదానికి ప్రతివాదాన్ని నిర్మించి, ముందుకు తీసుకువెళ్లినవాడిగా బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను చిన్నయ్య పేర్కొంటారు. అదే సమయంలో తెలుగు ప్రాంతాలలో, స్థానికంగా ఎదిగిన దళిత నాయకత్వం గురించి, నాటి రాజకీయాలలో వారి ప్రమేయం గురించి వివరంగా పేర్కొంటారు. అంబేడ్కర్ కంటె ముందే, అంబేడ్కర్ ప్రభావం సోకక ముందే, అనేక మంది దళిత సామాజిక కార్యకర్తలు దేశవ్యాప్తంగా కార్యక్షేత్రంలో ఉన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని తమ వ్యక్తీకరణను విస్తరించుకుంటూ వెళ్లారు. దేశవ్యాప్తంగా అట్లా ఎదిగిన పాయలన్నీ అనివార్యంగా, సహజంగా అంబేడ్కర్ మహానదిలో కలిసిపోయాయి. అటువంటి పాయలలో ఒకటి ఆది హిందూ/ ఆది ఆంధ్ర ఉద్యమం. నాటి హైదరాబాద్ రాజ్యంలో ఆ పతాకాన్ని చేతబట్టి, తన ప్రభావాన్ని బ్రిటిష్ ఆంధ్రలో కూడా విస్తరించినవాడు భాగ్యరెడ్డి వర్మ. భాగ్యరెడ్డి ఉద్యమం గురించి చెప్పడమే కాకుండా, ఆయన వైఖరులను విశ్లేషించారు చిన్నయ్య. హిందూ సంస్కర్తల కార్యప్రణాళికకు లోబడి పనిచేసి, వారి గుర్తింపును పొందినవాడిగా భాగ్యరెడ్డి వర్మను చిన్నయ్య వ్యాఖ్యానించారు.

> చెల్లాచెదరుగా ఉన్న తెలంగాణ దళిత చైతన్య కథనాలను కఠోరశ్రమతో పోగుచేసి, మిగిలిన వ్యక్తులతో మాట్లాడి గొప్పకృషి చేసినవాడు సంగిశెట్టి శ్రీనివాస్. అలనాటి తెలంగాణ వికాసోద్యమంలో పరిశోధకుడిగా ఆదిరాజు వీరభద్రరావు ఎంతటి పని చేశారో, సంగిశెట్టి శ్రీనివాస్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పరిశోధకుడిగా అంతటి పాత్ర నిర్వహించారు. ఆయన "తెలంగాణ దళితోద్యమ చరిత్ర" ఆధునిక తెలుగు సామాజిక చరిత్రలన్నిటిలోనే ప్రత్యేకమైనది, విశిష్టమైనది. దళితుల సాంప్రదాయ వృత్తులు, వారి కళారూపాలు, ఉద్యమాలలో దళితుల స్థానం, దళితుల సొంత ఉద్యమాలు, వీటన్నిటినీ సంగిశెట్టి శ్రీనివాస్ ఈ పుస్తకంలో విపులంగా చర్చించారు. ఈ పుస్తకంలోని బలం, కేవలం చరిత్ర పుస్తకం కావడం కాదు. చరిత్రలు విస్మరించిన చరిత్ర పుస్తకం కావడం.



■ కె. శ్రీనివాస్

సందర్భం

విడిగా తను ప్రాతినిధ్యం వహిస్తున్న సామాజిక శ్రేణితో మాత్రమే పనిచేయకుండా, ఆనాటి హైదరాబాద్ సమాజంలో ఉన్న శిష్ట సంస్కర్తలతో కలసి భాగ్యరెడ్డి ముందుకు నడిచారు. ఆ క్రమంలో ఆయన అనేక అవమానాలు, ఇబ్బందులు కూడా ఎదుర్కొన్నారు. నిజాం పాలన కావడం వల్ల, ప్రభుత్వం నుంచి దళితులకు లభించే సానుకూలపరిగణనను వినియోగించుకుంటూ, ఆ నాటి నగర ప్రముఖులలో ఒకరిగా భాగ్యరెడ్డి ఎదిగారు. 1917లో విజయవాడలో జరిగిన చరిత్రాత్మక ఆదిమాంధ్ర మహాసభకు భాగ్యరెడ్డి అధ్యక్షుడిగా ఆహ్వానితులయ్యారు. తెలుగులో మొట్టమొదటి మహానవల 'మాలపల్లి'లో ఒక పాత్రగా నిలిచినప్పటికీ, భాగ్యరెడ్డివర్మకు అనంతర కాలంలో తెలుగు వారి సామాజిక చరిత్రలో పెద్ద స్థానం లభించలేదు. 1938లో మరణించిన భాగ్యరెడ్డి స్మృతి పూర్తిగా అణగారిపోకుండా ఆయన కుటుంబం, ఉద్యమసహచరులు కాపాడుతూ వచ్చారు కానీ, ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం, దళిత రాజకీయాలతో సహా అన్నీ మారిపోయాయి. 1985 తరువాత ఉమ్మడి తెలుగురాష్ట్రాలలో దళిత చైతన్యం వెల్లువెత్తింది కానీ, ఒకనాటి నైజాము రాజ్యంలో గొప్ప సంస్కర్తగా, దళిత కార్యకర్తగా నిలిచిన భాగ్యరెడ్డికి రావలసిన గుర్తింపు రాలేదు. భాగ్యరెడ్డి వర్మ, అరిగే రామస్వామి, బి.ఎస్. వెంకట్రావు, శ్యామ్‌సుందర్ వంటి వారితో కూడిన హైదరాబాద్ దళిత ఉద్యమ ప్రస్థానాన్ని చరిత్రీకరించిన పి.ఆర్. వెంకటస్వామి పుస్తకం "అవర్ స్ట్రగుల్ ఫర్ ఎమానిసిపేషన్" దశాబ్దాలపాటు అలభ్యంగా మసకబారిపోయింది. తెలంగాణ మలిదశ ఉద్యమం అందుకుంటున్నవేళ, పరిశోధించి, విస్మృత చిహ్నాల స్ఫూర్తిని పునరుద్ధరించాలన్న సంకల్పం వల్ల భాగ్యరెడ్డి ప్రధానకథనాలలోకి రాసాగారు. చెల్లాచెదరుగా ఉన్న తెలంగాణ దళిత చైతన్యకథనాలను కఠోరశ్రమతో పోగుచేసి, మిగిలిన వ్యక్తులతో మాట్లాడి గొప్పకృషి చేసినవాడు సంగిశెట్టి శ్రీనివాస్. అలనాటి తెలంగాణ వికాసోద్యమంలో పరిశోధకుడిగా ఆదిరాజు వీరభద్రరావు ఎంతటి పని చేశారో, సంగిశెట్టి శ్రీనివాస్ పాతికేళ్ల కిందట మొదలయిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పరిశోధకుడిగా అంతటి పాత్ర నిర్వహించారు. తెలంగాణ జర్నలిజం చరిత్ర, కథాసాహిత్య చరిత్ర, అనేక జీవిత చరిత్రలు, ఆంధ్ర ప్రాంత, అగ్రవర్ణ రచయితలతో సహా అందరి అలభ్యరచనల సేకరణ, చేసిన సంగిశెట్టి ఇప్పుడు, బహుజన సాహిత్యం మీద ప్రత్యేకంగా గురిపెట్టారు.

భాగ్యరెడ్డి వర్మ కుమారుడు ఎం.బి. గౌతమ్ రాసిన 'భాగ్యోదయం', గెయిల్ ఆమ్ వెట్ రాసిన "దళిత్స్ అండ్ ది డెమొక్రాటిక్ రివల్యూషన్", అబ్బసాయిలు రాసిన "దళిత్ లీడర్‌షిప్ ఇన్ ఇండియా" వంటి పుస్తకాలు కొన్ని తప్ప, పాతికేళ్ల కింద తెలంగాణ, హైదరాబాద్ దళిత ఉద్యమం గురించి పెద్దగా సమాచారం అందుబాటులో లేదు. దొరికిన వాటిని క్షుణ్ణంగా అధ్యయనంచేసి, విశ్వవిద్యాలయాలలోని పరిశోధక వ్యాసాలు, ఇంకా అనేక ఉద్యమచరిత్ర గ్రంథాలు, ఆత్మకథలు, పత్రికలు వీటన్నిటిని శోధించి భాగ్యరెడ్డి వర్మతో పాటు, ఆ నాటి తెలంగాణ దళిత నాయకుల విశేషాలన్నీ సంగిశెట్టి ఆవిష్కరించారు. తన అన్ని సాహిత్య, సాహిత్యేతర పరిశోధక ప్రచురణల్లోనూ దళిత కోణాన్ని, సమాచారాన్ని అంతర్భాగం చేశారు. ఈ మధ్యనే విడుదలైన సంగిశెట్టి శ్రీనివాస్ "తెలంగాణ దళితోద్యమ చరిత్ర" ఆధునిక తెలుగు సామాజిక చరిత్రలన్నిటిలోనే ప్రత్యేకమైనది, విశిష్టమైనది. ఇందులోని సమాచారం అంతా సంగిశెట్టి సుమారు రెండు దశాబ్దాలుగా పోగుచేస్తూ వస్తున్నదే. దళితశ్రేణుల నిర్వచనాలను, బౌద్ధకాలం నుంచి మూలాలను సంగిశెట్టి ఇందులో చర్చించారు. ఆసఫ్ జాహి కాలం నుంచి ఆధునికతా ప్రయాణాన్ని సూచించారు. దళితుల సాంప్రదాయ వృత్తులు, వారి కళారూపాలు, ఉద్యమాలలో దళితుల స్థానం, దళితుల సొంత ఉద్యమాలు, వీటన్నిటినీ సంగిశెట్టి శ్రీనివాస్ ఈ పుస్తకంలో విపులంగా చర్చించారు. ఈ పుస్తకంలోని బలం, కేవలం చరిత్ర పుస్తకం కావడం కాదు. చరిత్రలు విస్మరించిన చరిత్రపుస్తకం కావడం. మౌలిక ఆధారాలను, ఆకరాలను సేకరించడంలో అగ్రవర్ణచరిత్రల విషయంలో లభించినంత సౌలభ్యం ఇటువంటి చరిత్రలలో దొరకదు.

> అంబేడ్కర్ కంటె ముందే, అంబేడ్కర్ ప్రభావం సోకక ముందే, అనేక మంది దళిత సామాజిక కార్యకర్తలు దేశవ్యాప్తంగా కార్యక్షేత్రంలో ఉన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని తమ వ్యక్తీకరణను విస్తరించుకుంటూ వెళ్లారు. దేశవ్యాప్తంగా అట్లా ఎదిగిన పాయలన్నీ అనివార్యంగా, సహజంగా అంబేడ్కర్ మహానదిలో కలసిపోయాయి. అటువంటి పాయలలో ఒకటి ఆది హిందూ/ ఆది ఆంధ్ర ఉద్యమం.

అంబేడ్కర్ కంటె మూడు నాలుగు సంవత్సరాలు ముందుపుట్టిన భాగ్యరెడ్డి వర్మ, హేతుబద్ధ వివేచనను, పౌరాణిక కథనాలను ప్రశ్నించే కుతూహలాన్ని, సామాజిక సమానత్వ ఆదర్శాన్ని అలవరచుకున్నారు. అంటే ఆయన మెలగిన సమాజంలో, ఆయా ప్రగతిశీల భావాలు ఉనికిలో ఉన్నాయన్న మాట. దళితులు ఒకప్పుడు దేశపాలకులని, అందుకని రెడ్డి అని పేరుచివర ఉండాలని కుటుంబ శైవ గురువు సూచన మేరకు, భాగ్యరెడ్డి అన్నపేరు ఆయన తల్లిదండ్రులు పెట్టారు. మతప్రచారకుల ద్వారా కూడా ఆత్మాభిమాన సందేశాలు అందుతూ ఉండేవన్నమాట. అంబేడ్కర్ కంటె ముందే సామాజిక న్యాయ, సమానత్వ భావాలను విస్తృతంగా ప్రచారం చేసిన భాగ్యరెడ్డి వర్మ, 1930 ప్రాంతంలో చరిత్రాత్మక రౌండ్ టేబుల్ సమావేశానికి ముందు, అంబేడ్కర్ ప్రాతినిధ్యాన్ని సమర్థించడం ద్వారా ఆయన నాయకత్వాన్ని అంగీకరిస్తున్నట్టు సూచించారు. స్వాతంత్ర్యానంతరం భాగ్యరెడ్డి కుమారుడు కాంగ్రెస్ తరఫున శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. సమకాలంలో భాగ్యరెడ్డికి, ఇతర దళిత సంస్కర్తలకు మధ్య సమన్వయమూ ఉండేది, విభేదాలు కూడా ఉండేవి. భాగ్యరెడ్డి వర్మ జీవితాన్ని, ఆచరణను కథనం చేస్తూ రాసిన ప్రత్యేక చరిత్ర గ్రంథం "దళితోద్యమ వేగుచుక్క భాగ్యరెడ్డి వర్మ" కూడా సంగిశెట్టి శ్రీనివాస్ ఈ ఏడాదే ప్రచురించారు.

ప్రాంతీయ, శ్రేణీయ చరిత్రల ద్వారానే సమగ్రమైన భారత చరిత్ర నిర్మితమయ్యేది. సంగిశెట్టి శ్రీనివాస్ రాసిన 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర' అందుకు ఒక మంచి నమూనా. పరిశోధనా, సత్యాన్వేషణా కాలం చెల్లిన విలువలైన రోజుల్లో ఇంతటి నిష్ఠాగరిష్ఠుడైన పరిశోధకుడు ఉండడం తెలుగువారికి లభించిన మంచి అవకాశం.

యాభై ఏళ్ల పీడీఎస్‌యూ!

శాస్త్రీయ విద్య, కామన్ విద్యా విధానం, సమ సమాజం, నూతన ప్రజాస్వామిక విప్లవం లాంటి ఉన్నతమైన ఆశయాలతో ఏర్పడిన సంస్థ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ). ఈ సంస్థ ఏర్పడి ఈ అక్టోబర్ 12 నాటికి యాభై ఏళ్ళు పూర్తయ్యాయి. ఈ యాభై ఏళ్ల విప్లవ ప్రస్థానంలో పీడీఎస్‌యూ విద్యార్థుల పక్షాన బాధ్యతగా కొట్లాడుతూనే విద్య ప్రైవేటీకరణకూ, కార్పొరేటీకరణకూ వ్యతిరేకంగా పోరాడింది. సాంప్రదాయ, సంస్కరణవాద విద్యార్థి సంఘాలను తుత్తునియలు చేస్తూ విద్యార్థులు అందరికీ విప్లవ చైతన్యాన్ని అందించింది, పీడీఎస్‌యూ ఇచ్చిన స్ఫూర్తితో విద్యార్థులు హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం నిత్యం సమరశీల పోరాటాలు నిర్వహించారు. తెలుగు సమాజంలో వచ్చిన సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, స్త్రీవాద, దళితవాద, అస్తిత్వ, కార్మిక, కర్షక, యువజన, ప్రజాస్వామిక, విప్లవ పోరాటాలలో తనదైన పాత్రను పోషించింది పీడీఎస్‌యూ.

పీడీఎస్‌యూ తన యాభై ఏళ్ళ ప్రస్థానంలో అనేక పోరాటాలు నిర్వహించింది. ఎన్నో హక్కులను సాధించింది. ఉద్యమ నిర్మాణ క్రమంలో అనేకమంది పోరాట యోధులను కోల్పోయింది. పీడీఎస్‌యూ పోరాట స్ఫూర్తిని వివరిస్తూ, అమరవీరుల స్ఫూర్తిని నేడు మరింత ఎత్తి పట్టాల్సిన అవసరం ఉంది. పోరాట స్ఫూర్తితో ధ్వంసం అవుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవటం కోసం, విద్యా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాట జ్వాలలను రగిలించాలి. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020ను ప్రతిఘటించాలి. అందరికీ సమానమైన శాస్త్రీయమైన విద్య కోసం, సమానమైన అవకాశాల కోసం సమరశీల పోరాటాలను నిర్వహించాలి. దీనికోసం కలిసి వచ్చే అన్ని విప్లవ విద్యార్థి సంఘాలను ఐక్యం చేసుకోవాలి. తద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవ స్ఫూర్తితో విద్యార్థులంతా తమ సమాజం కోసం పోరుసల్పాలి. అందుకే రెండు పీడీఎస్‌యూ సంస్థల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కార్యవర్గాలు ఐక్యంగా యాభై ఏళ్ల పీడీఎస్‌యూకి విప్లవ జేజేలు తెలియజేస్తూ నేడు ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలోనూ, నవంబర్ 5న విజయవాడలోనూ పీడీఎస్‌యూ అర్థ శతాబ్దోత్సవ సభలను నిర్వహిస్తున్నాయి. వీటిని జయప్రదం చేయవలసిందిగా పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థులకు, ప్రజాస్వామిక వాదులకు, మేధావులకు, అన్ని వర్గాల ప్రజలకు, విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నాము.

– పి. మహేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ

కోటా తీర్పుపై శాసనిక చర్యలేవీ?

ఎస్సీ, ఎస్టీల్లో అత్యంత వెనుకబడిన కులాలు, జాతులకు విద్య, ఉద్యోగ రంగాల్లో తగిన రిజర్వేషన్లు అందించేలా రాష్ట్రాలు ప్రాధాన్యతలతో కూడిన చర్యలు తీసుకోవాలని, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టు ఒకటిన తీర్పునిచ్చింది. దీనికి వ్యతిరేకంగా న్యాయ సమీక్ష చెయ్యాలని దాఖలైన 32 పిటిషన్లను విచారించనవసరం లేదని, ఇదే రాజ్యాంగ ధర్మాసనం తాజాగా కొట్టి వేసింది. ఈ నేపథ్యంలో, మన రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి, ఎస్సీ కులాలు, ఎస్టీ తెగలన్నీ ఏకరూప అభివృద్ధి సాధించేందుకు మార్గాన్ని సుగమం చేయాలి.

ఎస్సీ కులాల్లో సంచార, అర్ధ సంచార, స్థిర జీవితం కలిగిన కులాలు ఉన్నాయి. ఎస్సీ కులాల్లో వృత్తిపరమైన శ్రేణీయ వ్యవస్థ ఉంది. అట్టడుగున పారిశుధ్య కులాలు, ఆపైన చర్మకార కులాలు పూర్తిస్థాయి పైన నేత, నీరుకట్టు వృత్తి కులాలు ఉన్నాయి. శ్రేణీయ వ్యవస్థలో అట్టడుగున పారిశుధ్య పనిలో ఉన్న రెల్లి, తోటి, మెహతార్, పాకి, పంచమ, గొడగలి, గొడారి వంటి కులాల వారికీ; చర్మకారులైన మాదిగ, అరుంధతీయ, ఆది జాంబవ, డక్కలి, చిందు, బైండ్ల, మోచి, సమగర, మాంగ్, మాతంగ, మాదిగ దాసు, మాదిగ మాష్టి మొదలగు కులాల వారికీ; సంచార, అర్థ సంచార జీవనంలో వున్న బుడగ జంగం, డక్కలి, చిందు, మాష్టీ మొదలగు అనేక కులాల వారికీ విద్యా, ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం లేని, అసలే ప్రాతినిధ్యం లేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. పేదరికం, కుల వివక్ష నిరుద్యోగంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

ఎస్టీలలో అటవీ ప్రాంత, కొండ ప్రాంతాల్లో చెంచు, కోయ, గోండు మొదలగు ఆదివాసీ తెగలు ఉన్నాయి. అలాగే మైదాన ప్రాంతంలో యానాది, ఎరుకల, లంబాడి, సుగాలి మొదలగు ఆదివాసి తెగలున్నాయి. ఇందులో యానాది జాతి ఆదిమ జాతి. ఈ తెగ ఇప్పటికీ పంట పొలాలలో చెట్లు, పుట్టలు తిరిగి ఎలుకలు, పాములు పట్టుకునే దుర్భర నిరుపేద పరిస్థితుల్లోనే ఉన్నారు. కాగా ఎస్టీ రిజర్వేషన్లలో విద్యా, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రిజర్వేషన్లను ఎరుకల, లంబాడి, సుగాలి తెగలవారే సింహభాగం అనుభవిస్తున్నారు.

దేశంలో ఎస్సీ, ఎస్టీలు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను ఉపయోగించుకున్న తీరుతెన్నుల మీద పరిశీలనకు కేంద్ర న్యాయ శాఖ 1965లో బి.ఎన్. లోకూర్ కమిటీని నియమించింది. ఈ కమిటీ అదే ఏడాది తన తుది నివేదికను సమర్పించింది. ఎస్సీ, ఎస్టీల మధ్య అభివృద్ధి వ్యత్యాసాలు తీవ్రంగా పెరిగాయని ఈ కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. అంతేకాకుండా, తమ జనాభా నిష్పత్తుల కంటే రిజర్వేషన్లలో సింహభాగం అనుభవించిన పద్నాలుగు ఎస్సీ, ఎస్టీ సమూహాలను రిజర్వేషన్ జాబితా నుంచి తొలగించమని, నాటి లోకూర్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి తుది నివేదికలో స్పష్టంగా సూచనలు చేసింది. లోకూర్ కమిటీ నాడు డీ రిజర్వ్ చెయ్యమని సూచించిన కులాల జాబితాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మాల కులం కూడా ఉందనేది వాస్తవం.

> రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకూ అన్ని రకాల ఉద్యోగాల నియామకాలను, అన్ని ఉన్నత విద్యా, వృత్తివిద్యా అడ్మిషన్ల ప్రవేశాలను భర్తీ చేయకూడదు. రిజర్వేషన్ల హేతుబద్ధీకరణలో జాప్యాన్ని నివారించి, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ల పంపిణీలో న్యాయం చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీలలో ఏకరూప అభివృద్ధికి తక్షణం చర్యలు తీసుకోవాలి.



తెలుగు రాష్ట్రాల్లో మాదిగ ఉద్యమ ప్రభావంతో అత్యంత వెనుకబడిన ఆదివాసులు తుడుం దెబ్బ ఉద్యమాన్ని ప్రారంభించారు. బీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలు ఎంబీసీ ఉద్యమాన్ని ప్రారంభించారు. వామపక్ష, కమ్యూనిస్టులు కూడా కుల నిర్మూలన పోరాట సమితి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి వంటి సంఘాలను పెట్టారు. ముస్లిం మైనారిటీలలో వెనుకబడిన సమూహాలకు రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్యమం ముందుకు వచ్చింది. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే ఉద్యమం ప్రారంభమైంది. ఇండియా సంయుక్త రాష్ట్రాల బహుజన కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపన దాకా, మాదిగ ఉద్యమం ప్రభావం చూపింది. గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన ప్రాజెక్టుల రూపకల్పనలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాలు రూపొందాయి. పంపకంలో హేతుబద్ధీకరణ (వర్గీకరణ) లేకపోవడం వల్ల, ఈ చట్టాల అమలు ద్వారా కూడా ఎస్సీ, ఎస్టీల్లో సాపేక్షికంగా బలమైన కులాలు, జాతులు, తెగలవారే సింహభాగం లబ్ధిని కైవశం చేసుకున్నారు.

వర్గీకరణ సమస్య పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకూ ఎటువంటి శాసనిక ప్రక్రియలు, చర్యలూ చేపట్టకపోవడంతో ఆంధ్రప్రదేశ్ మాదిగలు అసంతృప్తితో ఉన్నారు. ఇక తెలంగాణలో రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ పన్నెండున మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు అయింది. అలాగే, సమస్య అధ్యయనానికి ఏకసభ్య జుడిషియల్ కమిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. 2018లో ప్రభుత్వ గజెట్‌లో ప్రచురింపబడిన, ఇప్పటికి తాజా గణాంకాలైన 2011 జనాభా లెక్కల ఆధారంగా రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ ప్రక్రియను పూర్తిచేయాలి.

ఎస్సీలు, ఎస్టీలకు చాలాకాలంగా దీర్ఘకాలికమైన, విధానపరమైన అపరిష్కృత సమస్యలు ఎన్నో ఉన్నాయి. అందులో– 1. పెరిగిన జనాభా శాతానికి అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచుకోవడం. 2. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు జరిపించుకోవడం 3. భూమి, ఉపాధి, గృహ వసతులు కల్పించుకోవడం. 4. పారిశ్రామిక, వ్యాపార, పెట్టుబడి నైపుణ్యాలు పెంచుకోవడం. 5. నిరుద్యోగ నిర్మూలన, కులవివక్ష, అత్యాచారాల నిర్మూలన. 6. ఎస్సీ, ఎస్టీల్లో సంపన్న శ్రేణిని రిజర్వేషన్ల విధానం నుంచి మినహాయించడం మొదలైనవన్నీ కొన్ని ముఖ్య సమస్యలు. అయితే, ఇవేవీ కూడా, ఎస్సీ, ఎస్టీల మధ్య వున్న ఏ సమస్య పరిష్కారానికీ మరొక సమస్య పోటీ కాదు, కాకూడదు. పోటీ పెట్టజాలని, పెట్టకూడని, అడ్డుగా నిలపకూడని సమస్యలుగా ప్రభుత్వం, వర్గీకరణ వ్యతిరేకులు, సమాజమూ గుర్తించాలి. ప్రాధాన్యతలను బట్టి ఏ సమస్యకు ఆ సమస్యనే విడివిడిగా పరిష్కరించాలి. వర్గీకరణ లేకుండానే మెడికల్ సీట్ల భర్తీ, ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు జారీ కావడం... మాదిగలకు, మిగిలిన ఎస్సీ, ఎస్టీ తెగలకు మరింత అన్యాయం చేయడమే. రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకూ అన్ని రకాల ఉద్యోగాల నియామకాలను, అన్ని ఉన్నత విద్యా, వృత్తివిద్యా అడ్మిషన్ల ప్రవేశాలను భర్తీ చేయకూడదు. రిజర్వేషన్ల హేతుబద్ధీకరణలో జాప్యాన్ని నివారించి, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లలో పంపిణీలో న్యాయం చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీలలో ఏకరూప అభివృద్ధికి తక్షణం చర్యలు తీసుకోవాలి.

■ కృపాకర్ మాదిగ
వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి

భువన్ యాప్ ద్వారా అసెస్మెంట్ల
నమోదులో వేగం పెంచండి
- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల నమోదు పరిశీలనపై సమీక్ష
6


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని

ప్రధాని మెచ్చిన 'చైతన్య'
- ఓరుగల్లు కళాకారిణికి ముద్దుపేరు పెట్టిన మోదీ
- కూచిపూడి నృత్యంతో ప్రశంసలందుకున్న లక్ష్మీప్రియ
- ఈ ఏడాది ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్‌పురస్కార్‌కు ఎంపిక
- ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరణ
8



మత్తు వదలదా!

- ఓరుగల్లును ఆవహిస్తున్న గంజాయి
- నగరంలో విచ్చలవిడిగా సాగుతున్న అమ్మకాలు
- యువతే లక్ష్యంగా అక్రమార్కుల దందా
- ఇతర రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా దిగుమతి
- నియంత్రణలో పోలీసులు విఫలం
- మత్తులో చిత్తవుతున్న యువత


నగరంలో పోలీసులకు పట్టుబడిన గంజాయి రవాణాదారులు (ఫైల్)

కరీమాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు మహా నగరాన్ని గంజాయి మత్తు ఆవహిస్తోంది. ఇటీవల గంజాయి రవాణాదారులు ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి తీసుకొచ్చి విచ్చలవిడిగా అమ్మకాలు చేపడుతుండడంతో ఓరుగల్లు గంజాయి హబ్‌గా తయారైంది. యువతనే లక్ష్యంగా చేసుకొని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. వరంగల్ మహానగరంలో గంజాయి దందా ఆందోళన కలిగించే స్థాయికి చేరుకుంది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే తప్పుడు ఆలోచనతో కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి తక్కువ రేటుకు గంజాయిని కొనుగోలు చేసి రకరకాల పద్ధతుల్లో నగరానికి రవాణా చేసి ఇక్కడ అధిక రేటుకు గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నారు. గంజాయి అమ్మకాలు నగరంలో జనాలు సంచరించే ప్రాంతాలు, దినసరి కూలీల అడ్డా, యువత, విద్యార్థులు ఎక్కువ సమయం గడిపే ప్రధాన కూడళ్లు, రైల్వే, బస్‌స్టేషన్లు స్థావరాలుగా చేసుకొని గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. గంజాయి మత్తుకు అలవాటు పడిన వారు చిత్తవుతుంటే, విక్రయదారులు లక్షల్లో డబ్బు సంపాదిస్తూ యథేచ్ఛగా చీకటి వ్యాపారం కొనసాగిస్తున్నారు.

చిన్న చిన్న ప్యాకెట్లుగా విక్రయాలు

గంజాయి అమ్మకందారులు రకరకాల పద్ధతుల్లో ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి అమ్ముతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ రేటుకు కొనుగోలు చేసి అక్రమంగా రవాణా చేసిన గంజాయిని నగరంలోని ఆయా ప్రాంతాల్లో నిల్వ చేసి యువకులకు, దినసరి కూలీల వ్యసనాలను ఆసరా చేసుకొని అధిక రేటుకు అంటగడుతున్నారు. వీరు రకరకాల కోడ్‌లు చెప్పుకుంటూ అమ్మకాలు చేస్తుండడం గమనార్హం.

పెరుగుతున్న నేరప్రవృత్తి

నగరంలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతుండడం, విక్రయాలకు అడ్డు అదుపులేకుండా పోవడంతో గంజాయి వ్యసనపరులు రాత్రి సమయాల్లో గంజాయి కొనుగోలు చేసి సేవిస్తున్నారు. అర్ధరాత్రి వరకూ గంజాయి సేవిస్తూ మత్తులో రాత్రి వాహనాదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అనవసరంగా గొడవపడుతూ మత్తులో దారుణాలకు పాల్పడుతున్నారు. ఇటీవల యువత గంజాయి మత్తులో అర్ధరాత్రి పలు ప్రాంతాల్లో యువకులు గొడవలకు దిగిన సందర్భాలు ఉన్నాయి.

యుక్త వయసు బుగ్గిపాలు

యువత గంజాయికి అలవాటు పడి తమ బంగారు భవితను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. ఒక్కరికి ఈ వ్యసనం ఉంటే.. అది కాస్తా తమ చుట్టూ ఉన్నవారికి వ్యాపిస్తోంది. ఒకరి చూసి మరొకరు గంజాయి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ మహమ్మారి బారిన పడిన వారికి సరైన అవగాహన కల్పించాలి. యువతరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

పోలీసులు విఫలం

గంజాయి నియంత్రణలో పోలీసులు ఎంత అప్రమత్తంగా ఉన్నా, రవాణాదారులపై ఎంత నిఘా పెట్టినా అమ్మకాలు చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉన్నాయి. రైల్వే, బస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టినా గంజాయి రవాణా ఆగకపోవడంతో గంజాయి నియంత్రణలో పోలీసులు విఫలమవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గంజాయి నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్న పోలీసులు అంతే వేగంగా గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

ఈ ప్రాంతాల్లోనే విక్రయాలు

వరంగల్ నగరంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ ఏరియా, శివనగర్, చింతల్, పుప్పాలగుట్ట, లేబర్‌కాలనీ, ఖిలావరంగల్, ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, సాకరాశికుంట, ఇసుక అడ్డా జంక్షన్, శంభునిపేట, బుడగజంగాల కాలనీ, రంగశాయిపేట, నాయుడు పెట్రోల్ పంప్, ఉర్సు గుట్ట బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో గంజాయి దందా నడుస్తోంది.

మారని పరిస్థితి

గంజాయి రవాణాదారులు పోలీసులకు చిక్కుతున్నా.. అమ్మకాలు నిర్వహించే వారిలో ఎలాంటి మార్పు రావడం లేదు. గంజాయి రవాణా రోజురోజుకూ పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో గంజాయి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. తరచూ ఈ కేసులు నమోదవుతుండడం చూస్తే ఏ స్థాయిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయో అంచనా వేసుకోవచ్చు. యువత, విద్యార్థులు, దినసరి కూలీలు ఇలా అందరినీ లక్ష్యంగా చేసుకొని గంజాయి అమ్మకందారులు డబ్బు సంపాదిస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద సూచించారు. బుధవారం డీసీసీబీ సమావేశ మందిరంలో జిల్లా సహకార అధికారి నీరజ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలులో గతంలో కంటే ఈసారి ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్‌గా రూ. 500 చెల్లిస్తుందని పేర్కొన్నారు. రైతులు దళారులకు అమ్ముకోకుండా ఎక్కువ మొత్తంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే సిబ్బందిని పెంచుకొని సన్న, దొడ్డురకాల ధాన్యానికి వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 17శాతం లోబడి ఉన్న తేమ ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని, అకాల వర్షం వల్ల ఏ ఒక్క ధాన్యం గింజ తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను జీపీలు, ముఖ్య కూడళ్లలో చాటింపు వేయించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వ్యవసాయశాఖ అధికారి అనురాధ, సివిల్ సప్లై డీఎం సంధ్యారాణి, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధనకు కృషి చేస్తా..

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- రైల్వే వ్యాగన్ షెడ్ నిర్మాణ పనుల పరిశీలన


రైల్వే వ్యాగన్ పరిశ్రమ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపి కావ్య

మడికొండ/ కాజీపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాజీపేట జంక్షన్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధించుకునేందుకు తన వంతు కృషి చేస్తానని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. ఈ మేరకు కాజీపేట మండలం అయోధ్యపురం శివారులోని రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమను బుధవారం సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ సాధించుకుంటే కాజీపేట జంక్షన్‌ను సికింద్రాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. కాజీపేట రైల్వేడివిజన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం ప్లానింగ్ హెడ్ క్వార్టర్ సికింద్రాబాద్ లక్ష్మీనారాయణ, అధికారులు వెంకట్, సీడీఎంఏ డీజిల్ అనికేత్, ఏడీఎన్ నార్త్ రామరాజు, ఎస్ఎస్‌సీ వర్క్స్ సత్యరావు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కాజీపేట డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తా...

కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా ఉన్నతీకరించడానికి తన వంతు కృషి చేస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. బుధవారం ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి కాజీపేట రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. వెయింటింగ్ హాళ్లు, రైల్వే ఆస్పత్రిని సందర్శించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. కాజీపేట జంక్షన్‌ను సికింద్రాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కాజీపేటలో ప్లాట్‌ఫారాల విస్తరణ, కాజీపేటలో బస్టాండ్ ఏర్పాటుకు ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు. బస్టాండ్ నిర్మాణానికి.

ఇరైల్వే స్థలాన్ని లీజుకోసం రైల్వే ఉన్నతాధికారులతో సమాలోచనలు చేస్తున్నామన్నారు. రైల్వే ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు రైల్వే జీఎం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. ఎంపీ వెంట స్థానిక కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు సిరిల్‌లారెన్స్, రైల్వే కార్మిక నాయకులు పాక వేదప్రకాశ్, జానీ అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజల పక్షమే..

- జాతీయ రహదారుల నిర్మాణంపై రాష్ట్ర మంత్రులు దృష్టి సారించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు


ముల్కనూర్‌లో జాతీయ రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు

భీమదేవరపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులు ఎప్పుడు ప్రజల పక్షమే పోరాటం చేస్తాయని, పాలక పక్షాలకు తలొగ్గయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలంలో నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఎల్కతుర్తి సమీపంలో నిర్మిస్తున్న మరో జాతీయ రహదారి నిర్మాణానికి ఓవర్ లోడ్‌తో మట్టి టిప్పర్లు వెళ్తున్నాయన్నారు. ఈ మట్టి టిప్పర్లు అధిక లోడ్‌తో స్పీడ్‌తో వెళ్తున్నాయన్నారు. బుధవారం టిప్పర్ బోల్తా పడి భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఎల్కతుర్తి - రామన్‌పేట జాతీయ రహదారి నిర్మాణం పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, దీనిపై విజిలెన్స్ విచారణ జరపాలన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టాలన్నారు. పేదలకు ఇళ్లు, రుణమాఫీ, రైతు భరోసా, పెన్షన్లు తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మూసీ ప్రక్షాళన, హైడ్రాలాంటి పనులు పేదలకు అన్యాయం జరగకుండా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో ఆర్అండ్‌బీ, రోడ్ ట్రాన్స్‌పోర్టు అధికారులు, రెవెన్యూ, మైనింగ్ తదితర శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేస్తేనే పది కాలల పాటు రోడ్లు నాణ్యతగా ఉంటాయన్నారు. జాతీయ రహదారి నిర్మాణంపై రాష్ట్ర మంత్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

వికాసం పేరుతో బీజేపీ వినాశనం సృష్టిస్తుంది..

వికాసం పేరుతో బీజేపీ వినాశనం సృష్టిస్తోందని సాంబశివరావు ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఈవీఎంల కన్నా.. బ్యాలెట్ పేపర్ ఎన్నికలే క్షేమమన్నారు. అమెరికా లాంటి దేశాలు కూడా ప్రస్తుతం బ్యాలెట్ పేపర్ ఎన్నికల వైపు మొగ్గు చూపుతున్నాయన్నారు. జమిలీ ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కమ్యూనిస్టులు జమిలి ఎన్నికలకు విరుద్ధమన్నారు. సాయిబాబా మృతికి కేంద్ర ప్రభుత్వం హత్య అని పేర్కొన్నారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యం వల్లనే హరియాణాలో బీజేపీ పార్టీ గెలిచిందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ రాష్ట్ర నాయకుడు ఆదరి శ్రీనివాస్, సీపీఐ నాయకులు మారుపాక అనిల్, మంచాల రమాదేవి, మంచాల తిరుపతి, ఊట్కూరి రాములు, రావుల లక్ష్మణ్, ఆదరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్ నిధులు హాంఫట్

- సొంత ఖాతాల్లోకి నిధుల మళ్లింపు
- కాకి లెక్కలు చూపి దండుకున్న సిబ్బంది
- ఈ దఫా పరీక్ష నిర్వహణ అనుమానమే!

కేయూ క్యాంపస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఐసెట్-2024 నిర్వహణకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు ఇచ్చిన అవకాశాన్ని అసరాగా తీసుకుని అందినకాడిన దోచుకుతిన్నారు. రూ.92లక్షల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వగా, ఖర్చుల పేరుతో సొంత ఖాతాలకు మళ్లించుకున్నారు. ఆఫీస్‌లో పనిచేసే అసిస్టెంట్లకు, వారి భార్యల పేరుతో నిధులను మళ్లించి అవినీతికి తెరలేపారు. పైగా అంతా నిబంధనల మేరకే పనిచేశామని, ఎక్కడ ఏమీ అవినీతి జరుగలేదని దబాయింపులకు దిగుతున్నారు.

అవినీతి జరిగింది ఇలా...

కాకతీయ యూనివర్సిటీలో ఐసెట్ - 2024 నిర్వహణ కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి రూ.92,76,119 లక్షలు కేటాయించింది. ఐసెట్ పేపర్ సెట్టింగ్‌తో పాటు నిర్వహణ ఖర్చులన్నింటికీ ఆయా డబ్బులను ఖర్చు చేయాల్సి ఉంది. కాగా, ఐసెట్ నిర్వహణ ఖర్చుల పేరుతో 6 నెలల కాలంలో సొంత ఖాతాలకు రూ.29లక్షలను మళ్లించుకుని అవినీతికి తెరలేపారు. అయితే రూ.లక్ష మేర ఖర్చులు చేయాల్సిన అవసరం వస్తే పర్చేజ్ కమిటీ అప్రూవల్ తీసుకోవాల్సి ఉంది. అయితే పర్చేజ్ కమిటీ అప్రూవల్ లేకుండానే రూ.లక్షకుపైగా ఖర్చు చేసి కంప్యూటర్లు కొనుగోలు చేసినట్లు ఆరోపణలున్నాయి. 6 కంప్యూటర్లను యూనివర్సల్, వెంకట్ కంప్యూటర్ సెంటర్ల నుంచి కొనుగోలు చేయగా, ఒక్కో కంప్యూటర్‌కు రూ.87,849, రూ.86,7049లు మేర ఖర్చులు చూపారు.




ఆఫీస్ అసిస్టెంట్ ఖాతాకు..

ఐసెట్ నిర్వహణ ఖర్చుల పేరుతో ఐసెట్ ఆఫీస్‌లో పనిచేసే ఆఫీస్ అసిస్టెంట్ ఖాతాకు నిధులను మళ్లించారు. ఆఫీస్ అసిస్టెంట్ సెల్ఫ్ చెక్కులతో రూ.11లక్షలను ఖర్చులకని మళ్లించారు. అది చాలదన్నట్లు ఆఫీస్‌లో పనిచేసే అసిస్టెంట్ భార్య ఖాతాకు సైతం నిధులను కేటాయించి అందినకాడికి దండుకున్నారు. రూ.82,600 ఆమె సొంత ఖాతాకు సైతం ఐసెట్ నిధులను మళ్లించడంపై వర్సిటీలో చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా, అప్పటి వైస్ చాన్స్‌లర్, కన్వీనర్ ఐసెట్ నిధులను అక్రమంగా తీసుకున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటి అంతే కాకుండా ఐసెట్ కన్వీనర్ వర్సిటీ వాహనాన్నే వాడుకున్నప్పటికీ వాహన ఖర్చులకు నెలకు రూ.40వేల మేరకు చూపి తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

ఈ దఫా ఐసెట్ డౌటే..

కాకతీయ యూనివర్సిటీ ఐసెట్ పరీక్షలను ఏళ్ల తరబడి నిర్వహిస్తోంది. విద్యార్థులకు మ్యాక్ టెస్ట్‌లను సైతం నిర్వహిస్తోంది. అయితే అవినీతి ఆరోపణలు, నిధుల మళ్లింపు వ్యవహారం బట్టబయలు కావడంతో ఈ దఫా కేయూకు ఐసెట్ నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఐసెట్ ఖర్చులపై సమగ్రమైన విచారణ జరిపితే మరిన్ని విషయాలు బయటకు వస్తాయని వర్సిటీలో వర్గాలు చెబుతున్నాయి.







ఆరోగ్య మహిళలకు అత్యంత ప్రాధాన్యం

హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి

ముఖాముఖి



ఆంధ్రజ్యోతి: హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ నూతనంగా ప్రారంభించిన కార్యక్రమాలు ఏమిటి?

డీఎంహెచ్‌ఓ: ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సూచనతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందులో ప్రధానంగా ఆరోగ్య మహిళ అత్యంత ప్రాధాన్యమైంది. 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని 18 నుంచి 35 సంవత్సరాల మహిళలను గుర్తించి క్యాన్సర్ లాంటి ఎనమిది రకాల దీర్ఘకాలిక వ్యాధుల కోసం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్ పనితీరు ఎలా ఉంది?

డీఎంహెచ్‌ఓ: రెండు నెలలుగా సేవలను మరింత విస్తృతపరిచాం. గతంలో డెంగీ, మాక్ ఎలిసా టెస్ట్ కేవలం ఎంజీఎం ఆస్పత్రిలోనే చేసేవారు. ప్రస్తుతం హనుమకొండ టీహబ్‌లో ఈ పరీక్షను నిర్వహిస్తున్నాం. అదే విధంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లను కూడా హనుమకొండ టీహబ్‌లో నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: స్కూల్ హెల్త్ ప్రోగ్రాం ఎలా ఉంది?

డీఎంహెచ్‌ఓ: జిల్లా కలెక్టర్ ఆదేశాల 9 కస్తూరిబా విద్యాలయాలతోపాటు కొన్ని హాస్టల్స్‌లోని విద్యార్థులకు స్టూడెంట్ హెల్త్‌కార్డు పంపిణీ చేశాం. ప్రతినెల వైద్య బృందం ప్రతి విద్యార్థిని పరీక్షించి వివిధ రకాల రక్త పరీక్షలు, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించే విధంగా కార్యాచరణ రూపొందించాం.

ఆంధ్రజ్యోతి: జిల్లా వ్యాప్తంగా మందుల కొరత ఏమైనా ఉందా?

డీఎంహెచ్‌ఓ: ఈ సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. జిల్లాలో ఎక్కడ మందుల కొరత లేదు. అయినప్పటికీ మా ప్రోగ్రాం ఆఫీసర్లు మంగళ, శుక్రవారాల్లో ప్రతి అర్బన్ సెంటర్‌ను, ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్నారు. స్టాక్ పొజిషన్‌ను తనిఖీ చేస్తున్నారు. మందుల కొరత తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నాం.

- వరంగల్ మెడికల్ (ఆంధ్రజ్యోతి)

గవర్నర్‌ను కలిసిన కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ రాజ్ భవన్‌లో గవర్నర్, రాష్ట్ర వర్సిటీల చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి కృతజ్ఞతలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని పేర్కొన్నారు. వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డితోపాటు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఇతర వర్సిటీల వీసీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తే పతనం ఖాయం

రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్ల వద్ద ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల ర్యాలీ, ధర్నా



హనుమకొండ కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు, వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని విస్మరిస్తే ప్రభుత్వ పతనం ఖాయమని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయి న సంతోష్ మండిపడ్డారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు బుధవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఉట్కూరి ప్రణీత్‌గౌడ్, భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ.. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.6500కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్, ఈనెల 27వ తేదీలోగా విడుదల చేయాలన్నారు. లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ దగ్గర వేలాది మంది విద్యార్థులతో ఆందోళనలు చేస్తామన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తామన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందన్నారు. అనంతరం వినతిపత్రాన్ని డీఆర్‌వో వై.వి గణేష్‌కు అందజేశారు. ఈ ధర్నాలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జక్కుల భానుప్రసాద్, జిల్లా సమితి సభ్యులు వినయ్, కుంటి వేణు, శ్రీనివాస్, నాయకులు సురేష్, మనోజ్, సంపత్‌తో, విద్యార్థులు పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్ వద్ద..

వరంగల్ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని విస్మరిస్తే ప్రభుత్వ పతనం తప్పదని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు స్టాలిన్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏకశిలా పార్కు నుంచి ర్యాలీ నిర్వహించి వరంగల్ కలెక్టరేట్ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, శరత్, నాయకులు అభిరామ్, రాకేశ్, శ్రీధర్, శివకుమార్, సంతోష్, రాజు, ఖలీల్, ప్రభాస్, సోను, విద్యార్థులు పాల్గొన్నారు.

భువన్ యాప్ ద్వారా అసెస్మెంట్ల నమోదులో
వేగం పెంచండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల నమోదు పరిశీలనపై సమీక్ష

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భువన్ యాప్ ద్వారా అసెస్మెంట్ల నమోదులో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ.. ప్రతీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ప్రతీ రోజు 150 దరఖాస్తులను భువన్ యాప్ ద్వారా నమోదు చేసే విధంగా చూడాలన్నారు. ప్రస్తుతం 40 వేల దరఖాస్తులు లక్ష్యంగా ఉన్నాయన్నారు. నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్ఐల పని తీరుపై డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు.

ఇంకా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన లో వేగం పెంచాలన్నారు. టీపీఎస్‌లు, వార్డు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, రవీందర్, ఐటీ అధికారి రమేష్‌లు ఉన్నారు.

వాన నీటిని ఒడిసి పట్టాలి

కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అడిషనల్ సెక్రటరీ శుబోత్ యాదవ్

గంగాపూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్మాణాల పరిశీలన



గంగాపూర్ వద్ద అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న శుబోత్ యాదవ్

బచ్చన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని ఒడిసిపట్టే ప్రక్రియలు కొనసాగించినప్పుడే భావితరాలకు భూగర్భ జలాలు అడుగంటి పోకుండా అందించగలుగుతామని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అడిషన్ సెక్రటరీ శుబోత్ యాదవ్ అన్నారు. బుధవారం బచ్చన్నపేట మండలం గం గాపూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. 2019-20 సంవత్సరంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి రూ.2.50 కోట్లతో గంగాపూర్, నాగిరెడ్డిపల్లి, పడమటికేశ్వాపూర్ గ్రామాల శివారుల్లో ఆరు చెక్‌డ్యాంలు, ఎనమిది ఫీజో మీటర్ బోరుబావులు, ఒక భూగర్భ చెక్‌డ్యాం నిర్మాణం, 18 బోర్‌వెల్ రీచార్జ్ బావులు వేశారు. వాటి ఫలితాలు ప్రస్తుతం ఎలా ఉన్నాయనే విషయం తెలుసుకోవటానికి శుబోత్ యాదవ్, రాష్ట్ర, జిల్లా అధికారుల బృందంతో కలిసి పర్యటించి, పరిశీలించారు. దేశ వ్యాప్తంగా ఇలాంటి ప్రాజెక్ట్‌లు ఏపీ, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో మరో మూడుచోట్ల చేపట్టగా, ఇక్కడ విజయవంతం అయినట్టు తెలిపారు. ఇందుకు అనుకూలించిన పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు రావటం జరిగిందన్నారు. స్థానిక రైతుల నుంచి వివరాలు సేకరించారు. ప్రాజెక్ట్ ఏర్పాటుకు ముందు, తరువాత ఎలాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ప్రాజెక్ట్‌లు మరికొన్ని మంజూరు చేయాలని డీఆర్డీవో వసంత కోరారు. ఇందుకు ఆయన సాను కూలంగా స్పందించారు.

అలాగే జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో రూఫ్‌టాప్ రీచార్జ్ పిట్స్‌లకు ప్రణాళికలు తయారు చేసి పంపితే తక్షణం నిధులు మంజూరు చేస్తామని శుబోత్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర భూగర్భ జలబోర్డు దక్షిణ ప్రాంత రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి, ఎంపీడీవో మల్లిఖార్జున్ క్లస్టర్ టీఏ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్‌లో మానసకు డాక్టరేట్



హనుమకొండ (ఆంధ్రజ్యోతి): చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో పరిశోధక విద్యార్థి బి.మానసకు డాక్టరేట్ ప్రదానం జరిగింది. హనుమకొండ గోపాలపురం ప్రాంతానికి చెందిన మానస డైనమిక్ అండ్ రిలయబుల్ లోడ్ బ్యాలెన్సింగ్ స్ట్రాటజీ ఇన్ సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ నెట్‌వర్కింగ్ ఎనేబుల్ నెట్‌వర్క్ అనే అంశంపై ప్రొఫెసర్ ఏ రమేష్ బాబు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. బి.మానస ప్రస్తుతం వరంగల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా మానసను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.



షోరూమ్ ప్రారంభోత్సవంలో నేతలు, నిర్వాహకులు

హనుమకొండ చౌరస్తాలో రామ్‌రాజ్ షోరూం ప్రారంభం

హనుమకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వస్త్రరంగంలో ప్రసిద్ధి చెందిన రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ హనుమకొండ చౌరాస్తాలో ఏర్పాటైంది. దీనిని బుధవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించగా, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జ్యోతిప్రజ్వలన గావించారు. 'కుడా' చైర్మన్ ఇ.వెంకట్‌రామ్‌రెడ్డి తొలి కొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దేశం గర్వించేలా అందం, ఆనందం, సంప్రదాయాల మేళవింపుతో, వినియోగదారులను ఆకట్టుకునే తరహాలో వస్త్రాలను విక్రయాలకు సిద్ధంగా వుంచినట్లు వివరించారు.

2008 డీఎస్సీ ఏజెన్సీ అభ్యర్థులకు అన్యాయం

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2008లో 30 శాతం కోటా ఉద్యోగం కోల్పోయిన ఏజెన్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.9 తీసుకొచ్చి ఎంటీఎస్ పద్ధతిలో కాంట్రాక్టు ఎస్జీటీ పోస్టులను భర్తీ చేస్తుండగా అసలైన ఏజెన్సీ అభ్యర్థులకు అడ్డంకులు ఏర్పడి మళ్లీ అన్యాయమే జరుగుతుందని వాపోతున్నారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటనలో ఆవేదనను వెలిబుచ్చారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబరు 5 వరకు నిర్వహించిన సర్టిఫికేషన్ లిస్టు ఏజెన్సీది కాదని, అది నకిలీదని వారు ఆరోపించారు. 70 శాతంలో ద్యోగం పొందిన వారిని మళ్లీ 30 శాతంలో పిలిచారని, అదే విధంగా 2010లో తొలగించిన నకిలీ ఏజెన్సీ అభ్యర్థులపేర్లు జాబితాలో ఉన్నాయని వారు పేర్కొన్నారు.

భువన్ యాప్ ద్వారా అసెస్మెంట్‌ల నమోదులో వేగం పెంచండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ ఆకడే

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భువన్ యాప్ ద్వారా అసెస్మెంట్‌ల నమోదులో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ప్రతీ రోజు 150 దరఖాస్తులను భువన్ యాప్ ద్వారా నమోదు చేసే విధంగా చూడాలన్నారు. ప్రస్తుతం 40 వేల దరఖాస్తులు లక్ష్యంగా ఉన్నాయని అన్నారు. నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్ఐల పని తీరుపై డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు. ఇంకా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలన్నారు. టీపీఎస్‌లు, వార్డు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, రవీందర్, ఐటీ అధికారి రమేష్‌లు ఉన్నారు.

బయో కెమిస్ట్రీలో శ్రీనివాస్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్, అక్టోబ రు 23 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ బయో కెమిస్ట్రీ విభాగం పరిశోధకుడు శ్రీనివాస్ పరాంకుశంకు డాక్టరేట్ ప్రకటించినట్లు బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'ప్యూరిఫికేషన్‌అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ రిబో ఫ్లివిన్ బిండింగ్ ప్రోటీన్ ఫ్రం ఎగ్గామ్ వైట్ అండ్ ఎగ్ యాక్స్ ఆఫ్ కామన్‌కేన్ (గ్రూస్ గ్రూస్)' అనే అంశంపై సమర్పించిన పరిశోధక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. కేయూ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ జేరిపోతుల మధుకర్ పర్యవేక్షణలో శ్రీనివాస్ పరిశోధన పూర్తి చేశారు. శ్రీనివాస్ ప్రస్తుతం వర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో పార్టుటైం అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు.

జర్నలిస్టు సుభాష్‌కు పలువురి నివాళి



సుభాష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ రాజనారాయణ, ఎడిషన్ ఇన్‌చార్జ్ రాజేష్, జర్నలిస్టులు

బాలసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్టు నాయకపు సుభాష్‌కు పలువురు నాయకులు, జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులు ఘన నివాళి అర్పించారు. బుధవారం హనుమకొండ భీమారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సుభాష్ దశదిన కర్మ కార్యక్రమానికి 'ఆంధ్రజ్యోతి' బ్యూరోచీఫ్ తడక రాజనారాయణ, ఎడిషన్ ఇన్‌చార్జ్ కె.రాజేష్, ఆంధ్రజ్యోతి జర్నలిస్టులు హాజరై సుభాష్ చిత్రపటానికి నివాళులర్పించారు. సుభాష్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందజేశారు. సుభాష్ సుదీర్ఘకాలంగా ఆంధ్రజ్యోతిలో పనిచేసి గుండెపోటుతో మృతిచెందడం బాధకరమన్నారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ రిపోర్టర్ వెల్దండి రమేష్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రతినిధి నవీన్, సీనియర్ జర్నలిస్టులు సాయిరెడ్డి, కొరుకొప్పుల నరేందర్, ఎం.డి.రజాక్, బి.జయరాజ్, ఉమేందర్, వడిచెర్ల శ్రీనివాస్, కట్కూరి రవి, పొగాకుల ప్రభా కర్, నందకిషోర్, అర్షం సదానందం, ముక్కెర రమే ష్, మంచాల రాజు, నన్నపునేని భరత్, బండారి సతీష్, కడవెండి ధనుంజయ, కంది భరత్, కుమా ర్, నరేష్, విజేందర్, ఫొటో జర్నలిస్టులు హరీష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన నాయకులు..

సీనియర్ జర్నలిస్టు నాయకపు సుభాష్ చిత్రప టానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భం గా గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ తరపున సుభాష్ కుటుంబానికి రూ.25వేలు అందజేశారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, ఆరూరి రమేష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారు లు, ప్రెస్‌క్లబ్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



హనుమకొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు దృష్ట్యా గురువారం ఆర్ఈసీ సబ్ స్టేషన్ పరిధిలోని దర్గా, హౌసింగ్‌బోర్డుకాలనీ, బియా బాని నగర్, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్, భీమ్ నగర్, ఈపీఎఫ్ ఆఫీస్ రోడ్డులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వర కు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జనార్దన్‌రావుకు కాళోజీ ఫౌండేషన్ ఘన నివాళి

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కవి, రచయిత, ప్రముఖ సాహితీవేత్త ప్రొఫెసర్ తంగెడ జనార్దన్‌రావు సోమవారం మృతి చెందగా ఆయనకు కాళోజీ ఫౌండేషన్, మిత్రమండలి ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి మాట్లాడుతూ.. కాళోజీ సోదరులు స్థాపించిన మిత్ర మండలిలో క్రమం తప్పకుండా హాజరవుతూ అనేక కవితలను జనార్దన్‌రావు వినిపించారని అన్నారు. సమాజం, సాహిత్యం పట్ల మక్కువ చూపిస్తూ నూతన సమాజ నిర్మాణానికి తనవంతు కృషి చేసేవారని పేర్కొన్నారు. ఆయన మృతి సాహితీ లోకానికి తీరనిలోటని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు, రచయితలు అంపశయ్య నవీన్, పొట్లపల్లి శ్రీనివాసరావు, పందిళ్ల అశోక్‌కుమార్, సిరాజొద్దీన్, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఆటోనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 21వ డివిజన్ ఎల్.బి.నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మహ్మద్ ఫుర్ఖాన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ సీసీ రోడ్డు పనులకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2కోట్ల 89లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఎల్‌బీ నగర్, తిలక్‌నగర్ జంక్షన్ నుంచి అబ్బూస్ ఫంక్షన్ హాల్ మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు మారేడు నరసన్న, యాకూబ్‌పాషా, ఉమేష్, సౌమ్య, ఫరీదా, రబ్బాని పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సమాచారం సేకరించాలి

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వివాదాలకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజల సమగ్ర సమాచార సేకరణ చేయాలని బీసీ కమిషనర్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి సమగ్ర కుటుంబ సమాచార సేకరణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కమిషనర్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల కుటుంబ సమగ్ర సమాచార ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించడానికి నవంబరు 2న హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ వర్గాల ప్రజల నుంచి గణనపై విజ్ఞాపనలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి నిష్పక్షపాతంగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి..

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు23: (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 9వ డివిజన్‌లో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కారం కోసం నిధులు కేటాయించాలని 9వ డివిజన్ కార్పొరేటర్ చీకటి శారద వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు.

గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా ఆందోళనలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా బుధవారం కేయూ ప్రధాన గ్రంథాలయం ఎదుట పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు నేతృత్వంలో విద్యార్థులు నిరసన ఆందోళనలు చేపట్టారు. ప్లకార్డులను పట్టుకుని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భగా నరసింహరావు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్యాయం జరిగే విధంగా తీసుకువచ్చిన జీవో 29ని రద్దు చేసి గ్రూప్-1 అభ్యర్థులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గ్రూప్-1 అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు వారితో చర్చించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అశోక్, నరేశ్, చరణ్, వీరన్న, స్వాతి, సూర్య, పృథ్వీరాజ్, సంగీత, అనూష తదితరులు పాల్గొన్నారు.



23వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



21వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ ఫుర్ఖాన్



లూయిస్ అంధుల పాఠశాలలో అంధ విద్యార్థికి కేక్ తినిపిస్తున్న కటకం పెంటయ్య

ఘనంగా కొండా మురళి జన్మదిన వేడుకలు

ఆటోనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొండా మురళి జన్మదిన వేడుకలను గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడ, 21వ డివిజన్ ఎల్.బి.నగర్, వరంగల్ కొత్తవాడ లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో డివిజన్ నాయకుడు గొండ శ్రీనివాస్, కార్పొరేటర్ ఫుర్ఖాన్, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కటకం పెంటయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు గొండ రజిత-శ్రీనివాస్, నాయకులు బొల్లు సతీష్, పిండి శ్రీను, దామోదర్, రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. 21వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు మారేడు నరసన్న, ఎం.డి.యాకుబ్‌పాషా, కుసుమ ఉమేష్, అజామ్, కుమారస్వామి, పుణేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రబ్బాని తదితరులు పాల్గొన్నారు. లూయిస్ పాఠశాలలో మున్నూరుకాపు సంఘం నాయకులు కనుకుంట్ల రవికుమార్, కంభంపాటి శ్రీధర్, పేరుకారి శ్రీధర్, పూజారి సత్యనారాయణ, మండటి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

40వ డివిజన్, కరీమాబాద్‌లో..

కరీమాబాద్ (ఆంధ్రజ్యోతి): కొండా మురళీధర్‌రావు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. అండర్ రైల్వే గేటు ప్రాంతంలోని 40వ డివిజన్ ఉర్సు ప్రాంతంలో కాంగ్రెస్ నాయకుడు గడ్డం యుగేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గౌడ సొసైటీ చైర్మన్ మండా వెంకన్నగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు బత్తిని హరిగౌడ్ పాల్గొన్నారు. అలాగే కరీమాబాద్‌లో కాంగ్రెస్ నాయకుడు వొగిలిశెట్టి అనిల్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అక్తర్, జిల్లా నాయకుడు ఆరెల్లి రవి పాల్గొన్నారు. అలాగే నగరంలోని అన్నపూర్ణ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ వరంగల్ నగర మహిళా అధ్యక్షురాలు స్వప్న మురళీగౌడ్ రక్తదానం చేశారు.



సైకిళ్లు పంపిణీ చేస్తున్న కల్పన నవీన్, నల్గొండ రమేశ్, మడిపెల్లి కృష్ణ



కొండా పటేల్ కాలనీలో పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేత మీసాల ప్రకాష్

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

మట్టెవాడ(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు జన్మదిన వేడుకలను సీనియర్ కాంగ్రెస్ నాయకులు మడిపల్లి కృష్ణ ఆధ్వర్యంలో వరంగల్ 28వ డివిజన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. వరంగల్ రామన్నపేటలోని ఆంధ్ర బాలిక హైస్కూల్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గందె కల్పన నవీన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నల్గొండ రమేశ్, వరంగల్ బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండు శ్రీనివాస్, స్థానిక నాయకులు నార్ల సతీష్, రేణిగుంట్ల ప్రమోద్, సాయి కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

శివనగర్‌లో..

ఖిలావరంగల్(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు జన్మదినం సందర్భంగా 34వ డివిజన్ శివనగర్‌లో కాంగ్రెస్ నాయకుడు పగడాల సతీష్ ఆధ్వర్యంలో గోపాల నవీన్‌రాజు వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. అలాగే 35వ డివిజన్‌లో కార్పొరేటర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. టీపీసీసీ కార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు రెణికుంట్ల శివ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 37వ డివిజన్ తూర్పు కోటలో కార్పొరేటర్ సువర్ణ-సురేష్, 38వ డివిజన్ కార్పొరేటర్ ఉమా-దామోదర్‌యాదవ్, 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, నా యకులు మరుపట్ల సాయికుమార్, శ్రీరాం రాజేష్, కాం గ్రెస్ నాయకులు నల్గొండ రమేష్, సందెల లాజర్, బో యిని దూడయ్య వేడుకలు నిర్వహించారు.

● గిర్మాజీపేట (ఆంధ్రజ్యోతి): 27వడివిజన్ కొండా పటేల్ కాలనీలో టీపీసీసీ నేత మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ కేక్ కట్ చేసి కొండా మురళీధర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. కాలనీ అధ్యక్షుడు దౌడు నాగరాజు, స్థానికులు శ్యామల, రవి, శ్రీకాంత్, అమర్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు. కొండా మురళి పుట్టినరోజు సందర్భంగా బుధవారం వరంగల్ గోవిందరాజస్వామి ఆలయ పూజారులు మృత్యుంజయ హోమం నిర్వహించారు. మంత్రి కొండా దంపతులు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవలందించాలని హోమం చేసినట్లు పూజారులు శ్రీనివాసస్వామి, అర్చకులు లక్ష్మణస్వామి, మురళీ కృష్ణస్వామి తెలిపారు.

కార్యకర్తలు, అభిమానులకు అండగా ఉంటాం

▶▶ మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

మట్టెవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తలు, కొండా అభిమానులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగరంలోని అన్నపూర్ణగార్డెన్స్‌లో బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రక్తదాన శిబిరం కోఆర్డినేటర్‌గా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తోట హరీష్, చిలువేరు శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోట హరీష్, చిలువేరు శ్రీనివాస్, తోట వేణు మాధవ్, మబ్బు ప్రవీణ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎస్ చందర్, దాసరి రాజేష్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

ఆర్టీసీ కార్పొరేషన్ సెక్రటరీ, కరీంనగర్ జోనల్ ఈడీ మునిశేఖర్

బాలసముద్రం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ కార్పొరేషన్ సెక్రటరీ, కరీంనగర్ జోనల్ ఈడీ పి.వి. మునిశేఖర్ అన్నారు. బుధవారం హనుమకొండలోని ఆర్ఎం కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన స్కిల్ డెవలప్ మెంట్ కాన్ఫరెన్స్ హాల్‌ను ఈడీ పి.వి.మునిశేఖర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కరీంనగర్ జోన్‌లోని రీజినల్ మేనేజర్‌తో సమావేశం నిర్వహించి ఎలక్ట్రిక్ బస్సుల గురించి మాట్లాడారు. ఎలక్ట్రిక్ బస్సుల పాయింట్ కోసం చేస్తు న్న ఏర్పాట్లను పరిశీలించారు. బస్సుల నిర్వహణ పరంగా ముందస్తు ప్రణాళికతో అధికారులు సిద్ధం కావాలని ఆయన సూచించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసీ లాభాల బాటలో నడవాలని కోరారు. అనంతరం అరెపల్లిలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థుల స్నాతకోత్సవంలో పాల్గొని విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, ఖమ్మం, ఆదిలా బాద్, నిజామాబాద్ రీజినల్ మేనేజర్లు, వరంగల్ డిప్యూటీ ఆర్ఎం కె.భానుకిరణ్, జి.మాధవరావు, ఏ.రవీందర్, పుష్పాల అర్పిత, వరంగల్-1,2 డిపో, హనుమకొండ డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీఎస్‌లో ఫ్రెషర్స్ విద్యార్థులకు ఓరియంటేషన్



మాట్లాడుతున్న తిరుమల్‌రావు

హనుమకొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో పీజీ నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపక చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు హాజరై విద్యార్థులు అలవర్చుకోవల్సిన అలవాట్లు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. కళాశాలలో జరిగే ప్లేస్‌మెంట్ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ టాలెంట్ ఆక్విషన్ మేనేజర్ బత్తుల వెంకట్, ట్రెయినింగ్ సొల్యూషన్ డైరెక్టర్ శ్రీధర్ గౌరవ అతిథులుగా హాజరై విద్యార్థులు నేర్చుకోవల్సిన స్కిల్స్, నాలెడ్జ్ అప్టిట్యూట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ డాక్టర్ ఈవీ రావు, ప్రొఫెసర్ ఏకే రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఓరియంటెండ్ విద్యా ద్వారానే ఉన్నత స్థానం

హనుమకొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విజన్ ఓరియంటెండ్‌గా విద్యను అభ్యసించినప్పుడే ఎంబీఏ విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోగలుగుతారని శుభం ఆయిల్స్ వ్యవస్థాపకుడు వినోద్ గోయల్ సూచించారు. బుధవారం కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంబీఏ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఓరియంటేషన్, ఇండెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంబీఏ ఫస్ట్ ఇయర్ లో చేరిన విద్యార్థులు వాగ్దేవి కళాశాలల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ సీహెచ్. దేవేందర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ వాహినిదేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శేషాచలం, వైస్‌ప్రిన్సిపాల్ హరిందర్‌రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ సుగుణాకర్‌రెడ్డి, రజినీకుమార్, కరుణ, చంద్రకళ, శాంభవి, అరవింద, స్వాతి, వెంకటేశ్వర్లు, ఆకాష్ పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పారా మెడికల్ బోర్డు ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 30వ తేదీలోపు కాకతీయ మెడికల్ కాలేజీలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్ ప్రతులను సమర్పించాలని సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మట్టెవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా అన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీసీపీ ప్రారంభించారు. మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ, పోలీసు స్టేషన్ల పరిధిలోని యువకులు, పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు డీసీపీ సర్టిఫికెట్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నందిరాంనాయక్, సీఐలు షుకూర్, వెంకటరత్నం, రక్తనిధి ఇన్‌చార్జి మేరీ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న శానిటరీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.యేసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ప్రధాన కార్యాలయం ఎదుట రిలేనిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా యేసురత్నం మాట్లాడుతూ.. విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు వెంటనే ఉద్యోగం కల్పించాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుడికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం బల్దియా సీఎంహెచ్‌వో రాజారెడ్డిని పిలిచి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు.

మాజీ వీసీ, ఐసెట్ కన్వీనర్‌పై విచారణ చేపట్టాలి

కేయూ క్యాంపస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐసెట్-2024లో నిధుల గోల్‌మాల్ చేసిన కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, ఐసెట్ కన్వీనర్ నరసింహచారిలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నేతలు ధ్వజమెత్తారు. బుధవారం కేయూలో ఏర్పాటు చేసిన ఏబీవీపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు, కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్‌లు మాట్లాడారు. 2024-25 ఐసెట్ పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కేయూకు అప్పగించిన రూ.92,76,119లను పరీక్షల కన్వీనర్‌గా ఉన్న ప్రొఫెసర్ నరసింహచారి తన అకౌంట్‌కు రూ.29లక్షలు బదిలీ చేసుకున్నారని ఆరోపించారు. అలాగే మరో దఫా రూ.16లక్షలను డ్రా చేసుకున్నారని పేర్కొన్నారు. ఏటా ఐసెట్ పరీక్షలకు రూ.60-70 లక్షలు కాగా, ఈ దఫా రూ.92 లక్షలు ఖర్చు చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు కేయూలో నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టి నిజానిజాలను తేల్చాలని డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగం చేసిన అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని అన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నేతలు నిమ్మల రాజేశ్, చట్ల సతీశ్, సాయి, రాజ్‌కుమార్, సంపత్, శ్రీనివాస్, వెంకట్, మహేశ్, వేణు పాల్గొన్నారు.

నరకాసుర వధ ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరణ

కరీమాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా ఈ నెల30న నిర్వహించే నరకాసుర వధ ఉత్సవాల కరపత్రాలను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. బుధవారం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సురేఖను మర్యాద పూర్వకంగా కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. అలాగే ఉత్సవాలకు ప్రభుత్వ పరంగా అన్ని రకాల ఏర్పాట్లు చేసి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ వేడుకలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసేలా ఆయా శాఖల అధికారులకు ఆదేశిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి శతపతి శ్యామలరావు, సహాయ కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి వనం కుమార్, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, అన్న కుమారస్వామి, శివ, నర్సింహా, రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ విజేత హనుమకొండ

వరంగల్ స్పోర్ట్స్ అక్టోబరు 23: (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుకాంత్ క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-23 బాలుర క్రికెట్ పోటీల్లో హనుమకొండ జిల్లా జట్టు మహబూబాబాద్‌పై 58పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బుధవారం హనుమకొండ వర్సెస్ మహబూబాబాద్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ జట్టు నిర్ణీత 20ఓవర్లకు 9వికెట్లు కోల్పోయి 122పరుగులు చేసింది. జట్టులోని రిత్విక్ 23పరుగులు, రాణా 18పరుగులతో రాణించగా, మహబూబాబాద్ జట్టు బౌలర్లు రిషియాదవ్ 3వికెట్లు, ప్రణయ్, రాకీబ్ తల రెండు వికెట్లు తీసి హనుమకొండ జిల్లా జట్టు పరుగులను కట్టడి చేశారు. 122 స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్ బరిలోకి దిగిన మహబూబాబాద్ జట్టు టాప్ ఆర్డర్స్ మొత్తం విఫలం కావడంతో 16 ఓవర్లు ఎదుర్కొని కేవలం 64పరుగులు సాధించి ఆలౌట్ కావడంతో 58పరుగుల తేడాతో హనుమకొండ జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. ముగింపు వేడుకల్లో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. హనుమకొండ జిల్లా జట్టుకు నిర్వాహకులు ట్రోఫీని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్యదర్శి ఉదయభానురావు, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉపేందర్, సభ్యులు పాల్గొన్నారు.

'నమస్తే' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డి స్లడ్జింగ్ ఆపరేటర్లు, సెప్టిక్‌ట్యాంక్ వర్కర్లు నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బల్దియా అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డి సూచించారు. బల్దియా కౌన్సిల్ కార్యాలయంలో బుధవారం స్లడ్జింగ్ ఆపరేటర్లు, సెప్టిక్‌ట్యాంక్ వర్కర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వర్కర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మలవ్యర్థాలు తొలగించే సిబ్బందికి నమస్తే కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందన్నారు. స్లడ్జింగ్ ఆపరేటర్లు, సెప్టిక్‌ట్యాంక్ వర్కర్లు నమస్తే పోర్టల్‌లో పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ కార్డులను పొందడానికి అర్హులవుతారన్నారు. సిబ్బంది స్వీయ రక్షణకు పీపీ కిట్లు కూడా అందిస్తామన్నారు. ఇప్పటికే వరంగల్ బల్దియా నుంచి సెప్టిక్ ట్యాంక్ వాహనాలు మలాన్ని తొలగించేందుకు అనుమతులు కూడా పొందారన్నారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నెంబర్ 11420ని అందుబాటులోకి తెచ్చామన్నారు. సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లు ఈ నెంబర్‌పై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి రూ.5లక్షల సబ్సిడీ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరి సూపర్‌వైజర్లు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలి..

హనుమకొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ టీచర్, సామాజికవేత్త అరుణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం లష్కర్ బజార్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూఎస్ఎఫ్ఐ అడ్వయిజర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కాంగ్రెస్ తీసుకొచ్చిన పథకమని గొప్పలు చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు.. వాటిని విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వేలాదిమంది నిరుద్యోగ యువత, ఉపాధ్యాయులు జూనియర్ డిగ్రీ కళాశాలలను గడుపుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నారని, వీటిని విడుదల చేయక పోవడంతో అనేక మంది రోడ్డున పడే ప్రమాదం ఉందని అన్నారు. వేలాది మంది విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌పైనే ఆధారపడి చదువుకుంటున్నారని కానీ గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలోతు రాజేష్‌నాయక్, మధు, సూరి, సహాయ కార్యదర్శి రంగస్వామి, గణేష్, తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేయాలి

ఖిలావరంగల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ జెండాను ఎగురవేయాలని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. బుధవారం ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో 36, 37, 38 డివిజన్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత బీజేపీవైపు మొగ్గుచూపుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కుసుమ సతీష్, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, డివిజన్ అధ్యక్షులు అంకాల జనార్దన్, సోషల్ మీడియా కన్వీనర్ ఇనుముల అరుణ్, కిసాన్ మోర్చా నాయకుడు ఇనుములు రాజు పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న రవికుమార్

క్రైం కార్నర్

తల్వార్లతో యువకుల హల్‌చల్

సోషల్ మీడియాలో చక్కర్లు

కరీమాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అండర్ రైల్వేగేటు ప్రాంతం సాకరాశికుంటలో మంగళవారం రాత్రి యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిసిన రోజు అర్ధరాత్రి మద్యం మత్తులో రెండు గ్రూపుల మధ్య జరిగిన వివాదం గొడవకు దారితీసింది. ఈ విషయమై మరుసటి రోజు ఉదయం ఇరువర్గాల వారు గ్రూపులుగా మరోమారు బీరుసీసాలు, తల్వార్లు పట్టుకొని హల్‌చల్ చేశారు. విషయం తెలుసుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. గొడవకు దిగిన ఇరువర్గాల వారిపై విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ వెంకటరత్నం తెలిపారు. కాగా, సాకరాశి కుంటలో చెలరేగిన గ్రూపు తగాదాలకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

హనుమకొండ టౌన్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ వాహనదారులకు న్యాయమూర్తి విద్యాసాగర్ జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ సీతారెడ్డి తెలిపారు. తనిఖీల్లో పట్టుబడ్డ 43 మందిని బుధవారం కోర్టులో హాజరుపరుచగా 32 మందికి రూ.42,100 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 9 మందికి రూ.6వేల జరిమానా, మరో ఇద్దరికి కమ్యూనిటి సర్వీసింగ్ క్రింద 2 రోజుల శిక్ష విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

● మట్టెవాడ(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి బుధవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వారికి రూ. 27,400, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ముగ్గురికి రూ. 2500 జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

అక్రమంగా నిలువ ఉంచిన బాణసంచా పట్టివేత

మడికొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మడికొండ, కుమ్మరిగూడెంలో అనుమతులు లేకుండా నిలువ ఉంచిన బాణసంచా దుకాణాలపై బుధవారం టాస్క్‌ఫోర్స్ బృందం, మడికొండ పోలీసులు దాడులు చేసి రూ.లక్షల విలువైన బాణసంచాను పట్టుకున్నారు. స్థానిక ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన కోడెం వినయ్‌కుమార్ జనరల్ స్టోర్‌లో తనిఖీ చేయగా రూ. 3,31,462 విలువైన బాణసంచా లభించింది. అలాగే మడికొండలోని దొంతుల సంపత్‌కి చెందిన కిరాణా షాప్‌లో తనిఖీ చేయగా రూ.1,48,812 విలువైన బాణసంచా లభించింది. మొత్తం రూ.4,80,274 విలువ గల బాణసంచాను సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. అలాగే నిందితులు వినయ్‌కుమార్, సంపత్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుట్కాల పట్టివేత

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంతెజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎల్బీ నగర్ ప్రాంతంలో బుధవారం తనిఖీ చేసి గుట్కాలు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఎల్బీ నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫజల్ గోదాంలో రూ.4,82,872 విలువ గల గుట్కాలు, అంబర్ ప్యాకెట్లను స్వాధీనపర్చుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఈ తనిఖీలో సీఐ బాబులాల్, ఎస్సై వెంకన్న, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.


మోదీ నుంచి బహుమతి అందుకుంటున్న లక్ష్మీప్రియ


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అందుకుంటున్న లక్ష్మీప్రియ

ప్రధాని మెచ్చిన చైతన్య

ఓరుగల్లు కళాకారిణికి ముద్దుపేరు పెట్టిన మోదీ

- కూచిపూడి నృత్యంతో ప్రశంసలందుకున్న లక్ష్మీప్రియ
- ఈ ఏడాది ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్‌పురస్కార్‌కు ఎంపిక
- ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరణ

కీర్తి పతాక

అది ఢిల్లీలోని ప్రధాన మంత్రి నివాసం. అక్కడి ఓ పేషీలోని గోడకు ఉండే ఒక ఫొటో అందరినీ ఆకట్టుకుంటూ ఉంటుంది. అది ప్రధాని నరేంద్ర మోదీ ఓ చిన్నారితో కలిసి దిగిన ఫొటో. అంతేకాదు తనతో ఫొటోదిగిన ఆ చిన్నారికి ప్రధాని మోదీ చైతన్య అని ఓ ముద్దు పేరు కూడా పెట్టారు. అంతలా మోదీ మెప్పు పొందిన ఆ చిన్నారి ఎవరో కాదు. మన ఓరుగల్లు కీర్తిపతాక పెండ్యాల లక్ష్మీప్రియ. కూచిపూడి నృత్యంలో అసాధారణ ప్రతిభ కనబరిచినందుకు గాను లక్ష్మీప్రియకు ఈ అరుదైన గౌరవం దక్కింది. ఒకటి కాదు... రెండు సార్లు ప్రధానిని కలిసి... ఆయనతో పదిహేను నిముషాలకు పైగా గడిపే మహదావకాశం పొందింది. మూడేళ్ల ప్రాయం నుంచే నాట్యం నేర్చుకోవడం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి చిన్నతనంలోనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డును అందుకుని తెలంగాణ కీర్తిపతాకాన్ని ఢిల్లీ వీధుల్లో ఎగురవేసింది. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువు ఆశీస్సులతో నాట్యంలో రాణిస్తున్న లక్ష్మీప్రియ అందరికీ స్ఫూర్తిదాయకం.

హనుమకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : 'నాట్యం నాకు ప్రాణం. కూచిపూడితో పాటు వివిధ నృత్యరీతులను తెలుసుకునేందుకు చారిత్రక నేపథ్యాన్ని తరచిచూడాలి. ఇందులో భాగంగానే వేదాలను కూడా అధ్యయనం చేస్తున్నా. సనాతన ధర్మాన్ని కాపాడడంలో నృత్యం కూడా ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. ఇక డిప్యూటీ కలెక్టర్‌గా రిటైర్ అయిన మా తాత పెండ్యాల కిషన్ అడుగుజాడల్లో నడిచి కలెక్టర్ అయి ప్రజలకు సేవ చేయాలన్నదే నా ఆశయం' అని అంటోంది కూచిపూడి నృత్యకారిణి పెండ్యాల లక్ష్మీప్రియ. హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన రాకేశ్ కుమార్, సాయిలత దంపతుల కూతురైన లక్ష్మీప్రియ ప్రస్తుతం ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. నృత్య నేపథ్యం లేని కుటుంబమే అయినా మూడేళ్ల వయసున్నప్పుడే శాస్త్రీయ నృత్యంపై కూతురికి ఉన్న మక్కువను గుర్తించిన తల్లిదండ్రులు నాట్య గురువు బొంపెల్లి సుధీర్‌రావు వద్ద చేర్చారు. అనతి కాలంలోనే కూచిపూడిలో ఎంతో నైపుణ్యం సాధించి హైదరాబాద్‌తో పాటు ఏపీ, తమిళనాడు, కర్నాటక, మధ్యప్రదేశ్, భోపాల్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో సుమారు 200లకుపైగా ప్రదర్శనిచ్చింది. కేంద్ర ప్రభుత్వం నుంచి సీసీఆర్‌టీ ఉపకార వేతనాన్ని కూడా అందుకుంటోంది.

విపత్కర సమయంలోనూ ఆగని సాధన

అనుకున్నది సాధించే పట్టుదల కలిగిన లక్ష్మీప్రియ శివానంద నృత్యమాల నిర్వాహకుడు, నాట్య గురువు బొంపెల్లి సుధీర్‌రావు వద్ద నిరంతరం శిక్షణ తీసుకుంటోంది. కరోనా విప్కర సమయంలోనూ తన సాధనను ఆపలేదు. ఆ సమయంలో పాఠశాలలు బంద్ కావడంతో తన దృష్టినంతా నృత్యం మీదే కేంద్రీకరించింది. అలా కరోనా కాలంలో పడిన కష్టమే ఉత్తమ కళాకారిణిగా ఎదగడానికి దోహదం చేసిందని, నాట్యంతో పాటు చదువులోనూ రాణిస్తోందని గురువు సుధీర్‌రావు ప్రశంసిస్తున్నారు.

ఎన్నో ప్రదర్శనలు.. మెగాస్టార్ ప్రశంసలు..

లక్ష్మీప్రియ కాజీపేటలోని మోన్‌ఫోర్టు సీబీఎస్‌సీ క్యాథలిక్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నప్పుడు ఆ విద్యా సంస్థ యాజమాన్యం నిర్వహించిన అంతర్ పాఠశాలల పోటీలు మాలిక్యూల్ ఫెస్ట్‌లో ప్రదర్శన ఇచ్చి ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ చిన్నారి ప్రతిభను గుర్తించిన పాఠశాల యాజమాన్యం ఆమెకు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచితంగా విద్యనందించింది. వివిఐటీ బాలోత్సవ్‌లోనూ తన ప్రతిభను చాటిన లక్ష్మీప్రియ కాశీలో ఐసీఎండీఏ ఆధ్వర్యంలో గురువు సుధీర్ రావుతో కలిసి శివుని సన్నిధిలో శివతాండవ స్తోత్రానికి కొరియోగ్రఫీ చేసింది. పదివేల మంది ఈ నృత్యంలో పాలు పంచుకున్నారు. వీరి కొరియోగ్రఫీకి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయి. చెన్నయ్‌లో జరిగిన నృత్యపోటీల్లో ఆర్ట్ బుక్ ఆఫ్ రికార్డు, కూచిపూడి, మోహినీ ఆట్టం పోటీల్లో స్పెషల్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు దక్కింది. ఇటీవల మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా హైదరాబాద్ శిల్పకళావేదికలో ఆయన పేరిట నృత్యరూపకాన్ని ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ నృత్యరూపకాన్ని చూసి అబ్బురపడిన చిరంజీవి 'నృత్యం అద్భుతంగా ఉంది' అని ప్రశంసిస్తూ స్వయంగా లేఖ రాశారు.

ప్రధాని నివాసంలో..

2023 ఢిల్లీలోని కాల్‌కటోరా స్టేడియంలో ప్రధాని సమక్షంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పాల్గొని అద్భుత ప్రతిభను కనబరించిన లక్ష్మీప్రియ మోదీ నుంచి ప్రశంసలు అందుకుంది. 2023లో గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో విజిటర్ వీఐపీగా, 2024లో కర్తవ్యపాత్‌లో బాల్‌పురస్కార్ గ్రహీతలైన 19 మందిలో ఒకరుగా పాల్గొంది. పరేడ్‌లో ప్రత్యేక జీపులో తమను తోడ్కొని వెళ్లడం మరచిపోని జ్ఞాపకం అంటున్న లక్ష్మీప్రియ తనకు భామాకలాపం నృత్యరూపం అంటే ఎంతో ఇష్టమని చెబు తోంది. గతేడాది జాతీయ స్థాయి కళోత్సవ్ పురస్కారం అందుకున్న ఆమె దేశవ్యాప్తంగా అన్ని నృత్యరీతుల్లో జరి గిన ఈ పోటీలో రాష్ట్రం తరుపున కూచిపూడి విభాగంలో ఎంపికైంది. పరీక్షాపే చర్చా కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో ప్రధాని మోదీ లక్ష్మీప్రియ నాట్యాన్ని చూసి అభినందనలు కురిపించారు. కళోత్సవ్‌లో విజేతలైన పిల్లలతో మోదీ తన నివాసంలో కొద్ది సేపు గడిపారు ప్రధాని పేషీలో ఉన్న లక్ష్మీప్రియ ఫొటో ఆ సమయంలో దిగినదే.

దర్శక దిగ్గజం విశ్వనాథ్‌కు నివాళిగా

శాస్త్రీయ నృత్యంలో పలు ప్రయోగాలు చేసి ప్రేక్షకుల మన్ననలను పొందుతున్న లక్ష్మీప్రియ.. దివంగత సినీ దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్‌కు నివాళిగా స్వర్ణకమలంలో 'అందెల రవమిది' పాటకు అదే పేరుతో సొంతంగా ఓరుగల్లులో కాకతీయులు నిర్మించిన ఆలయాల నేపథ్యంగా నృత్యరీతిని రూపొందించింది.




నాట్యగురువు బొంపెల్లి సుధీర్ రావుతో..

ప్రతిష్ఠాత్మక బాల్ పురస్కార్‌కు ఎంపిక

జాతీయ స్థాయిలో తొమ్మిది రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన ఐదు నుంచి పద్దెనిమిదేళ్ల పిల్లలకు పీఎం రాష్ట్రీయ బాల్ పుర స్కా ర్ న ు అందజేస్తారు. ఈ పురస్కారానికి ఈ సారి దేశవ్యాప్తంగా 19 మందిని ఎంపిక చేయగా.. తెలంగాణ నుంచి లక్ష్మీప్రియ ఎంపికైంది. కళలు, సంస్కృతి రంగంలో ఆమెకు ఈ పురస్కారం దక్కగా ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అందుకుంది. బాల్ పురస్కార్ పొందిన పిల్లలను ప్రధాని తన నివాసానికి ఆహ్వానించారు. అలా లక్ష్మీప్రియకు రెండోసారి మోదీని కలిసే అవకాశం దక్కింది. ఆమెను చూసిన వెంటనే మోదీ గుర్తుపట్టి 'చైతన్య' అని సంబోధించడం. ఈ క్రమంలో లక్ష్మీప్రియ 'సార్ నా పేరు లక్ష్మీప్రియ అని గుర్తుచేయబోగా నువ్వు చైతన్యవే' అంటూ మోదీ ఆప్యాయంగా తట్టారు. ఇది తన జీవితంలో మరించిపోలేనిది అంటోంది లక్ష్మీప్రియ. ఇక ప్రధాని పేషీలో తన ఫొటో చూసి ఉద్విగ్నానికి గురయ్యానంటోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువు చేయూతతో రాణిస్తూ రాష్ట్రపతి నుంచి రాష్ట్రీయ బాల్‌పురస్కార్ అందుకోవడం తన జీవితంలో మధుర జ్ఞాపకం అంటోంది.


అదరహో 'ప్రేరణ'

గుబాళించిన ఓరుగల్లు ప్రతిభ



హనుమకొండ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో వరంగల్‌లోని నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రేరణ నృత్య రూపకం ఆహుతులను అలరింపజేసింది. అంతేకాకుండా ప్రత్యేకంగా ఆలోచింపచేసింది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ జ్యోతి వెలిగించి ప్రేరణ నృత్య రూపకాన్ని ప్రారంభించారు. కిక్కిరిసిన రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఆయన మాట్లాడుతూ.. ఒకవైపు ఆధ్యాత్మిక మరోవైపు సామాజిక స్పృహతో చక్కని ఇతివృత్తాన్ని అందిస్తూ ముఖ్యంగా నేటి మహిళాలోకానికి ఒక గొప్ప సందేశాత్మక నృత్యరూపకం ప్రేరణ అని ఆయన అన్నారు. పేరిణి నాట్యాచార్యులు నటరాజ రామకృష్ణ ప్రియశిష్యులు గజ్జెల రంజిత్ కుమార్ - నవ్యజ దంపతులు అపూర్వ కృషి చేసి ప్రేరణ నృత్య రూపకాన్ని అద్భుతంగా ప్రదర్శింప చేశారని కితాబిచ్చారు.

ప్రేరిణి నాట్య గురువు డాక్టర్ కళా కృష్ణ మాట్లాడుతూ.. నటరాజ రామకృష్ణ శిష్యబృందంలో తనతోపాటు పాలుపంచుకున్న రంజిత్ కుమార్ కృషికి నిదర్శనంగా ఈ ప్రదర్శన నిలుస్తుందని అన్నారు. మహిళలకు గొప్ప స్ఫూర్తినందించే సందేశంతో ప్రేరణ కొనసాగిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రేరణకు విస్తృత ప్రచారం కల్పించిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు గజ్జెల రంజిత్ కుమార్ స్వాగతం పలుకుతూ తమ ఈ కృషికి ఎందరో తమ గురువులు సీనియర్ కళాకారులు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య కుంజాల, తెలుగు విశ్వవిద్యాలయ నృత్య విభాగాధిపతి డాక్టర్ వనజ ఉదయ్, కేయూ ప్రొఫెసర్ సురేష్‌లాల్, ప్రేరిణి నాట్య గురువులు కళా కృష్ణతో పాటు బండి కుమార్, దుంపేటి సునీల ప్రకాష్, రాయబారపు శ్రవణ్, గుమ్మడి శ్రావణి, వెంకటపైడారావు, తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.ప్రేరణ నృత్యరూపకంలో వరంగల్‌కు చెందిన 70మంది కళాకారులు తమ అపూర్వ నటనా కౌశల్యాన్ని ప్రదర్శించి పరవశింప జేశారు.



ఖమ్మం మెట్ | హైదరాబాద్

చెక్కు చెదరని రాతి దిక్సూచి..

పూర్వకాలంలో ఒక ఊరి నుంచి మరో ఊరికి ప్రయాణం సాగించాలంటే రహదారుల వెంబడి పెద్ద పెద్ద రాతి బండలు ఏర్పాటు చేసి వాటిపై ఊర్ల పేర్లు చెక్కడంతో వాటి ఆధారంగా వెళ్లేవారు. ప్రస్తుతం నగరం ఎంత అభివృద్ధి చెందినా.. నాటి తీపి గుర్తులు ఇంకా దర్శన విస్తున్నాయి. హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డు పక్కన నిజాం కాలంలో ఏర్పాటు చేసిన పురాతన రాతి సూచికపై 'ఖమ్మం మెట్, హైదరాబాద్' అనే అక్షరాలతో చెక్కిన రాతి దిక్సూచి నేటికీ చెక్కు చెదరకుండా దర్శనమిస్తోంది. కాగా, నేటి ఖమ్మం జిల్లా కేంద్రం పేరు నిజాం కాలంలో ఖమ్మంమెట్‌గా పిలుచుకునేవారని చరిత్ర చెబుతోంది. నగర నడిబొడ్డున ఉన్న రాతి దిక్సూచి చాలా మందికి తెలియకపోవచ్చని స్థానికులు చెబుతున్నారు.

- హనుమకొండ చౌరస్తా



డ్రాగన్‌కు సీసీ కాపలా

- తోటలో రక్షణకు రైతు వినూత్న ప్రయత్నం

ఎవరైనా ఇళ్లు, కార్యాలయాలు, దుకాణాల్లో చోరీలు జరగకుండా రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం తెలుసు. కానీ భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామానికి చెందిన ఓ రైతు మాత్రం వినూత్నంగా ఆలోచించాడు. తాను కష్టపడి సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటలో దొంగలు పడుతున్నారన్న అనుమానంతో తోట చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఒక్కో కాయ రూ.100పలుకుతుండగా.. పది కాయలు చోరీకి గురైతే రూ.వెయ్యి కోల్పోయినట్లేనని భావించిన ఆయన సీసీ కెమెరాలను అమర్చడం గమనార్హం.

- 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి

చిరస్థాయిగా నిలిచిన డబ్బాలు



అది హనుమకొండ కేయూ నుంచి పెద్దమ్మగడ్డకు వెళ్లే ప్రధాన రహదారి. ఆ రహదారిలో ఉన్న ప్రాంతానికి డబ్బాల జంక్షన్‌గా పేరుంది. ప్రస్తుతం 5, 54 డివిజన్ల మధ్య ఉన్న ఈ డబ్బాల జంక్షన్ కాస్త హనుమాన్‌నగర్‌గా రూపాంతరం చెందింది. 1977లో పెగడపల్లి జంక్షన్ ప్రాంతంలో కట్కూరి సత్తయ్య సెలూన్ షాపు, రాజయ్య లాండ్రి షాపు, సిరబోయిన కరుణాకర్ సైకిల్ రిపేరింగ్ షాపు, రాజేందర్, రాజకొంరయ్యల చాయ్ హోటళ్లు, బాబు, మల్లమ్మ చిల్లరకొట్లు, భూషణం రామప్పలు పాన్‌షాపులు నడిపేవారు. అయితే అప్పటికే ఈ ప్రాంతంలో పురాతన హనుమాన్ దేవాలయం ఉండడంతో కాలనీ పెద్దలు 1983లో హనుమాన్‌నగర్‌గా నామకరణం చేశారు. కానీ కాలక్రమేనా 1988 నాటికి ఆ ప్రాంతంలో 12 డబ్బాలు ఏర్పడటంతో డబ్బాల జంక్షన్‌గా పేరొచ్చింది. క్రమంగా భూములకు రేట్లు పెరగడంతో చాలామంది ప్లాట్లు కొనుగోలు చేయడంతో ఆ ప్రాంతం రూపురేఖలు మారాయి. 2000 సంవత్సరం నాటికి ఆ డబ్బాలు పోయి చిన్నపాటి షాపులు, షట్టర్లు రాగా ప్రస్తుతం కమర్షియల్ కాంప్లెక్సుల ఏర్పాటుతో కాస్ట్‌లీ ప్రాంతంగా గుర్తింపు వచ్చింది. గజం రూ.1.50లక్ష పలుకుతోంది. కానీ ఆప్రాంతానికి ఉన్న డబ్బాల జంక్షన్ పేరు మాత్రం ఎవరూ మరిచిపోలేదు.

- వరంగల్ కార్పొరేషన్

ఆదర్శం

అ'పూర్వ'ం.. వారి సేవాగుణం

- స్కూల్‌కు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- వచ్చే అద్దెలతో స్వచ్ఛంద కార్యక్రమాల నిర్వహణ
- ఆదర్శంగా నిలుస్తున్న శివునిపల్లి పూర్వ విద్యార్థులు



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పిన బడికి ఏదో ఒకటి చేయాలని.. అది కూడా భావితరాలకు ఉపయోగపడేలా ఉండాలని భావించారు ఆ పూర్వ విద్యార్థులు. అనుకున్నదే తడవు గా చేయిచేయి కలిపి పాఠశాల కోసం ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఆ కాంప్లెక్స్‌ను కిరాయికి ఇచ్చి వచ్చిన అద్దె సొమ్ములతో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తతన్నారు స్టేషన్ ఘన్ పూర్ జంట పట్టణంలోని శివునిపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు. శివునిపల్లి 1952లో హైస్కూల్ ఏర్పాటు జరగ్గా.. ఈ 60ఏళ్లలో ఎంతో మంది చదువుకున్నారు. అలాంటి పూర్వవిద్యార్థులు వందలాది మంది ఏకమయ్యారు. 2005లో సమావేశమై పూర్వ విద్యార్థుల కమిటీని ఏర్పాటు చేసుకుని.. తమవంతుగా కొంత సొమ్ము, మరికొంత సొమ్మును విరాళాల రూపంలో సేకరించారు. ఈ క్రమంలో అద్దెకు తీసుకునే వారితో ముందే ఒప్పందం చేసుకుని వారి నుంచి అడ్వాన్స్‌గా కొంత డబ్బును తీసుకుని.. ఆ మొత్తంతో పాఠశాల ముం దున్న స్థలంలో 9గదులతో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి.. అద్దెకు ఇచ్చారు. ఆ గదులకు కిరాయి రూపంలో వస్తున్న ఆదాయాన్ని పాఠశాల అత్యవసరాలకు, మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడానికి వినియోగిస్తున్నారు. అయితే తొలి రెండేళ్ల పాటు అద్దెలు తీసుకున్న వారి నుంచి అడ్వాన్స్‌గా తీసుకున్న మొత్తానికి సరి పోగా.. ఆ తర్వాత నుంచి వచ్చిన కిరాయి సొమ్ములను బ్యాంకులో జమ చేసి, పాఠశాల మౌలిక వసతులకు, అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ఏడాదికి రూ.లక్ష వరకు అద్దె ఆదాయం వస్తోంది.

కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు..

2005లో పాఠశాలలో ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తమ కమిటీ ఆధ్వర్యంలో హెచ్‌ఎం విజయ ద్వారా చర్యలు తీసుకున్నారు. ఆతర్వాత తలా కొంత సేకరించి మొత్తం రూ.5లక్షలు పోగుచేసి పాఠశాలకు వరండా నిర్మించారు. కంప్యూటర్ సీపీయూ, మానిటర్లు అందజేశారు. ఏటా జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇస్తున్నారు. రూ.20 వేల విలువైన నోట్ బుక్స్ అందించారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు రూ.5వేలు, పాఠశాలకు మైక్ సెట్, డెస్కులు, బెంచీలు అందించారు. వంట గది, తాగునీటి పైప్‌లైన్ నిర్మించారు. మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు.

కమిటీతో కార్యరూపం..

చేయూత అపూర్వం

కమిటీ గౌరవ సలహాదారుడైన నాటి ఎమ్మెల్యే సమక్షంలో 2005లో పూర్వ విద్యార్థుల కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా జొన్నల రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా వై.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా ఖాజా మోయినుద్దీన్, సంయుక్త కార్యదర్శిగా జి.వెంకటయ్య, కోశాధికారిగా నాగబండి వెంకట్రాంనర్సయ్య, కన్వీనర్‌గా హెచ్‌ఎం కె.విజయ, సభ్యులుగా గుర్రం యాదగిరి, కె.శ్రీనివాస్, గట్టు రాజయ్య, మంగు జయప్రకాష్, పార్థీ కమల్ ఎన్నికయ్యారు. అలాగే పూర్వ విద్యార్థులైన ఎన్ఆర్ఐ తోట రవీందర్ రూ.50వేలు, ఎన్ఆర్ఐ కుందురు శ్రీనివాసరెడ్డి రూ.20వేలు, చింతకుంట్ల శైలేందర్ రెడ్డి, గట్టు రమేశ్ రూ.20 వేలు, కొంతం శ్రీను రూ.20 వేలు, ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య రూ.10 వేలు, గోలి వాసుదేవరావు, మంగు జీవన్, చిలువేరు లక్ష్మణ్, సదానందం, ఎం.భీష్మాచారి రూ.10వేలు ఇలా ఇంకా ఎంతో మంది విద్యార్థులు తమ వంతు విరాళాలు అందించారు.


పూర్వ విద్యార్థులు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్



టెన్త్ మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందిస్తున్న కమిటీ నాయకులు

పాఠశాల అభివృద్ధి కృషి

- రాజేశ్వర్‌రావు, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు



గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు బాగా చదువుకోవాలన్నదే మా లక్ష్యం. అందుకే మా వంతు బాధ్యతగా మేం చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. విద్య, చదువులో ప్రతిభ చూపే విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. మున్ముందు కూడా మా పూర్వవిద్యార్థుల కమిటీ ద్వారా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూనే ఉంటాం.

కమిటీ కృషి ఆదర్శనీయం

- కె. రమేశ్, జీహెచ్‌ఎం, శివునిపల్లి హైస్కూల్



పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు పూర్వవిద్యార్థులు చేస్తున్న కృషి ఆదర్శనీయం. ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే తీర్చడానికి ముందుంటున్నారు. పేద విద్యార్థులకు, క్రీడాకారులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. పదవ తరగతి ఫలితాల్లో మెరిట్ సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేలా బహుమతులు అందిస్తున్నారు.

పదేళ్ల కష్టం పది నిమిషాల్లో కరిగిపోయింది. పారిస్ ఒలింపిక్స్‌లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగి పతకానికి అడుగు దూరంలో నిష్క్రమించింది. ఓటమి నుంచి నేర్చుకున్న గుణపాఠంతో మరో ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు నడుం బిగించింది. పరాజయానికి సాకులు వెతుక్కోకుండా కొత్త చరిత్రను రాసే క్రమంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించేందుకు సన్నద్ధమవుతోంది. ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వరల్డ్ బాక్సింగ్ చాంపియన్ **నిఖత్ జరీన్** పారిస్ ఒలింపిక్స్ విశేషాలతో పాటు తన భవిష్యత్ ప్రణాళికల గురించి 'నవ్య'తో పంచుకుంది.

నాకు తెలిసింది నలుగురికీ పంచుతా..



"ఓటమి నుంచి పుట్టే బాధ, కసి తప్పకుండా ఏదొక రోజు విజయానికి దగ్గర చేస్తాయి. మూడు నెలల విరామం తర్వాత తిరిగి ప్రాక్టీసు ప్రారంభించా. పారిస్ ఒలింపిక్స్‌లో ఎదురైన ఓటమితో పదేళ్ల శ్రమ, కష్టం, కాలం, చేసిన త్యాగాలన్నీ ఒక్క క్షణంలో చేతుల్లో నుంచి జారిపోయినట్టు అనిపించింది. టోక్యో ఒలింపిక్స్ బెర్త్ అందినట్టే అంది చేజారిన తర్వాత పారిస్ ఒలింపిక్స్‌పై గంపెడు ఆశలు పెట్టుకున్నా. అందుకు తగ్గట్టే సాధన చేశా. కానీ కొన్ని ప్రతికూల పరిస్థితులు పతకానికి దూరం చేశాయి. ఏదేమైనా 2028 ఒలింపిక్స్‌లోనైనా దేశానికి బాక్సింగ్‌లో పతకం అందించేందుకు మరో నాలుగేళ్లు శ్రమిస్తా.



క్రీడలను కెరీర్‌గా ఎంచుకోండి..

ఒకప్పుడు క్రీడలంటే అత్యధిక శాతం మంది కేవలం కాలక్షేపంగా చూసేవారు. ఆడపిల్లలు ఆడతామంటే 'మగరాయుడిలా నిక్కర్లు వేసుకొని గ్రౌండ్లో ఉరుకులు-పరుగులు పెడతావా?' లాంటి మాటలతో క్రీడలకు దూరం చేసేవారు. ఈ రకమైన దృక్పథం ఉన్న తల్లిదండ్రులు తమ ఆలోచనా ధోరణి మార్చుకోవాలి. మగ, ఆడ అనే తేడా లేకుండా క్రీడలను కెరీర్‌గా ఎంచుకునేందుకు పిల్లలను ప్రోత్సహించాలి. నేను బాక్సర్‌గా 12 ఏళ్ల పాటు పడిన కష్టానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలో నాకు డీఎస్పీ ఉద్యోగమిచ్చింది. వరల్డ్ బాక్సింగ్ చాంపియన్ అయ్యా. కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించా. క్రీడల ద్వారా కూడా ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చు అనే దానికి నేనే ఒక ప్రత్యక్ష ఉదాహరణ.

బాడీ షేమింగ్ పట్టించుకోవద్దు...

నేను బాక్సింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుంటానని ఇంట్లో చెప్పినప్పుడు మా అమ్మ చాలా వారించింది. నీ ముఖానికి దెబ్బలు తగిలితే నిన్ను ఎవరు పెళ్లి చేసుకుంటారని బాధపడింది. నువ్వు చేసే వ్యాయామాలకు నీ శరీర ఆకృతి మగవారిలా మారిపోతుందేమోనని ఆందోళన చెందింది. అవన్నీ అపోహలేనని నేను ఆమెతో చెప్పా. వారివారి శరీర నిర్మాణం, కండరాలు, హార్మోన్లు బట్టే శరీర ఆకృతిలో మార్పులు వస్తాయి తప్ప మరొకటి కాదు. నేను బాక్సింగ్‌లో రాణిస్తూ ఒక్కో మెట్టు ఎక్కేకొద్దీ ఆమె ఆలోచనా సరళి మారిపోయింది. ఇప్పుడామె నాకు పెద్ద మద్దతుదారు. సోషల్ మీడియాలో నటీమణులు సమంత, రష్మిక మందాన లాంటి వారిని ఉద్దేశించి బాడీ షేమింగ్ చేస్తూ పలువురు నెటిజన్లు పెట్టే కామెంట్లు చూసి నాకు ఒళ్లు మండుతుంది. జీవితంలో ఏమీ సాధించలేని, చేతకాని వారు, పనీపాట లేనివారే అలాంటి చెత్త వ్యాఖ్యలు చేస్తూ కాలం వెళ్లదీస్తుంటారు. అలాంటి దిక్కుమాలిన వారి మాటలను అసలు పట్టించుకోవద్దు. లక్ష్యాలను చేరుకోవాలంటే పట్టుదలతో కష్టపడి పని చేయడం ఒక్కటే మార్గం.

కచ్చితంగా అలవర్చుకోవాలి...

క్రీడలు, చదువు, ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. విద్య, వ్యాపార, ఉద్యోగాల ద్వారా కొంత మేర ఆర్థిక స్వావలంబన, స్వేచ్ఛ సాధించారు. అయితే, రెండు అంశాల్లో మాత్రం అలక్ష్యం వహిస్తున్నారు. ఒకటి ఫిట్‌నెస్‌ను పట్టించుకోకపోవడం, రెండోది ఏదైనా ఆపద ఎదురైతే తమను తాము రక్షించుకునే విషయంలో ఇప్పటికీ వేరేవారిపై ఆధారపడడం. అలా కాకుండా రోజూ ఉదయం కొద్దిసేపు వ్యాయామం చేయడం అలవర్చుకోవాలి. దీంతో పాటు కరాటే, తైక్వాండో వంటి ఏదైనా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే విపత్కర పరిస్థితుల్లో పోరాడడానికి, ఆత్మరక్షణకు ఉపకరిస్తాయి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వారికి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించేందుకు ముందుకు రావాలి. మరో ముఖ్యమైన విషయమేంటంటే స్వేచ్ఛ అవసరమే కానీ కొన్ని విషయాల్లో జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. కొత్త ప్రదేశాలకు వెళ్తున్నప్పుడు, స్నేహితులతో పార్టీలకు వెళ్లేప్పుడు ఇంట్లో ఎవరికైనా సమాచారం ఇచ్చి వెళ్తే ఊహించని ఇబ్బందులు ఎదురైనప్పుడు వారు వెంటనే స్పందించి, సహాయం చేయడానికి వీలుంటుంది.

2028 ఒలింపిక్స్ కోసం మార్పులు...

వచ్చే ఒలింపిక్స్‌లో 54 కిలోల వెయిట్ కేటగిరీలో పోటీ పడాలని నిర్ణయించుకున్నా. ఇది కొంచెం కష్టమైనా అందుకు తగ్గట్టు ఇప్పటి నుంచి నా శరీరాన్ని సిద్ధం చేసుకోవాల్సి ఉంది. పారిస్ ఒలింపిక్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో ఎదురైన ఓటమికి సాకులు చెప్పదలచుకోలేదు. సీడింగ్‌లో వ్యత్యాసాలతో పాటు వెంటవెంటనే బౌట్లు రావడంతో కావాల్సినంత విశ్రాంతి దొరకలేదు. శక్తి కోసం నిర్దిష్ట డైట్ తీసుకోవాలి. పోటీకి ముందు బరువు పెరగకుండా జాగ్రత్తగా ఉండాలి. వీటన్నింటితో పాటు క్వార్టర్స్, ప్రీక్వార్టర్స్ బౌట్‌కు నడుమ 12 గంటలే వ్యవధి ఉండడంతో సరిగ్గా సన్నద్ధం కాలేకపోయా. దాంతో గతంలో నేను ఓడించిన బాక్సర్లు సెమీస్, ఫైనల్‌కు వెళ్లారు. ఒలింపిక్స్‌లో నేను పతకం సాధించలేకపోవడానికి ఈ రెండే కారణాలు.

అకాడమీ పెట్టే ఆలోచన ఉంది...

పటియాలా, బళ్లారి మినహా దేశంలో మరెక్కడా బాక్సింగ్‌లో హైలెవల్ శిక్షణ తీసుకునే ఆస్కారం లేకపోవడంతో నేను కూడా తరచూ అక్కడకు వెళ్లాల్సి వస్తోంది. సామాన్య, వర్ధమాన బాక్సర్లకైతే ఇక్కడ శిక్షణ తీసుకోవడం ఆర్థికంగా చాలా భారంతో కూడిన విషయం. ఈ విషయంలో కెరీర్ ప్రారంభంలో నేను అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నా. ప్రభుత్వం ముందుకొచ్చి చేయూతనిస్తే అకాడమీ నెలకొల్పుతా. వచ్చే ఒలింపిక్స్‌కు నేను ఇక్కడ నుంచే సాధన చేస్తూ నాతో పాటు మరికొందరు తెలంగాణ బాక్సర్లకు అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేయడానికి అవకాశముంటుంది. ఉత్తరాదిలో వెటరన్ బాక్సర్లు మేరీకోమ్, విజేందర్‌సింగ్ అకాడమీలు నెలకొల్పడానికి స్థానిక ప్రభుత్వాలు సాయం చేశాయి. తెలంగాణ ప్రభుత్వం ముందుకొస్తే హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో అకాడమీ ఏర్పాటు చేసి, నేను నేర్చుకుంది.. నాకు తెలిసింది నలుగురికీ పంచుతా. ప్రతిభావంతులైన పేదపిల్లలకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు నా వంతు కృషి చేస్తా.

• సంజయ్ ఎస్ఎస్‌బి

> సోషల్ మీడియాలో నటీమణులు సమంత, రష్మిక మంధాన వంటి వారిని ఉద్దేశించి బాడీ షేమింగ్ చేస్తూ పలువురు నెటిజన్లు పెట్టే కామెంట్లు చూసి నాకు ఒక్కోసారి ఒళ్లు మండుతుంది. జీవితంలో ఏమీ సాధించలేని చేతకాని వారు, పనీ పాట లేని వారే అలాంటి చెత్త వ్యాఖ్యలు చేస్తూ కాలం వెళ్లదీస్తుంటారు.

పటియాలా వెళ్లాల్సిందే... బాక్సింగ్‌లో ప్రాథమిక శిక్షణ ముగిశాక ప్రావీణ్యం సాధించాలంటే పటియాలలోని 'సాయ్' కేంద్రం లేదంటే బళ్లారిలోని జేఎస్‌డబ్ల్యూ అకాడమీలకు వెళ్లాల్సిందే. సాయ్ సెంటర్‌లో ఎక్కువ మందికి శిక్షణ ఇవ్వడానికి అవకాశం లేదు. అక్కడ ఒక్కొక్కరిపై వ్యక్తిగతంగా దృష్టి కేంద్రీకరించి చెప్పేంత సిబ్బంది లేరు. బళ్లారిలోని జేఎస్‌డబ్ల్యూ శిక్షణ కేంద్రం విషయానికొస్తే నెలకు లక్షన్నర ఖర్చు పెట్టి శిక్షణ తీసుకోవాలి. డైట్, ఇతరత్రా ఖర్చులు అదనం. నాలాంటి అంతర్జాతీయ బాక్సర్లకు సైతం దేశంలో శిక్షణ తీసుకోవాలంటే ఈ రెండే ఆప్షన్స్.

బాధ్యతను పెంచింది

నాకు ఐఏఎస్ స్థాయి ఉద్యోగమిస్తానన్నా పోలీసు డిపార్టుమెంటు అంటే ఉన్న ఇష్టంతో స్వీకరించలేదు. పోలీసు ఉద్యోగం అంటే బాల్యం నుంచి ఇష్టం. ఆపదలో ఉన్నవారికి సహాయం చేసే గొప్ప వృత్తిగా దానిపై నాకు గౌరవం. ఇటీవలే డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించా. ఇది నాపై మరింత బాధ్యతను పెంచింది. ప్రస్తుతానికి పోస్టింగ్ ఇంకా ఇవ్వలేదు. ఆ ప్రాసెస్ నడుస్తోంది. పూర్తి స్థాయిలో బాధ్యతలు తీసుకున్నాక నా పరిధిలోకి వచ్చే సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తా.

మూసీ ప్రక్షాళన కోసం మహోద్యమం

» పార్టీలన్నీ కలిసి రావాలి: ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మూసీ నది ప్రక్షాళన కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మహోద్యమం చేపట్టనున్నట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా భువనగిరి నియోజకవర్గం పిలాయపల్లిలో మూసీ నది ఒడ్డున ఈ నెల 26న భారీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమంలో అన్ని పార్టీలూ కలిసి రావాలంటూ విజ్ఞప్తి చేశారు. మరో ఎమ్మెల్యే వేముల వేరేశంతో కలిసి ఆయన మాట్లాడారు. మూసీ ప్రక్షాళనపై కేటీఆర్ అపోహలు సృష్టిస్తున్నారని, వాస్తవానికి మూసీ ప్రక్షాళన కోసం గతంలో అన్ని పార్టీల నేతలూ దీక్షలు, పాదయాత్రలు చేశారన్నారు. వేముల వీరేశం మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ అడ్డుకుంటే హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల వ్యతిరేక పార్టీగా మిగిలిపోతుందన్నారు.

జీవో 29 ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నష్టం

» ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 29 ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నష్టం జరుగుతుందని ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అభిప్రాయపడ్డారు. ఈమేరకు ఆ జీవోపై ఆయన అభిప్రాయాన్ని బుధవారం సోషల్ మీడియా వేదికలపై పంచుకున్నారు. ఈ జీవోను అనుసరించి మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థి సాధించిన మెరిట్‌తో ప్రమేయం లేకుండా కేవలం కులం, జెండర్ ఇతర అంశాల ప్రాతిపదికన ఎంపిక చేశారని గుర్తుచేశారు. దీని వల్ల రిజర్వేషన్ ద్వారా లబ్ధి పొందే వారికి నష్టం జరిగిందని, పోటీకి ఎంపిక కావాల్సిన నిష్పత్తిని విస్మరించి అగ్రకులాల వారికి లబ్ధి జరిగిందని వస్తున్న విమర్శల్లో హేతుబద్ధత ఉందని పేర్కొన్నారు. ఎప్పుడైనా ఎంపిక రెండు దశల్లో ఉంటుందని, అందులో ఒకటి మెరిట్ అంటే.. రెండోది రిజర్వేషన్ కేటగిరీదని తెలిపారు. పాత పద్ధతిలో అయితే... మెరిట్, రిజర్వేషన్ రెండింటిలో వెనుకబడినవర్గాల వారికి న్యాయబద్ధమైన వాటా దక్కేదని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు తెచ్చిన కొత్త జీవో 29 మూలంగా మెరిట్ పరిగణనలోకి రాక రిజర్వేషన్‌లో రావాల్సిన వారికి అవకాశం లేకుండాపోయిందని పేర్కొన్నారు. అలాగే... ప్రతిభావంతులైన వారిని కూడా కులం కోటాలో లెక్కించడం వల్ల వారి స్థానంలో అగ్రకులాలకు అయాచిత అవకాశం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రిజర్వేషన్ల స్ఫూర్తికి, రాజ్యాంగ లక్ష్యానికి విరుద్ధమని అభ్యర్థులు అంటున్నట్టు చెప్పారు. ఇందులో వాస్తవం ఉందన్నారు.

గ్రూపు-1 పరీక్షకు మూడో రోజు 68 శాతం హాజరు

గ్రూపు-1 మెయిన్స్ పరీక్షకు మూడో రోజు 68.2 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మూడో రోజు బుధవారం పేపర్-2లో భాగంగా హిస్టరీ, కల్చర్, జాగ్రఫీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్ష 31,403 మంది అభ్యర్థులు రాయాల్సి ఉండగా 21,429 మంది(68.2 శాతం) హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈ నెల 27వ తేదీ వరకు జరుగనున్నాయి.

ఇది డ్రోన్ యుగం!

డ్రోన్ సమ్మిట్లో బహుముఖ ప్రయోజక విహంగాలు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. డ్రోన్ టెక్నాలజీ రయ్‌మంటూ దూసుకుపోతోంది. రాబోయే రోజుల్లో ప్రతి రంగాన్నీ డ్రోన్ ప్రభావితం చేయనుంది. చేరుకోలేని దూరాల్ని, అందుకోలేని ఎత్తుల్ని సులువగా చేరుకోవడమే కాకుండా.. పనులన్నీ సులభతరం చేయడంలో డ్రోన్ టెక్నాలజీ కీలకపాత్ర పోషించనుంది. ఇటీవల వరదల సమయంలో విజయవాడ వరద బాధితులకు విశేష సేవలందించిన డ్రోన్ టెక్నాలజీ సాధారణ ప్రజా జీవితంలో అంతకుమించిన సేవలు అందిస్తోంది. కానీ ఆ వాస్తవం ప్రజలకు చేరడంలోనే సమస్య ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గుంటూరు జిల్లా మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో చేపట్టిన అమరావతి డ్రోన్ సమ్మిట్ ఆ సమస్యలను పరిష్కరించింది. ఇప్పటికే విస్తరించిన డ్రోన్ టెక్నాలజీ అందిస్తున్న సేవల గురించి, భవిష్యత్ డ్రోన్‌లదే అనే అంశాన్ని ప్రజలకు తెలిసేందుకు అవకాశం లభించింది. ఈ డ్రోన్ సమ్మిట్‌లో అనేక మంది యువ ఇంజనీర్లు అనేక రకాల డ్రోన్లను ప్రదర్శించారు. రైతులకు, వ్యాపారులకు, వైద్య సేవలకు అవి ఎలా ఉపయోగపడతాయో వివరించారు.



ఇండస్ట్రియల్ ఇన్‌స్పెక్షన్ డ్రోన్లు..

పరిశ్రమల్లో వినియోగించేందుకు ప్రత్యేకంగా ఈ డ్రోన్ల రూపకల్పన చేశారు విశాఖకు చెందిన ప్రవీణ్ అనే యువ ఇంజనీర్. ఇవి మూడు రకాలు. యంత్రాల బయటి భాగాల్లో సమస్యలు గుర్తించడానికి ఎక్స్‌టర్నల్ డ్రోన్స్‌ను వినియోగిస్తారు. ఇవి ప్రమాదకర వాయువుల లీకేజీని గుర్తిస్తాయి. ఇన్‌సైడ్ డ్రోన్లు యంత్రాల లోపలి భాగాల్లోని సమస్యలను గుర్తిసాయి. ఇక పైపుల్లో ఉండే సమస్యలను కూడా గుర్తించేందుకు సూక్ష్మ డ్రోన్లను రూపొందించారు.

ఆంధ్రులు స్థాపించిన స్టార్టప్.. వ్యోమిక్..

గోదావరి జిల్లాకు చెదిన ముగ్గురు యువ ఇంజనీర్లు హేమంత్, సాయిచరణ్, హనుమ కలిసి హైదరాబాద్ కేంద్రంగా స్టార్టప్ కంపెనీ వ్యోమిక్‌ను ఏర్పాటు చేసి రైతుల కోసం డ్రోన్లు సప్లై చేస్తున్నారు. ఇవి పూర్తిగా బ్యాటరీతో నడిచే డ్రోన్లు. ఒకసారి చార్జింగ్‌కు 15 నిమిషాల సమయం పడుతుంది. ఎకరం పొలంలో స్ప్రే చేయడానికి 6, 7 నిమిషాలు సమయం సరిపోతుంది. ఇక్కడ ప్రభుత్వ ప్రోత్సాహాలు చూశాక తిరిగి ఏపీకి రావాలని నిర్ణయించుకున్నామని వ్యోమిక్ వ్యవస్థాపకులు చెప్పారు. ప్రస్తుతం 80 డ్రోన్లు ఆపరేట్ చేస్తున్నామని, 2025 నాటికి ఒక్క ఏపీలోనే 2000 డ్రోన్లు ఆపరేట్ చేస్తామని చెప్పారు.

లాజిస్టిక్ డ్రోన్.. వరదల్లో సాయం

ఈ డ్రోన్‌ను కూడా గోపీనే రూపొందించారు. దీని ద్వారా సరుకులు రవాణా చేయవచ్చు. పది కిలోమీటర్ల పరిధిలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ డెలవరీలను కూడా ఇవ్వవచ్చు. వరదల సమయంలో విజయవాడలో బాధితులకు ఈ డ్రోన్ల ద్వారా ఆహారాలు, మందులు అందజేశామని గోపి చెప్పారు.

125 కి.మీ వేగం.. 150 కి.మీ. దూరం!

తంజావూరుకు చెందిన ఏకాంత్ వైద్య సేవల కోసం ఒక డ్రోన్‌ను సిద్ధం చేశారు. 7 కిలోల బరువు మోయగల ఈ డ్రోన్ 125 కి.మీ వేగంతో 150 కిలోమీటర్ల వరకూ వెళ్లగలదు. మైనస్ 1 నుంచి మైనస్ 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వుండే లగేజ్ బాక్సులో మందులు, మానవ అవయవాలు కూడా భద్రం చేసుకునే వీలుంది. అత్యవసరంగా సరఫరా చేయాల్సిన మందులు, అవయవాలను ఈ డ్రోన్ ద్వారా త్వరితగతిన గమ్యస్థానాలకు చేర్చవచ్చు.

రెవెన్యూ సేవలకు.. ఫ్లై హెప్టర్ వీటీవోఎల్

వర్టికల్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్ (వీటీవోఎల్) అంటే డ్రోన్‌లాగా నిట్టనిలువుగా టేక్ ఆఫ్ అవుతుంది. ఆ తరువాత నాలుగు వైపులా ఫ్యాను మోటార్లు ఆగిపోయి విమానంలా ముందుకు వెళుతుంది. ఇది రెవెన్యూ శాఖ మ్యాపింగ్‌కు ఉపయోగపడుతుంది. ఈ సంస్థ తమిళనాడు ప్రభుత్వంతో అనుబంధ సేవలందిస్తోంది. ఇందులో కెమెరాలు వేగంగా ఫొటోలు తీసి భూముల సర్వేను సులభతరం చేస్తాయి.

డ్రోన్ బాల్‌తో సేఫ్టీ

చిన్న పిల్లలు, శిక్షణ లేకుండా డ్రోన్లు నడిపే వారు వాటిని ఢీకొట్టించే ప్రమాదం వుంది. దీంతో లక్షల రూపాలయల విలువ చేసే డ్రోన్లు దెబ్బతినే ప్రమాదం వుంది. ఈ ప్రమాదాల నుంచి డ్రోన్లను రక్షించేందుకు వీలుగా శిక్షక డ్రోన్లను రూపొందించారు. డ్రోన్ చుట్టూ తేలికపాటి ప్లాస్టిక్, రబ్బర్ రక్షక వలయం వుంటుంది. దీంతో డ్రోన్ దేనికైనా గుద్దుకున్నా అది దెబ్బతినకుండా ఉంటుంది.



విజ్ఞాన్ విద్యార్థుల.. ఐదు డ్రోన్లు

విజ్ఞాన్ యూనివర్శిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు ఐదు రకాల డ్రోన్లు తయారు చేశారు. కోయాగ్జిల్ డ్రోన్‌తో తక్కువ ఏరియాలో ఎక్కువ భారాన్ని (పే లోడ్..) తీసుకువెళ్లేలా రూపొందించిన ఈ డ్రోన్‌తో బహుముఖ ప్రయోజనాలు వుంటాయని విద్యార్థులు చెబుతున్నారు. స్వామ్ టెక్నాలజీ డ్రోన్లు.. ఒకే డ్రోన్ ద్వారా ఒకేసారి అనేక డ్రోన్లను ఒక్కరే ఆపరేట్ చేసేలా రూపొందించడమే ఈ డ్రోన్ ప్రత్యేకత. వీటిలో మాస్టర్ డ్రోన్, స్లేవ్ డ్రోన్లు వుంటాయి. ఒకవేళ మాస్టర్ డ్రోన్ పాడైతే.. ఆ స్థానాన్ని వెంటనే మరో స్లేవ్ డ్రోన్ తీసుకుంటుంది. వీటితో పాటు రెస్క్యూ ఆపరేషన్ సమయంలో విపత్తుల్లో ఉపయోగపడే ఫస్ట్ పర్సన్ వ్యూ, అగ్రికల్చర్ డ్రోన్, 3డీ ప్రింటింగ్ డ్రోన్లను వీరు రూపొందించారు.

వ్యవసాయం కోసం హైబ్రిడ్ ఇంజన్ డ్రోన్

రైతులకు సేవలందించే లక్ష్యంతో ఎన్టీఆర్ జిల్లా నెప్పల్లెకు చెందిన యువ ఇంజనీర్ గోపి వెంకట కృష్ణ ఒక డ్రోన్ తయారు చేశారు. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదివిన ఆయన ఎరువులు, పురుగు మందులు చల్లడానికి, విత్తనాలు వెదజల్లడానికి వీలుగా ఈ డ్రోన్‌ను రూపొందించారు. ఇది పెట్రోల్, బ్యాటరీతో నడుస్తుంది. ఆరు లీటర్ల పెట్రోలుతో 16 లీటర్ల పురుగుమందులను పిచికారీ చేయగలదు. ఆయిల్ అయిపోతే వెంటనే ల్యాండ్ అవడానికి వీలుగా బ్యాకప్ బ్యాటరీ ఉంటుంది. కాబట్టి బ్యటరీకి ఎలాంటి సమస్యా రాదని చెబుతున్నాడు ఆ యువ ఇంజనీర్. ఇప్పటికి 25వేల ఎకరాల్లో ఈ డ్రోన్లతో రైతులకు సేవలు అందిస్తున్నామని చెబుతున్నారు. కొనుక్కోలేని వారికి రోజువారీ లెక్కన సేవలు అందిస్తున్నామని వివరించారు.





ఎస్ఆర్ఎం విద్యార్థుల స్పెషల్ డ్రోన్లు

రాజధాని అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో రెండో ఏడాది బీటెక్ ఈసీఈ చదువుతున్న మణికంఠ, పుష్పక్, అజిత్.. మెడిసిన్ డ్రోన్లు రూపొందించారు. ఒక వెబ్ ఇంటర్‌ఫేజ్ ఏర్పాటు చేసుకుని దాని ద్వారా 10 కి.మీ. పరిధిలో మందులు అందజేసేలా ఆ డ్రోన్లను రూపొందించారు. వెబ్ ఇంటర్‌ఫేజ్‌లో వినియోగదారుడు మందులు ఆర్డర్ చేస్తే వారు ఇచ్చిన అడ్రెస్‌ను డ్రోన్‌కు మ్యాపింగ్ చేసి ఆటో పైలెట్ మోడ్‌లో ఆపరేట్ చేస్తారు. ఇది 2 కిలోల బరువున్న సరుకులను అందించగలదు.



గవర్నర్‌తో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

గవర్నర్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):నీటిపారుదలశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మతో బుధవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఆయనతో పాటు కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కూడా ఉన్నారు. ఈ భేటీలో పలు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఇటీవల పలు యూనివర్సిటీలకు కొత్తగా నియమితులైన వైస్ చాన్సలర్లు(వీసీ) సైతం గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన వారికి గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఢిల్లీకి డబ్బు పంపేందుకే మూసీ ప్రక్షాళన: ఈటల

దిల్‌సుఖ్‌నగర్/చాదర్‌ఘాట్, రామంతాపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఢిల్లీకి డబ్బు సంచులు మోసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన పేరుతో నాటకాలు ఆడుతున్నారని బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. మంత్రులను సియోల్, న్యూయార్క్ నగరాలకు పంపడం కాదని మూసీ పరీవాహక ప్రాంతాల్లోని కాలనీలకి పంపి ప్రజల కష్టాలు తెలుసుకోవాలంటూ ముఖ్యమంత్రిపై ధ్వజమెత్తారు. ఈ మేరకు రామాంతపూర్, చైతన్యపురి ప్రాంతాల్లో మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న కాలనీల్లో బుధవారం ఆయన పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ మూసీ పునరుజ్జీవం పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న పనుల వల్ల ప్రజలకు కంటి మీద కునుకు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంవి అనాలోచిత నిర్ణయాలు, అహంకారపు మాటలని మండిపడ్డారు. అసలు మూసీ నదిలో ఏం చేయదలచుకున్నారో ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన అంశంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద శుక్రవారం జరిగే ధర్నాకు బాధితులు తరలిరావాలని ఈటల పిలుపునిచ్చారు.

బీసీ కమిషన్ విచారణకు.. హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ డెస్క్‌లు ఏర్పాటు చేయండి

జిల్లాల కలెక్టర్లకు సూచించిన చైర్మన్ జి.నిరంజన్

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ణయానికి సంబంధించిన అభ్యర్థనలు, సూచనలతో పాటు అభ్యంతరాలను వినేందుకు బీసీ కమిషన్ చేపట్టిన బహిరంగ విచారణలకు విస్తృత ప్రచారం కల్పించాలని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో కమిషన్ వర్చువల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. బహిరంగ విచారణ కోసం అక్టోబరు 17న కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయగా, 28వ తేదీ నుంచి నవంబరు 13 వరకు ఉమ్మడి జిల్లాల వారీగా వేర్వేరు తేదీల్లో విచారణ నిర్వహించనుంది. బహిరంగ విచారణకు వేదికల లభ్యత, అనుకూలతలపైనా కమిషన్ ఆరా తీసింది. విచారణలను వ్యవస్థీకృత పద్ధతిలో నిర్వహించడానికి హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ డెస్క్, సెక్రటేరియట్ డెస్క్ సహా వివిధ బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించింది.







ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 24 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com

వరదరాజన్ జీవిత నేపథ్యం




రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో శివకార్తియేన్, సాయి పల్లవి నటించిన మూవీ 'అమరన్'. కమల్ హాసన్, మహేంద్రన్ నిర్మిస్తున్నారు. ఈనెల 31న చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో సినీ నటుడు నాని థియేట్రికల్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఇండియన్ ఆర్మీ ఆఫీసర్ మేజర్ ముకుంద్ వరదరాజన్ స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని ట్రైలర్ పరిచయం చేస్తుంది. వరదరాజన్ పాత్రలో శివ కార్తికేయన్, అతని భార్యగా సాయి పల్లవి నటించారు. సినీ నటుడు నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి, సోదరి నిఖితా రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్‌పై విడుదల చేయనున్నారు.

ఆ కామెంట్స్ నన్నెంతో బాధించాయి

ఇటీవలే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సాయిపల్లవి మీడియాకు ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. గ్లామరస్ పాత్రలు చేయకపోవడంపై అడిగిన ప్రశ్నకు 'తాను కావాలనే ఆ నిర్ణయం తీసుకున్నట్లు' చెప్పారు. 'సినిమాల్లోకి రాకముందు వైద్య విద్య కోసం జార్జియా వెళ్లా. అక్కడ టాంగో డ్యాన్స్ నేర్చుకున్నా. డ్యాన్స్ కోసం ప్రత్యేకంగా ఒక కాస్ట్యూమ్ ఉంటుంది. సౌకర్యంగా ఫీలయ్యాకే ఆ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నా. కొంతకాలానికి 'ప్రేమమ్'లో అవకాశం వచ్చింది. ఆ సినిమా విడుదలయ్యాక.. టాంగో డ్యాన్స్ వీడియోను పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. నెగటివ్ కామెంట్స్ చేశారు. అవి నన్నెంతో బాధించాయి. సినిమాల్లో శరీరం కనిపించే దుస్తులు వేసుకోకూడదని నియమంగా పెట్టుకున్నా' అని సాయి పల్లవి తెలిపారు.

తమిళ.. హిందీ భాషల్లో ఒకేసారి





డైరెక్టర్ మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గజనీ' చిత్రం అప్పట్లో ఎంత సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ సినిమాను మొదట తమిళ్‌లో సూర్యతో తెరకెక్కించి.. ఆ తర్వాత తెలుగులోనూ డబ్ చేశారు. రెండు భాషల్లోనూ సూపర్ హిట్‌గా నిలిచిందీ చిత్రం. ఇదే చిత్రాన్ని.. నిర్మాతలు అల్లు అరవింద్, మధు మంతెన మాతృక దర్శకుడు మురుగదాస్‌తో.. హిందీలో ఆమీర్‌ఖాన్ హీరోగా ఒరిజినల్ టైటిల్‌తోనే రీమేక్ చేశారు. ఈ సినిమా అక్కడా బ్లాక్‌బస్టర్ హిట్ సాధించింది. తాజాగా, ఈ సినిమా సీక్వెల్ పనులు మొదలయ్యాయి. నిర్మాతలు అల్లు అరవింద్, మధుమంతెన రెండో భాగానికి అవకాశం ఉందని సూర్యకు.. ఆమిర్‌ఖాన్‌కు చెప్పడంతో ఇద్దరూ ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం. వచ్చే ఏడాదిలో స్క్రిప్టు పూర్తయ్యే అవకాశం ఉంది. స్క్రిప్టు పనులు పూర్తయ్యాక.. తమిళంలో సూర్యతో.. హిందీలో ఆమిర్‌ఖాన్‌తో ఒకేసారి షూటింగ్‌ను ప్రారంభిస్తారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఈ సినిమాను రెండు భాషల్లో ఒకేరోజు రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు 'దృశ్యం' ఫ్రాంచైజీని కూడా ఇదే విధంగా మలయాళంలో.. హిందీలోనూ ఒకేసారి తెరకెక్కించాలని మేకర్స్ అనుకుంటున్నారు.

రూ. రెండు వేల కోట్లు వస్తే..
మాకు కోటే ఇచ్చారు





రెజ్లర్ బబితా పోగాట్ జీవిత కథ ఆధారంగా ఆమిర్‌ఖాన్ నటించిన 'దంగల్' చిత్రం 2016 డిసెంబర్ 23న విడుదలై వసూళ్ల పరంగా దుమ్ము రేపింది. ఆ సినిమా రూ.రెండు వేల కోట్లు కలెక్ట్ చేస్తే తమ కుటుంబానికి కోటి రూపాయలు మాత్రమే ఇచ్చారని బబిత ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. 'దంగల్' సక్సెస్ అయిన తర్వాత ఆమీర్‌ఖాన్ టీమ్‌ని తన తండ్రి మహావీర్ సంప్రదించారనీ, తమ గ్రామంలో అకాడెమీ నిర్మించడానికి సాయం చేయమని కోరితే, పట్టించుకోలేదని బబిత ఆరోపించారు. 'దంగల్' సినిమా ఎలా పుట్టిందో ఆమె వివరిస్తూ 'చండీగఢ్‌కు చెందిన ఓ విలేకరి నాన్న గురించి, మా అక్క గీత గురించి, నా గురించి ఓ ఆర్టికల్ రాశారు. అది చదివి దర్శకుడు నితీశ్ తివారీ టీమ్ నాన్నను సంప్రదించింది. మొదట్లో మా గురించి ఓ డాక్యుమెంటరీ తీస్తానని ఆయన చెప్పారు. తర్వాత మళ్లీ ఆయనే వచ్చి డాక్యుమెంటరీ కాదు.. సినిమా తీస్తామని చెప్పారు. కథ కూడా చెప్పారు. అది విని ఎంతో ఉద్వేగానికి లోనయ్యాం. అయితే సినిమాలో మా పేర్లు ఉండవనీ, మారుస్తున్నామనీ నితీశ్ చెప్పారు. కానీ నాన్న ఒప్పుకోలేదు.. మా పేర్లు ఉండాల్సిందేనన్నారు. 'దంగల్' సినిమా రిలీజ్ అయ్యాక మా ఫ్యామిలీ అంతా కలసి చూశాం. నా చిన్ననాటి రోజులు గుర్తుకు వచ్చాయి' అని బబిత చెప్పారు.

వరుడు ఎలా ఉండాలంటే...



విక్రాంత్, చాందినీ చౌదరి నటించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో మధురశ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం చాందీనీ చౌదరి పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె ఓరుగంటి అనే పాత్రలో నటిస్తున్నారు. ఇందులో ఆమె పాత్ర.. తనకు కాబోయే వరుడు ఎలా ఉండాలో పెట్టిన షరతులు ఆసక్తికరంగా ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది ఈ చిత్రం.

వింటేజ్ లుక్‌లో రాజాసాబ్



ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం 'రాజా సాబ్' పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనరుపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటివరకూ చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ సినిమాను దర్శకుడు మారుతి రూపొందిస్తుండడంతో అందరిలోనూ ఆసక్తి ఏర్పడింది. ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ 'రాజా సాబ్ ' మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రాజా సాబ్‌గా ప్రభాస్ వింటేజ్ లుక్ అదిరిపోయింది. 'హారర్ ఈజ్ ద న్యూ హ్యూమర్' అనే కాప్షన్ మోషన్ పోస్టర్ చివరిలో వేయడం ద్వారా ఒక కొత్త ట్రెండ్ సెట్ చేసే హారర్ ప్లస్ కామెడీ చిత్రమిది మేకర్స్ తెలియజేశారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏప్రిల్ 10న 'రాజా సాబ్' విడుదల కానుంది.

ఎడ్జ్ ఆఫ్ ద సీట్ థ్రిల్లర్



అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు ఆండ్రూ బాబు. లండన్ గణేష్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మాతలు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ఎడ్జ్ ఆఫ్ ద సీట్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం లండన్‌లో జరుగుతోంది. త్వరలోనే టైటిల్‌ను విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు.

కొత్తగా..

తండ్రీ కూతుళ్ల కథ



రమేశ్ చెప్పాల దర్శకత్వంలో సాయి రోనక్, ప్రగ్యా నాగ్ర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లగ్గం'. నిర్మాత వేణుగోపాల్ రెడ్డి. నేపథ్య సంగీతం మణిశర్మ. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. నటుడు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'లగ్గం చిత్రం ఒక తండ్రీ కూతుళ్ల కథ. ఈ చిత్రంలో తెలంగాణ బిడ్డగా నటించడం నా అదృష్టం' అని అన్నారు. 'ఎంతో మంది కలిసి పనిచేస్తేనే ఒక సినిమా పూర్తవుతుంది. లగ్గం చిత్రంతో ఒక మంచి మెసేజ్‌ని అందంగా చెప్పాలని అనుకున్నాం' అని చిత్ర నిర్మాత వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 'ఈ సినిమా అరిటాకులో వడ్డించిన విందు భోజనంలా ఉంటుంది' అని దర్శకుడు రమేశ్ చెప్పాల తెలిపారు.

మనసును మెలిపెట్టేలా...



శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. రిషికేశ్వర్ యోగి దర్శకత్వంలో టి.జి.విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డాక్టర్ సింధు నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా శివకుమార్ రామచంద్రవరపు, నితిన్‌ప్రసన్న మీడియాతో ముచ్చటించారు. శివకుమార్ రామచంద్రవరపు మాట్లాడుతూ "ఈ చిత్రంలో 'సత్య' అనే పాత్రలో నటించాను. నటుడు కావాలనే కోరికతో మొదలెట్టిన నా పాత్ర ప్రయాణం ఎలాంటి ఆసక్తికర మలుపులు తిరిగిందనేది కథాంశం' అని చెప్పారు. "ఈ సినిమాలో నా పాత్రకు మంచి గుర్తింపు వస్తుందనే నమ్మకం ఉంది. దర్శకుడు రాసిన కథ, సంభాషణలు, సృష్టించిన పాత్రలు ప్రేక్షకులను మొదటి ఫ్రేమ్ నుంచి చివరి ఫ్రేమ్ వరకు కట్టిపడేసేలా ఉంటాయి" అని అన్నారు నితిన్ ప్రసన్న.

కొనసాగుతున్న బెటాలియన్ పోలీసు కుటుంబాల నిరసన

హైదరాబాద్, నల్లగొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సెలవుల విధానం మార్చాలని, పనిభారం తగ్గించాలని నల్లగొండ జిల్లా కేంద్రం శివారులోని అన్నెపర్తి 12వ బెటాలియన్ పోలీసు కుటుంబాల నిరసన మూడో రోజైన బుధవారం కూడా కొనసాగింది. అయితే, పోలీసుల కుటుంబాల ఆందోళన వెనుక ఉన్నారని భావిస్తూ హెడ్‌కానిస్టేబుళ్లు వి.రామకృష్ణ, నర్సింగ్‌నాయక్, కానిస్టేబుళ్లు ఎ.వినోద్, పి.సురేష్, నాగరాజు, ఎస్‌కే.అస్రఫ్‌అజీజ్‌ను సస్పెండ్ చేశారు. దాంతో ఈ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, సహచర కానిస్టేబుళ్ల కుటుంబాల సభ్యులు ఆందోళన చేయడానికి ప్రయత్నించగా బెటాలియన్ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దాంతో వారు బెటాలియన్ ఆవరణలోనే నిరసన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బెటాలియన్లకు చెందిన పోలీసు కుటుంబాలు ఈనెల 25న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చినట్లు సమాచారం. కాగా, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు నష్టం కలిగిస్తున్నాయని కానిస్టేబుళ్ల భార్యలు నిరసన తెలిపితే భర్తలను సస్పెండ్ చేయాలన్న చట్టం ఎక్కడా లేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. వెంటనే కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేవారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకు దిగజారి పోతున్నాయన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పేర్కొన్న ఏక్ పోలీసు నినాదం ఏమైందో చెప్పాలని ఆర్ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు.

రాజకీయ కక్షసాధింపులో భాగంగానే..

సురేఖ దిగజారుడు వ్యాఖ్యలు

పబ్లిసిటీ కోసమే అవాస్తవ ఆరోపణలు.. వ్యక్తిగతంగా నాకు, పార్టీకి తీవ్ర నష్టం

- ఆమె వ్యాఖ్యలు ఆవేదనకు గురిచేశాయి
- నాంపల్లి కోర్టులో కేటీఆర్ వాంగ్మూలం
- తదుపరి విచారణ 30వతేదీకి వాయిదా
- బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్ష సాధింపులో భాగంగా.. సమాజంలో తనకున్న పేరు ప్రతిష్ఠలను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే మంత్రి కొండా సురేఖ తన గురించి దిగజారుడు వ్యాఖ్యలు చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. పబ్లిసిటీ కోసమే ఆమె అవాస్తవ ఆరోపణలు చేశారని.. అవి వ్యక్తిగతంగా తనకు, తన పార్టీకి తీవ్ర నష్టం కలిగించాయని ఆందోళన వెలిబుచ్చారు. ఈ నెల 10వ తేదీన నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో కొండా సురేఖపై వేసిన క్రిమినల్ పరువు నష్టం దావా కేసుకు సంబంధించి.. కేటీఆర్ బుధవారం కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇచ్చారు. ఈ కేసులో సాక్షులుగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్ కూడా న్యాయస్థానానికి వచ్చారు. తొలుత కేటీఆర్ సుమారు అరగంట పాటు వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం దాసోజు స్టేట్‌మెంట్‌ను కోర్టు నమోదు చేసింది. మిగిలిన సాక్షుల వాంగ్మూలాలను 30వ తేదీన నమోదు చేస్తామని పేర్కొంటూ.. తదుపరి విచారణను అదే తేదీకి వాయిదా వేసింది. గత 18 ఏళ్లగా రాజకీయ జీవితంలో ఉన్న తనపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆవేదనకు గురి చేశాయని కేటీఆర్ కోర్టులో వాపోయారు. "ఈ కేసులో సాక్షులుగా పేర్కొన్న వారు నాకు 18 ఏళ్లగా తెలుసు. సురేఖ చేసిన వ్యాఖ్యల పట్ల వారు నాకు ఫోను చేసి బాధపడ్డారు. ఆ తర్వాత నేనే వార్తా చానళ్లలో ఆమె వ్యాఖ్యలు చూసి షాక్‌కు గురయ్యా. నేను అమెరికాలో ఆరేళ్ల పాటు ఉన్నతవిద్య అభ్యసించా. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేందుకు తిరిగి రాష్ట్రానికి వచ్చా. 2006 నుంచి 2009 మధ్య టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేశా. తెలంగాణ ఉద్యమంలో భాగంగా అనేక పోరాటాలు చేశా. 2009 నుంచి సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఐదుసార్లు భారీ మెజారిటీతో గెలిచా. 2014 నుంచి 2023 వరకూ మంత్రిగా పనిచేశా. ఐటీశాఖ మంత్రిగా రాష్ట్రానికి ఎన్నో కంపెనీలను తీసుకొచ్చా. 2018లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంగ్‌గా ఎన్నికయ్యా. బ్యాడ్మింటన్‌తో పాటు వివిధ క్రీడా సంఘాలతో కలిసి పనిచేశా. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నా. ప్రజా జీవితంలో గౌరవ మర్యాదలు కలిగి ఉన్న నాపై ఒక బాధ్యతాయుతమైన మంత్రి స్థానంలో ఉండి కొండా సురేఖ అసత్య ఆరోపణలు చేశారు. ఎలాంటి ఆధారాలూ లేకుండా ఆమె చేసిన అవాస్తవ వ్యాఖ్యలు సమాజంపై చెడు ప్రభావం చూపుతాయి. నా పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే విధంగా ఆమె చేసిన వ్యాఖ్యలు అనేక మాధ్యమాల్లో ప్రసారమయ్యాయి" అని కేటీఆర్ చెప్పారు. "నేను ఫోన్ ట్యాపింగ్ చేశానని, డ్రగ్స్ తీసుకుంటానని, ఇతరులను డ్రగ్స్ తీసుకునేలా ప్రేరేపించానని, డ్రగ్స్ అలవాటు చేశానని సురేఖ నిరాధార ఆరోపణలు చేశారు. 'ఎన్' కన్వెన్షన్ కూల్చకుండా ఉండాలంటే సమంతను నా దగ్గరు పంపించాలని నేను అడిగానని, అందువల్లే నాగచైతన్య-సమంతకు విడాకులు తీసుకున్నారని సురేఖ అసత్య వ్యాఖ్యలు చేశారు. ఆమె చేసిన మరిన్ని వ్యాఖ్యలను నా నోటితో చెప్పలేకపోతున్నా. వాటిని లిఖితపూర్వక స్టేట్‌మెంట్‌లో పొందుపర్చా" అని కేటీఆర్ వివరించారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాన్ని కేటీఆర్ కోరారు.


నాంపల్లి కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే కేటీఆర్

అయినా మారలేదు..

గతంలోనూ తనపై కొండా సురేఖ కొన్ని అసత్య వ్యాఖ్యలు చేశారని, అప్పుడు ఆమె తీరుపై ఎన్నికల సంఘం కూడా మండిపడిందని.. కోర్టు నుంచి బయటకు వచ్చిన అనంతరం కేటీఆర్ గుర్తుచేశారు. "అయినా ఆమె వ్యవహార శైలిలో మార్పు రాలేదు. వ్యక్తిత్వ హననానికి పాల్పడితే ఊరుకునేది లేదు. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని తేల్చిచెప్పారు. కాగా.. వాంగ్మూలం ఇచ్చేందుకు వచ్చిన కేటీఆర్ కోర్టు ప్రాంగణంలోని క్యాంటీన్‌కు వెళ్లి ఇరానీచాయ్, ఉస్మానియా బిస్కెట్ల రుచి చూశారు. అనంతరం నాంపల్లిలోని పలు దుకాణాలకు వెళ్లి యజమానులు, కొనుగోలుదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు కేటీఆర్‌తో సెల్ఫీలు తీసుకున్నారు.

మధ్యంతర ఉత్తర్వులు..

కొండా సురేఖపై కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల సివిల్ పరువు నష్టం దావాకు సంబంధించి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ విషయంపై ఆమె బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలూ చేయకుండా కోర్టు మధ్యంతర ఇన్‌జంక్షన్ ఆర్డర్ ఇచ్చి.. తదుపరి విచారణను 27వ తేదీకి వాయిదా వేసిందని కేటీఆర్ తరఫు న్యాయవాదులు తెలిపారు. మరోవైపు.. మంత్రి సురేఖపై నటుడు అక్కినేని నాగార్జున దాఖలుచేసిన క్రిమినల్ పరువు నష్టం దావా విచారణ కూడా 30వ తేదీకి వాయిదా పడింది. బుధవారం నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో ఈ దావాపై విచారణ జరిగింది. ఈ కేసులో సమన్లు అందుకున్న కొండా సురేఖ తన తరఫున న్యాయవాది గుర్మీత్ సింగ్‌ను వకాలత్‌గా పెట్టుకున్నారు. అనివార్య కారణాల వల్ల మంత్రి సురేఖ హాజరు కాలేకపోతున్నారని గుర్మీత్ సింగ్ కోర్టుకు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి కౌంటర్ ఇచ్చేందుకు సమయం కోరినట్టుగా తెలుస్తోంది.

బండికి కేటీఆర్ లీగల్ నోటీసులు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈనెల 19న తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోని బహిరంగ క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటారని, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పాత్ర ఉందని, వివిధ కేసుల నుంచి తప్పించుకునేందుకు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని గోప్యంగా కేటీఆర్ కలిశారని బండి సంజయ్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. వాటికి ఆధారాలు చూపించాలని.. లేదా ఆ నిరాధార వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, వారం రోజుల్లోగా బేషరతుగా క్షమాపణ చెప్పాలని.. లేదంటే క్రిమినల్ పరువు నష్టం దావా వేస్తామని కేటీఆర్ తరఫు న్యాయవాదులు నోటీసుల్లో పేర్కొన్నారు.

భయపెట్టాలని చూస్తే భయపడతామా?

కేటీఆర్ సుద్దపూసేమీ కాదు: బండి సంజయ్

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): "నాకు లీగల్ నోటీసులు ఇచ్చి భయపెట్టాలని చూస్తే భయపడేది లేదు, రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక లీగల్ నోటీసులు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తుంది. ఈ తాటాకు చప్పుళ్లకు భయపడను" అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్.. తనకు లీగల్ నోటీసులు పంపడంపై సంజయ్ స్పందించారు. తనకు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారన్న విషయాన్ని మీడియాలో చూసి తెలుసుకున్నానని తెలిపారు. మొదటగా కేటీఆరే తనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడంతో పాటు అవమానించారని, అందుకు బదులుగానే తాను మాట్లాడానని పేర్కొన్నారు.. ఇప్పటివరకు మాటలకు.. మాటలతోనే బదులిచ్చానని, ఇకపై లీగల్ నోటీసులకు.. నోటీసులతోనే బదులిస్తానని పేర్కొన్నారు. తాము చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులమని, చట్టం, న్యాయం ప్రకారమే ముందుకువెళ్తామన్నారు. కేటీఆర్ ఏమైనా సుద్దపూస అనుకుంటున్నాడేమోనని, కానీ ఆయన భాగోతం ప్రజలకు తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసంటూ బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఘాటు వ్యాఖ్యలు చేశారు.


రామన్నపేటలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు ప్రాంతంలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన ప్రజలు

సిమెంట్ ఫ్యాక్టరీ మాకొద్దు

- 'గో బ్యాక్ అంబుజా' అంటూ ప్రజల ఆందోళన..
- నిరసనల మధ్య సాగిన ప్రజాభిప్రాయ సేకరణ
- యాదాద్రి జిల్లా రామన్నపేటలో ఉద్రిక్తత
- తరలివచ్చిన పరిసర గ్రామాల ప్రజలు
- అదనపు కలెక్టర్‌ను అడ్డుకున్న ప్రజలు..
- ఫ్యాక్టరీ ఆపేస్తున్నట్లు ప్రకటించాలని పట్టు
- సదస్సుకువస్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్టు

యాదాద్రి/నల్లగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమను నెలకొల్పవద్దంటూ ప్రజలు ముక్తకంఠంతో స్పష్టంచేశారు. 63.8 ఎకరాల్లో ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఆ సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో బుధవారం రామన్నపేటలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రజల ఆందోళన, వారిని నిలువరించేందుకు పోలీసుల ప్రయత్నంతో ఉద్రిక్తత ఏర్పడింది. తమ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయెద్దని, 'అంబుజా గో బ్యాక్' అంటూ ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సమీపంలోని 10 గ్రామాల నుంచి యువకులు, మహిళలు, రైతులు ట్రాక్టర్లు, మోటారుసైకిళ్లపై తరలివచ్చి నిరసన తెలిపారు. కాలుష్యకారక సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తే చేతి, కుల వృత్తులు, వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. సదస్సుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు వెళ్లిపోవాలని స్థానికులు నినాదాలు చేయడంతో వారు తిరుగుముఖం పట్టారు. సదస్సు ముగిశాక అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.బెన్‌షాలోంను ప్రజలు అడ్డుకున్నారు. ఫ్యాక్టరీని నెలకొల్పబోమని ఇప్పుడే ప్రకటించాలని పట్టుబట్టారు. వారిని పోలీసులు అడ్డుకుని.. అదనపు కలెక్టర్‌ను వాహనం ఎక్కించారు. ఆ వాహనాన్ని ప్రజలు వెంబడిస్తూ 'అంబుజా గో బ్యాక్' అని నినాదాలు చేశారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రజల అంగీకారం లేకుండా పరిశ్రమను ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. సదస్సుకు బయలుదేరిన మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిషోర్ కుమార్, నోముల భగత్‌ను వేర్వేరుచోట్ల పోలీసులు అడ్డుకున్నారు. వీరిలో కొందర్ని గృహ నిర్బంధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏం ఆశించి రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చిందని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ ప్రశ్నించారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మోదీకి బీ-టీమ్‌గా.. రాష్ట్ర కాంగ్రెస్

- అందుకే అదానీ అంబుజాకు సహకారం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపణ

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ.. మోదీకి బీ-టీమ్‌గా పనిచేస్తోందని అందుకే రామన్నపేటలో అదానీ ఆధ్వర్యంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సహకరిస్తున్నారని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. సిమెంట్ ఫ్యాక్టరీ వస్తే రామన్నపేట మండలం కకావికలం అవుతుందని, దాన్ని అడ్డుకుంటామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రజల మధ్య కాకుండా దొంగచాటుగా జరపాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమ అభిప్రాయాలు చెప్పడానికి వెళ్తున్న బీఆర్ఎస్, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేశారన్నారు. రేవంత్‌రెడ్డి పరిపాలనకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలపై కోదండరామ్, హరగోపాల్ ఇప్పటికైనా గొంతు విప్పాలని డిమాండ్ చేశారు.

హర్మన్‌కు పరీక్ష



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్

నేడు తొలి పోరు

మ్యాచ్ మ. 1.30 నుంచి స్పోర్ట్స్ 18లో...

అహ్మదాబాద్: టీ20 ప్రపంచ కప్‌లో అంచనాలను అందుకోలేకపోయింది హర్మన్‌ప్రీత్ కౌర్ సేన. ఈనేపథ్యంలో వచ్చే ఏడాది జరిగే వన్డే వరల్డ్ కప్‌పై మన మహిళలు దృష్టి సారించారు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ ద్వారా మెగా టోర్నమెంట్ సన్నాహకాలను ఆరంభించనున్నారు. మొదటి మ్యాచ్ గురువారం జరగనుంది. తదుపరి రెండు వన్డేలకూ అహ్మదాబాదే ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సిరీస్ కెప్టెన్ హర్మన్‌కు ఎంతో కీలకం. కారణం..ఇటీవలి ప్రపంచ కప్‌లో హర్మన్ సారథ్యంలో జట్టు గ్రూప్ దశనుంచే వెనుదిరగడం. పైగా..టీ20 వరల్డ్ కప్ గ్రూప్ ఆరంభ మ్యాచ్‌లో ఇదే న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓడడం టోర్నీలో జట్టు అవకాశాలను దెబ్బతీసింది. మరోవైపు న్యూజిలాండ్ ప్రపంచ కప్‌ను కైవసం చేసుకొని ఉత్సాహంతో భారత్‌లో అడుగుపెట్టింది. టీ20 ప్రపంచ కప్‌లో దారుణ వైఫల్యం దరిమిలా హర్మన్ కెప్టెన్సీపై వేటు పడుతుందని అంచనా వేసినా..సెలెక్టర్లు ఆమెపై నమ్మకముంచారు. పైగా..ఇటీవలి కాలంలో 35 ఏళ్ల హర్మన్ సారథ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక..కివీస్‌తో సిరీస్‌కు రిచా ఘోష్, ఆల్‌రౌండర్ ఆశా శోభన అందుబాటులో ఉండడంలేదు. సీమర్ పూజా వస్త్రాకర్‌కు విశ్రాంతి నిచ్చారు. దాంతో పలువురు అన్‌క్యాప్డ్ క్రికెటర్లకు జట్టులో చోటు కల్పించారు. ఓపెనర్లు షఫాలీ వర్మ, మంధాన, జెమీమా, కౌర్‌లాంటి స్టార్లంతా పూర్తి స్థాయి ప్రదర్శన కనబరిస్తే తప్ప న్యూజిలాండ్‌ను అడ్డుకోవడం అంత సులభంకాబోదు.


ప్రాక్టీస్‌లో జడేజా, కోహ్లీతో కోచ్ గంభీర్

2 టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు బాదిన భారత బ్యాటర్‌గా రికార్డుకు రోహిత్ రెండు సిక్సర్ల దూరంలో ఉన్నాడు.

పిచ్/వాతావరణం

పుణె పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. నల్లమట్టి వికెట్ కావడంతో పేసర్లకు పెద్దగా సహకరించే చాన్సులు లేవు. మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్నర్లకు మరింత అనుకూలంగా మారవచ్చు. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకొనే అవకాశం ఉంది. వాతావరణం సాధారణంగా ఉండనుంది.

ఒత్తిడిలో భారత్

- రెండో టెస్ట్ నేటి నుంచే
- గిల్‌కు చోటు.. ఫిట్‌గా పంత్

చరిత్ర కోసం కివీస్



పుణె: మొదటి టెస్ట్‌లో అనూహ్య పరాజయంలో ఉలిక్కిపడిన భారత్.. కసిగా బదులు తీర్చుకోవాలనుకొంటోంది. గురువారం నుంచి న్యూజిలాండ్‌తో జరిగే కీలక రెండో టెస్ట్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా 0-1తో వెనుకబడింది. సిరీస్‌ను సొంతం చేసుకోవాలంటే విగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలవడం తప్పనిసరి కావడంతో రోహిత్ సేనపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అయితే, ఇంగ్లండ్‌తో సిరీస్‌లో కూడా టీమిండియా ఇలాగే తొలి టెస్టులో ఓడినా.. ఆ తర్వాత చెలరేగి సిరీస్‌ను సొంతం చేసుకొంది. బెంగళూరు మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలడంతో కోలుకోలేక పోయిన భారత్.. చివరకు 8 వికెట్లతో పరాజయం పాలైంది. కానీ, వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) టేబుల్‌లో టీమిండియా ఇంకా టాప్‌లోనే కొనసాగుతోంది. రాబోయేది ఆస్ట్రేలియా టూర్ కావడంతో.. స్వదేశంలో మిగిలిన రెండు టెస్టుల్లో విజయాలు సాధించి గెలుపు శాతాన్ని పెంచుకొంటేనే డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు బలపడతాయి. ఈ నేపథ్యంలో సొంతగడ్డపై ఉన్న అనుకూలతను భారత్ సొమ్ము చేసుకోవాలనుకొంటోంది. ఇందులో భాగంగా పుణెలో స్పిన్‌కు సహకరించే మందకొడి వికెట్‌తో లాభం పొందాలని చూస్తోంది. కానీ, గతంలో టర్నింగ్ వికెట్ వ్యూహం బెడిసికొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎనిమిదేళ్ల క్రితం పుణెలో జరిగిన టెస్ట్‌లో ఆసీస్ 8 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జట్టు కూర్పుపై మేనేజ్‌మెంట్ దృష్టిసారించింది.

సర్ఫరాజ్ లేదా రాహుల్: మెడ నొప్పితో తొలి మ్యాచ్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్‌కు తుది జట్టులో చోటు ఖాయం కావడంతో.. కేఎల్ రాహుల్, సర్ఫరాజ్‌లో ఒకరు బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశం ఉంది. బెంగళూరు టెస్ట్‌లో రెండో ఇన్నింగ్స్‌లో 150 పరుగులతో సర్ఫరాజ్ గట్టిపోటీ ఇస్తుండగా.. రాహుల్ వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. కానీ, కోచ్ గంభీర్ మాత్రం రాహుల్‌కు మద్దతుగా నిలుస్తుండడం విశేషం. ఇక, రోహిత్‌కు శుభారంభాలు దక్కినా.. భారీస్కోర్లుగా మలచలేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2019-20లో దక్షిణాఫ్రికాపై కోహ్లీ (254 నాటౌట్) ఇదే వికెట్‌పై డబుల్ సెంచరీ చేశాడు. దీంతో అతడు మరోసారి తన బ్యాటింగ్ మ్యాజిక్‌ను ప్రదర్శించాలని ఫ్యాన్స్ బలంగా కోరుకొంటున్నారు. వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఫిట్‌గా ఉన్నట్టు గంభీర్ చెప్పడంతో తుది జట్టులో అతడికి చోటుదక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సిరాజ్ ఆకట్టుకోలేక పోతుండడంతో అతడి స్థానంలో ఆకాశ్‌దీప్‌కు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. అశ్విన్‌తోపాటు జడేజా, కుల్దీప్‌తో స్పిన్ విభాగం బలంగా ఉంది. ఒకవేళ ఆల్‌రౌండర్ సుందర్‌ను తీసుకోవాలనుకొంటే అశ్విన్‌ను పక్కన బెట్టే అవకాశం లేకపోలేదు. మరోవైపు ఊహించని రీతిలో బోణీ కొట్టిన న్యూజిలాండ్.. ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉంది. ఈ మ్యాచ్‌తోపాటు సిరీస్‌ను సొంతం చేసుకొని చరిత్ర సృష్టించాలనుకొంటోంది. స్టార్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ లేకపోయినా.. కాన్వే, లాథమ్, యంగ్‌తోపాటు రచిన్ రవీంద్ర అద్భుత బ్యాటింగ్‌తో చిరస్మరణీయ విజయాన్ని అందించారు. స్పిన్ పిచ్ కావడంతో బౌలింగ్ విభాగంలో మార్పులు చేసే చాన్సులున్నాయి. సౌథీని పక్కనబెట్టి శాంట్నర్‌ను జట్టులోకి తీసుకోవచ్చు.

ఉదయం 9.30 నుంచి జియో సినిమాలో ..

జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రోహిత్, గిల్, కోహ్లీ, రిషభ్ పంత్, రాహుల్/సర్ఫరాజ్, జడేజా, అశ్విన్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్/ఆకాశ్‌దీప్,

న్యూజిలాండ్: టామ్ లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్ రవీంద్ర, మిచెల్, బ్లండెల్ (వికెట్ కీపర్), ఫిలిప్స్, శాంట్నర్, సౌథీ/ఓరోక్, హెన్రీ, ఎజాజ్ పటేల్.

టీ20లో 344/4

అత్యధిక స్కోరుతో జింబాబ్వే ప్రపంచ రికార్డు


సికందర్ (43 బంతుల్లో 133 నాటౌట్)

నైరోబీ: టీ20 క్రికెట్‌లో అత్యధికంగా 344 పరుగులు సాధించిన జట్టుగా జింబాబ్వే చరిత్ర సృష్టించింది. టీ20 వరల్డ్‌కప్ సబ్ రీజినల్ ఆఫ్రికా క్వాలిఫయర్స్ గ్రూప్-బీలో బుధవారం గాంబియాతో మ్యాచ్‌లో జింబాబ్వే 290 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 4 వికెట్లకు 344 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ క్రమంలో గతేడాది ఆసియా క్రీడల్లో మంగోలియాపై నేపాల్ సాధించిన 314 పరుగుల రికార్డును అధిగమించింది. సికందర్ రజా (43 బంతుల్లో 7 ఫోర్లు, 15 సిక్సర్లతో 133 నాటౌట్)తోపాటు టి.మరుమణి (19 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 62), క్లైవ్ మడండే (53 నాటౌట్), బ్రియాన్ బెన్నెట్ (50) రాణించారు. జింబాబ్వే తరఫున టీ20ల్లో శతకం సాధించిన తొలి ఆటగాడిగా రజా రికార్డుల్లోకి ఎక్కాడు. ఇక ఛేదనలో గాంబియా 14.4 ఓవర్లలో 54 పరుగులకే కుప్పకూలింది. రిచర్డ్ ఎన్‌గర్వ, బ్రండన్ మవుటా చెరో 3 వికెట్లు పడగొట్టాడు.

103 బంతుల్లో డబుల్ సెంచరీ


చాడ్ బౌస్

కివీస్ క్రికెటర్ వరల్డ్ రికార్డు

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ ఓపెనర్ చాడ్ బౌస్ లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అతి తక్కువ బంతుల్లో డబుల్ సెంచరీ చేసిన ఘనత అందుకున్నాడు. న్యూజిలాండ్ దేశవాళీ ఫోర్డ్ ట్రోఫీ వన్డే టోర్నీలో కాంటర్‌బర్రీ తరఫున ఒటాగోపై ఆడిన బౌస్ కేవలం 103 బంతుల్లో ద్విశతకం చేశాడు. దాంతో 50 ఓవర్ల ఫార్మాట్‌లో.. భారత బ్యాటర్ నారాయణన్ జగదీశన్, ఆసీస్ ఆటగాడు ట్రావిస్ హెడ్ (114 బంతులు) పేరిట ఉన్న గత రికార్డులను బౌస్ బద్దలు గొట్టాడు. కాగా..205 పరుగులకు బౌస్ అవుటయ్యాడు. 32 ఏళ్ల బౌస్ గతంలో వన్డే, టీ20లలో న్యూజిలాండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

చాంపియన్‌కు తలైవాస్ షాక్

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం ఇక్కడ జరిగిన పోరులో తలైవాస్ 35-30తో డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టన్‌కు షాకిచ్చింది. తలైవాస్ రైడర్లు నరేందర్ కండోలా 9, సచిన్ 8 పాయింట్లతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక, పుణెరి జట్టులో రైడర్ మోహిత్ గోయత్ 13 పాయింట్లు సాధించినా ఫలితం లేకపోయింది. ఇక.. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో యు ముంబా జట్టు 33-27తో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది.

హెచ్‌సీఏ వివాదాలపై సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో నెలకొన్న వివాదాలు, జస్టిస్ లావు నాగేశ్వరరావు కమిటీ నివేదికలపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. అధ్యక్ష ఎన్నికల విధానం, ఓటరు నమోదు తదితర అంశాలపై హెచ్‌సీఏ 2021 ఏప్రిల్ 30న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ వాదనల తర్వాత హెచ్‌సీఏ కార్యకలాపాల కోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు నేతృత్వంలో వన్ మ్యాన్ కమిటీని అత్యున్నత న్యాయస్థానం నియమించింది. అనంతరం తన సిఫార్సులను కమిటీ సుప్రీంకోర్టుకు అందించింది. ఆ సిఫార్సులపై సోమవారం సుప్రీంకోర్టులో జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. సుదీర్ఘ వాదనల అనంతరం కేసును ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది.

కష్టాల్లో బంగ్లాదేశ్

దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్

మీర్పూర్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ ఓటమి దిశగా పయనిస్తోంది. మ్యాచ్‌కు మూడోరోజైన బుధవారం ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 283 పరుగులు చేసింది. చేతిలో మరో 3 వికెట్లే మిగిలివున్న పరిస్థితుల్లో బంగ్లా కేవలం 83 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 101/3తో బ్యాటింగ్ కొనసాగించిన బంగ్లా జట్టులో మెహ్దీ హసన్ (87 బ్యాటింగ్), జాకెర్ అలీ (58) అర్ధ శతకాలతో రాణించారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 138 పరుగులు జోడించడంతో ఆతిథ్య జట్టు కోలుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 106, దక్షిణాఫ్రికా 308 పరుగులు చేశాయి.

హాకీలో భారత్‌కు నిరాశ

న్యూఢిల్లీ: జర్మనీతో రెండు మ్యాచ్‌ల హాకీ టెస్ట్ సిరీస్‌ను భారత్ పరాజయంతో ప్రారంభించింది. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 0-2తో ఓటమి పాలైంది. రెండో మ్యాచ్ గురువారం జరగనుంది.

కుర్రాళ్లకు తొలి ఓటమి: సుల్తాన్ జోహార్ కప్‌లో హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న భారత జూనియర్ జట్టుకు ఆస్ట్రేలియాకు ఝలకిచ్చింది. బుధవారం జరిగిన పోరులో యువ భారత్ 0-4 తేడాతో చిత్తయింది.

'ఎమర్జింగ్' కప్‌లో భారత్ హ్యాట్రిక్

అల్ అమెరాత్ (ఒమన్): ఎమర్జింగ్ నేషన్స్ కప్ టీ20 టోర్నమెంట్‌లో యువ భారత్ హ్యాట్రిక్ విజయంతో అదరగొట్టింది. ఇప్పటికే సెమీఫైనల్లోకి ప్రవేశించిన భారత్ 'ఎ' బుధవారం జరిగిన గ్రూప్ 'బి' ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 6 వికెట్లతో ఒమన్‌ను చిత్తుచేసింది. మొదట ఒమన్ 20 ఓవర్లలో 140/5 చేసింది. ఛేదనలో భారత్ 15.2 ఓవర్లలో 146/4 స్కోరు చేసింది. బదోనీ (51), కెప్టెన్ తిలక్ వర్మ (36 నాటౌట్) మెరిశారు. శుక్రవారం జరిగే సెమీస్‌లో అఫ్ఘానిస్థాన్‌తో భారత్ తలపడనుంది. మరో సెమీస్‌లో శ్రీలంక, పాకిస్థాన్ జట్లు ఢీకొంటాయి.

బిజినెస్



ఈ స్మార్ట్‌వాచ్ రూ.86,990

స్విట్జర్లాండ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న స్మార్ట్ టెక్నాలజీ ఉత్పత్తుల కంపెనీ గార్మిన్ బుధవారం భారత మార్కెట్లోకి ఫీనిక్స్ 8 సిరీస్ స్మార్ట్‌వాచ్‌లను ప్రవేశపెట్టింది. రెండేళ్ల వారంటీతో లభించే ఈ ప్రీమియం మల్టీ స్పోర్ట్ జీపీఎస్ స్మార్ట్‌వాచ్ ప్రారంభ ధర రూ.86,990. క్రీడాకారులు, సాహసయాత్రలు చేపట్టేవారి కోసం అత్యాధునిక కమ్యూనికేషన్, ట్రాకింగ్ ఫీచర్లతో ఈ వాచ్‌ను డిజైన్ చేసినట్లు కంపెనీ వెల్లడించింది.

కొత్త యూపీఐ యూజర్లను చేర్చుకోవచ్చు

పేటీఎంకు ఎన్‌పీసీఐ అనుమతి

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ పేటీఎం కొత్త యూపీఐ యూజర్లను చేర్చుకునేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. గత కొంతకాలంగా వరుస సమస్యలతో సతమతమవుతున్న పేటీఎంకు ఇది ఊరటనిచ్చే అంశం. ఎందుకంటే, ఈ ఏడాది జనవరిలో పేటీఎం అనుబంధ కంపెనీ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్‌పై (పీపీబీఎల్) ఆర్‌బీఐ పలు ఆంక్షలు విధించింది. పీపీబీఎల్ డిపాజిట్లు స్వీకరించకుండా నిషేధించడంతోపాటు కస్టమర్ల సేవింగ్, కరెంట్ అకౌంట్లతోపాటు ప్రీ-పెయిడ్ సాధనాలైన వాలెట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు (ఎన్‌సీఎంసీ) ఫాస్టాగ్ అకౌంట్లలోకి డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను స్వీకరించవద్దని బ్యాంక్‌ను ఆర్‌బీఐ ఆదేశించింది. ఎన్‌పీసీఐ తాజా అనుమతులతో పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేరు బీఎస్ఈలో ఏకంగా 8.40 శాతం ఎగబాకి రూ.745 వద్దకు చేరుకుంది.

హెరిటేజ్ ఫుడ్స్ ఆర్థిక ఫలితాలు అదుర్స్

క్యూ2లో రూ.48.6 కోట్ల నికర లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్ సెప్టెంబరు త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.1,019.5 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.83.2 కోట్ల స్థూల లాభం, రూ.48.6 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 4.2 శాతం మాత్రమే పెరిగినా, స్థూల లాభం 76.8 శాతం, నికర లాభం 117 శాతం పెరిగాయి. ఒక త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.1,000 కోట్లు మించడం ఈ సంవత్సరం ఇది రెండోసారని హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది. ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కంపెనీ రూ.2,052.2 కోట్ల ఆదాయంపై రూ.177 కోట్ల స్థూల లాభం, రూ.107.1 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 7.9 శాతం మాత్రమే పెరిగినా, స్థూల లాభం 102.7 శాతం, నికర లాభం 173 శాతం పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కంపెనీ రోజుకు సగటున 16.4 లక్షల లీటర్ల పాలు సేకరించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11.46 శాతం అధికం.

హెచ్‌యూఎల్ డివిడెండ్ బొనాంజా

ఒక్కో షేరుకు రూ.29 చెల్లింపు

క్యూ2 లాభం రూ.2,595 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను అందుకోలేకపోయాయి. సెప్టెంబరు త్రైమాసికానికి హెచ్‌యూఎల్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 2.33 శాతం తగ్గి రూ.2,595 కోట్లకు పరిమితమైంది. ఖర్చులు పెరగడంతోపాటు అర్బన్ మార్కెట్లో వస్తు గిరాకీ మందగించడం ఇందుకు కారణం. అయితే కంపెనీ విక్రయాలు మాత్రం 2.36 శాతం పెరిగి రూ.15,703 కోట్లకు చేరుకున్నాయి. మొత్తం వ్యయాలు 3.03 శాతం పెరుగుదలతో రూ.12,581 కోట్లుగా నమోదయ్యాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.19 మధ్యంతర డివిడెండ్‌తోపాటు రూ.10 ప్రత్యేక డివిడెండ్‌ను ప్రకటించింది. అంటే, వాటాదారులకు ఒక్కో షేరుకు మొత్తం రూ.29 డివిడెండ్ లభించనుంది. ఇప్పటివరకు కంపెనీ ఒక త్రైమాసికంలో చెల్లిస్తున్న అత్యధిక డివిడెండ్ ఇదే. ఇందుకు నవంబరు 6ను రికార్డు తేదీగా, 21ని చెల్లింపుల తేదీగా నిర్ణయించింది. కంపెనీ డివిడెండ్ రూపంలో వాటాదారులకు మొత్తం రూ.6,814 కోట్లు చెల్లించనుంది.

ఐస్‌క్రీమ్ వ్యాపార విభజన: ఐస్‌క్రీమ్ వ్యాపారాన్ని విభజించాలని హెచ్‌యూఎల్ బోర్డు నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఈ ఏడాది చివరినాటికి ఖరారు చేయనున్నట్టు కంపెనీ సీఈఓ రోహిత్ జావా చెప్పారు. మార్కెట్లో లభించే క్వాలిటీ వాల్స్ ఐస్‌క్రీమ్ బ్రాండ్ ఈ కంపెనీదే. కంపెనీ మొత్తం టర్నోవర్‌లో ఈ విభాగం వాటా 3 శాతంగా ఉంది.

టీవీఎస్ మోటార్ లాభం 41% అప్

సెప్టెంబరు త్రైమాసికంలో టీవీఎస్ మోటార్ కంపెనీ ఏకీకృత నికర లాభం 41.4 శాతం వృద్ధితో రూ.588.13 కోట్లకు చేరుకుంది. కంపెనీ రికార్డు స్థాయిలో వాహన విక్రయాలు జరపడం ఇందుకు దోహదపడింది. గడిచిన మూడు నెలల్లో కంపెనీ ఆదాయం సైతం రూ.11,301.68 కోట్లకు ఎగబాకింది. కాగా, వ్యయాలు సైతం రూ.10,427.64 కోట్లకు పెరిగాయి. ఈ జూలై-సెప్టెంబరులో టీవీఎస్ మొత్తం 12.28 లక్షల యూనిట్ల ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను విక్రయించింది. కంపెనీ చరిత్రలో అత్యధిక త్రైమాసిక విక్రయాలివి.

ఎస్‌బీఐ లైఫ్ లాభం రూ.529 కోట్లు

రెండో త్రైమాసికంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 39 శాతం వృద్ధి చెంది రూ.529 కోట్లకు ఎగబాకింది. మొత్తం ఆదాయం రూ.40,015 కోట్లకు పెరిగింది. కంపెనీ నికర ప్రీమియం వసూళ్లు రూ.20,266 కోట్లుగా నమోదయ్యాయి. తొలి ఏడాది ప్రీమియం ఆదాయం రూ.4,916 కోట్లుగా ఉంది. కాగా, సెప్టెంబరు 30 నాటికి కంపెనీ నిర్వహణలోని ఆస్తుల 28 శాతం పెరుగుదలతో రూ.4.4 లక్షల కోట్లకు చేరుకుంది. కంపెనీ నెట్‌వర్త్ 16 శాతం పెరిగి రూ.16,260 కోట్లుగా నమోదైంది.

నష్టాల్లో సాగర్ సిమెంట్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక సాగర్ సిమెంట్స్ రెండో త్రైమాసికంలో రూ.4,79.96 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.56.98 కోట్ల నష్టం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కంపెనీ సిమెంట్ అమ్మకాలు 13.12 లక్షల టన్నుల నుంచి 12 శాతం తగ్గి 11.6 లక్షల టన్నులకు పడిపోయాయి. దీంతో ఆదాయం 19 శాతం తగ్గింది. ఇదే సమయంలో కంపెనీ నష్టాలు రూ.10.85 కోట్ల నుంచి రూ.56.98 కోట్లకు పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కూడా ఆదాయం రూ.1,133.14 కోట్ల నుంచి ఏడు శాతం తగ్గి రూ.1,048.86 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ నష్టాలు రూ.53.13 కోట్ల నుంచి రూ.89.18 కోట్లకు చేరాయి.

మూడో రోజూ నష్టాలే

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 138.74 పాయింట్ల నష్టంతో 80,081.90 వద్ద, నిఫ్టీ 36.60 పాయింట్ల నష్టంతో 24,435.50 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 80,000 పాయింట్ల దిగువకు పడిపోయి 79,891.68 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది. ఉదయం కొద్ది పాటి లాభాలతో ప్రారంభమైన సూచీలు, మధ్యాహ్నం నుంచి ఆటో, ఫార్మా, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో లాభాల స్వీకరణ అమ్మకాలతో నష్టపోయాయి.

ఇండోఫాస్ట్ ఎనర్జీతో రాపిడో భాగస్వామ్యం

హైదరాబాద్: దేశంలోని ప్రధాన నగరాల్లో పియాజియో స్వాపబుల్ విద్యుత్ త్రీ వీలర్లు ప్రవేశపెట్టడానికి ఇండోఫాస్ట్ ఎనర్జీతో రాపిడో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం కింద రాబోయే 24 నెలల కాలంలో వివిధ నగరాల్లో 10 వేల ఈ-సిటీ మ్యాక్స్ త్రీవీలర్లు ప్రవేశపెడతారు. హైదరాబాద్, బెంగళూరు నుంచి దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాల్నింటికీ ఈ భాగస్వామ్యం విస్తరిస్తుంది. ఇండోఫాస్ట్‌తో భాగస్వామ్యం వల్ల తాము ఈవీ ప్లాట్‌ఫారం విస్తరించేందుకు వీలు కలుగుతుందని రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి అన్నారు.

బిగ్ సి దీపావళి డబుల్ ధమాకా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మొబైల్ రిటైలింగ్‌లో అగ్రగామి బిగ్ సి దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తమ కస్టమర్లకు డబుల్ ధమాకా ఆఫర్లు ప్రకటించింది. కస్టమర్లకు తాము నాలుగు ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నట్టు కంపెనీ సీఎండీ బాలు చౌదరి చెప్పారు. ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.10,000 విలువ గల మొబైల్ ప్రొటెక్షన్, రూ.12 వేల వరకు తక్షణ క్యాష్‌బాక్, రూ.5,999 విలువ గల కచ్చితమైన బహుమతి అందిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. అలాగే ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుం డా మొబైల్ కొనుగోలు చేసే సదుపాయం కూడా కల్పించినట్టు చెప్పారు. అంతే కాదు..వివో, ఒప్పో, ఎంఐ, రియల్ మీ ఫోన్ల కొనుగోలుపై లక్కీ డ్రాలో కార్లు, బైక్‌లు, మొబైల్ సహా మరెన్నో బహుమతులు అందిస్తున్నామన్నారు. ఇవి కాకుండా కచ్చితమైన బైబ్యాక్ ఆఫర్, జోడీ ఆఫర్, స్మార్ట్ టీవీ ఆఫర్, బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం వరకు డిస్కౌంట్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా మొబైల్, స్మార్ట్ టీవీ, లాప్‌టాప్, ఏసీ కొనుగోలు ఆఫర్ అందిస్తున్నామన్నారు.

ఏడీఐఏ నుంచి రూ.6,300 కోట్ల రుణం: జీఎంఆర్ గ్రూప్

న్యూఢిల్లీ : అబు దాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) నుంచి రూ.6,300 కోట్ల రుణాలుసమీకరించనున్నట్టు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. రెగ్యులేటరీ సంస్థల అనుమతులకు లోబడి జీఎంఆర్ గ్రూప్‌నకు ఏడీఐఏ ఈ రుణం సమకూర్చనుంది. ఈ నిధులను జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (జీఈపీఎల్) విదేశీ రుణాల చెల్లింపుకు ఉపయోగిస్తామని కంపెనీ తెలిపింది. జీఈపీఎల్, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్) కంపెనీ ప్రమోటర్ కూడా. జీఏఎల్ ప్రస్తుతం దేశంలో హైదరాబాద్, ఢిల్లీ, గోవా ఎయిర్‌పోర్టులతో పాటు ఇండోనేషియా, ఫిలిప్పీన్స్‌లో రెండు విమానాశ్రయాలు నిర్వహిస్తోంది.

కార్యాలయ స్థలం సగటు అద్దె రూ.101

కొలియెర్స్ నివేదిక



న్యూఢిల్లీ: దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాల సగటు అద్దె కొవిడ్ ముందు కాలంలో ఉన్న స్థాయి కన్నా పైకి చేరింది. చదరపు అడుగు సగటు అద్దె రూ.100 దాటింది. గత ఐదు సంవత్సరాల కాలంలో సగటు అద్దె 2 శాతం మేరకు పెరిగి రూ.101.3కి చేరిందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొలియెర్స్ ఇండియా తాజా నివేదికలో తెలిపింది. 2019 సంవత్సరంలో ఇది రూ.99.5 ఉంది. అయితే కొవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కాలంలో కార్యాలయ స్థలాలకు డిమాండు గణనీయంగా పడిపోవడంతో 2023లో ఇది రూ.97.1కి దిగజారింది. 2021లో మరింత తగ్గి రూ.94.8కి పడిపోయింది. కాని కొవిడ్ ప్రభావం తగ్గిన అనంతరం 2022 నుంచి కార్యాలయ అద్దెల్లో ఎగువకు కదలిక ప్రారంభమయిందని, అద్దెలు క్రమంగా పుంజుకుంటూ ఇప్పుడవి ఈ స్థాయికి చేరాయని పేర్కొంది.

హైదరాబాద్‌లో రూ.76.7: చదరపు అడుగు అద్దె రూ.151.6తో ముంబై ఆరు నగరాల్లో అగ్రస్థానంలో నిలవగా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో రూ.105.9 ఉంది. ఇతర నగరాల విషయానికి వస్తే బెంగళూరులో రూ.96.7, పూణెలో రూ.81.6, చెన్నైలో రూ.77.8 ఉండగా హైదరాబాద్‌లో రూ.76.7 పలుకుతోంది. అయితే ఇందులో కామన్ ఏరియా మెయింటెనెన్స్ లేదా పన్నులు కలిసి లేవు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,070 ▲	73,500 ▲	1,12,000 ▲
ముంబై	78,690 ▲	72,080 ▲	98,860 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ



హైదరాబాద్	515	విజయవాడ	540
వరంగల్	517	గోదావరి	535
చిత్తూరు	568	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	124
కర్నూలు	120	నెల్లూరు	124
విశాఖపట్నం	115	అనంతపురం	124
గోదావరి	130		

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు స్పెషలిస్టు వైద్యులను పంపొద్దు

▸ ప్రభుత్వ వైద్యుల సంఘం తీర్మానం

హైదరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సర్వీస్ నిబంధనలకు వ్యతిరేకంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు స్పెషలిస్టు వైద్యులను పంపుతూ వైద్యవిద్య సంచాలకులు, తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ ఆదేశాలు జారీ చేయడాన్ని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మొట్ట మొదటి కార్యవర్గ సమావేశం బుధవారం కోఠిలోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆఫీస్ బేరర్స్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని వైద్యభవన్‌ను పునరుద్ధరించి త్వరలోనే వైద్యులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. డీఎంఈ, డీహెచ్, వీవీపీ ఈఎస్ఐ ప్రభుత్వ వైద్యుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వాలని తీర్మానం చేశారు.

ఇందిరమ్మ కమిటీల జీవో చెల్లదు

▸ హైకోర్టులో బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామపంచాయతీ, మునిసిపల్ వార్డుల స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తూ ఆర్ అండ్ బీ శాఖ జారీ చేసిన జీవో 33 చెల్లదని పేర్కొంటూ హైకోర్టులో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, రాజ్యాంగానికి వ్యతిరేకంగా జీవో జారీ చేశారని, గ్రామ సభ ప్రస్తావన లేకుండా లబ్ధిదారుల ఎంపిక అక్రమమని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా తమ పార్టీకి అనుకూలంగా ఉన్న వ్యక్తులనే లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు ఈ జీవో తెచ్చినట్టుగా ఉందని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం.. తమ వైఖరి తెలియజేయాలని పేర్కొంటూ ఆర్ అండ్ బీ శాఖ, హౌసింగ్ కార్పొరేషన్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ 28కి వాయిదాపడింది.

తెలంగాణ, కర్ణాటక సీఎంల భేటీ

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మైసూరు విమానాశ్రయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్దరామయ్య బుధవారం భేటీ అయ్యారు. వయనాడ్‌లో ప్రియాంకగాంధీ నామినేషన్‌లో పాల్గొని, వెనుతిరిగి వచ్చిన సమయంలో ఇద్దరూ విమానాశ్రయంలో తారసపడగా.. కాసేపు మాట్లాడుకున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కర్ణాటక మంత్రి మునియప్ప, ఎమ్మెల్సీ యతీంద్ర సిద్దరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షి వారితోపాటు ఉన్నారు.

జెన్‌కో పీపీఏలకు ఈఆర్‌సీ సమ్మతి

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జెన్‌కోకు చెందిన పలు పవర్ ప్లాంట్‌ల నుంచి చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు టీజీఈఆర్‌సీ సమ్మతి తెలిపింది. కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీఎస్) ఐదో దశ 500 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని కొనసాగించడానికి అంగీకరించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. కేటీపీఎస్ ఐదో దశ 500మెగావాట్ల ప్లాంట్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసే ఒప్పందం గత మార్చి 31న ముగియడంతో దీన్ని రానున్న ఐదేళ్లపాటు 2029 మార్చి 31 దాకా పొడిగించడానికి అవకాశం ఇచ్చింది. ఇక రామగుండంలోని 62.5 మెగావాట్ల పవర్ ప్లాంట్ (ఆర్‌టీఎస్-బీ) నుంచి చేసుకున్న ఒప్పందం గత మార్చి 31వ తేదీతో ముగిసింది. ఒప్పందం ముగిసినప్పటికీ 63 రోజుల పాటు ప్లాంట్ నుంచి కరెంట్ కొనుగోలు చేయగా ఆ కాలానికి ఆమోదం తెలిపింది.

జయేశ్‌కు అదనంగా క్రీడల శాఖ బాధ్యతలు

ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌కు అదనంగా రాష్ట్ర క్రీడల శాఖ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఆయనను రాష్ట్ర ఐటీ, క్రీడలు శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు.

గల్ఫ్ కార్మికుల ఎక్స్‌గ్రేషియాకు 6.45 కోట్లు

గల్ఫ్ దేశాల్లో మరణించిన రాష్ట్ర కార్మికుల కుటుంబాలకు 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికి రూ. 6.45 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రంలోని 15 జిల్లాలకు ఈ నిధులను కేటాయించినట్లు పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో మరణించే కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా జిల్లాలకు నిధులను కేటాయించింది. నిధుల వ్యయ బాధ్యతలను కలెక్టర్లకు అప్పగించింది.

డిస్కమ్‌లకు గృహజ్యోతి సబ్సిడీ విడుదల

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్‌ను అందిస్తుండటంతో డిస్కమ్‌లకు ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేసింది. ఈ పథకం అమలులో భాగంగా అక్టోబరు మాసానికిగాను 186.24కోట్లను డిస్కమ్‌లకు విడుదల చేస్తూ ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం జీవో జారీ చేశారు.

రాహుల్ ద్వంద్వ వైఖరికి ఇదే నిదర్శనం: హరీశ్

దేశమంతా తిరుగుతూ రాజ్యాంగాన్ని రక్షించాలని రాహుల్‌గాంధీ ప్రవచిస్తుంటే.. తెలంగాణలో మాత్రం అందుకు భిన్నంగా ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకున్నామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ స్వయంగా ప్రకటించడంతో ఆ పార్టీ విధానం బహిర్గతమైందని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో రాజ్యాంగాన్ని కాపాడుతామంటూ ప్రమాణాలు చేస్తూ.. తెలంగాణలో మాత్రం రాజ్యాంగాన్ని ఖూనీ చేయడం రాహుల్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. కాగా, డిజిటల్ సర్వేకు ఒప్పుకోలేదన్న కారణంతో 163మంది ఏఈవోలను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు హరీశ్ తెలిపారు. ఉద్యోగులపై బలవంతంగా భారం వేయడం, మాట వినలేదని సస్పెండ్ చేయడమేనా.. కాంగ్రెస్ ప్రజాపాలన అని ప్రశ్నించారు. కాగా, రామన్నపేటలో నిర్మించతలపెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణకు బీఆర్ఎస్ నేతలు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. నల్గొండ జిల్లా నేతలు రవీంద్రకుమార్ నాయక్, భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిషోర్ సహా ఇతర నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పంటల డిజిటల్ సర్వేకు ఏఈవోలు ఓకే!

▸ వ్యవసాయ శాఖ జరిపిన చర్చలు సఫలం

ఎట్టకేలకు పంటల డిజిటల్ సర్వేలో పాల్గొనేందుకు వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) సుముఖత వ్యక్తం చేశారు. గురువారం నుంచి సర్వే చేసేందుకు అంగీకారం తెలిపారు. సర్వే విషయంలో కొంతకాలంగా వ్యవసాయశాఖ, ఏఈవోల మధ్య వివాదం నడుస్తోంది. ఇదే సమయంలో రైతుబీమా పోర్టల్‌లో మరణాల నమోదులో అలస్యం చేసినందుకుగాను వ్యవసాయశాఖ 160మంది ఏఈవోలను మంగళవారం సస్పెండ్ చేసింది. ఈ రెండు అంశాలపై చర్చించేందుకు బుధవారం వ్యవసాయశాఖ డైరక్టర్ కార్యాలయంలో ఏఈవోల సంఘంతో పాటు, రాష్ట్రస్థాయి గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవోలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శాఖ డైరెక్టర్ గోపికి అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని డైరెక్టర్ గోపి హామీ ఇవ్వడంతో సర్వేలో పాల్గొనేందుకు ఏఈవోలు అంగీకరించారు.

ఈ నెల 26, 27 తేదీల్లో వర్షాలు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని పలు జిల్లాల్లో అక్టోబరు 26, 27 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆ రెండు రోజుల పాటు రాష్ట్రానికి యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇక గురు, శుక్ర వారాలకు సంబంధించి ఎటువంటి వాతావరణ హెచ్చరికలు లేవని తెలిపింది.

ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలతాయి!

(మొదటిపేజీ తరువాయి)

ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించి అన్ని సాక్ష్యాధారాలతో ఫైళ్లు కూడా సిద్ధం చేశామని తెలిపారు. సియోల్ నుంచి హైదరాబాద్ చేరేలోపే ఈ చర్యలు ప్రారంభమవుతాయన్నారు. ఇది కక్ష్యసాధింపు కాదని.. పూర్తి ఆధారాలతో సర్కారు చర్యలు తీసుకోబోతోందని స్పష్టం చేశారు. తప్పు చేసింది ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి విచారణ దాదాపు పూర్తయిందని, మొత్తానికి ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి అంశాలు ట్రాక్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఎలాంటి చర్యలు లేవని ప్రజలు భావించవద్దని, వారు కోరుకునే విధంగా పూర్తి ఆధారాలతో ముందుకు రాబోతున్నామని వెల్లడించారు.



అన్ని భూ సమస్యలకు చెక్ పెట్టేలా..

భూహక్కులపై సామాన్య రైతుల నుంచి భూస్వాముల వరకు ఎవరికి అపోహలకు తావు లేకుండా అన్ని సమస్యలకు చెక్‌పెట్టేలా కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తెస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కొత్త ఆర్వోఆర్ చట్టం ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. అభద్రతలో ఉన్న లక్షలాది మంది రైతులకు ఇందిరమ్మ ప్రభుత్వం భరోసా కల్పించబోతోందని స్పష్టం చేశారు. 15 దేశాల్లో అమల్లో ఉన్న ఉత్తమ రెవెన్యూ విధానాలను అధ్యయనం చేసి కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని రూపొందించామన్నారు. అంతేకాకుండా ముసాయిదాపై సామాన్య రైతులు, మేధావుల నుంచి అభిప్రాయాలు సేకరించి వారి సూచనలు, సలహాలను క్రోడీకరించి చట్టంలో పొందుపర్చామని వెల్లడించారు. ధరణి లోపాల వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. లక్షలాది ఎకరాల భూరికార్డులను విదేశీ సంస్థల చేతిలో పెట్టిన కేసీఆర్.. పోర్టల్ నిర్వహణ పేరుతో రూ.కోట్ల ఖర్చు చేశారని ఆరోపించారు. పార్ట్-బీలో ఉన్న 13 లక్షల ఎకరాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడంతోపాటు ధరణిలో కనిపించకుండా ఉన్న భూములను బయటపెట్టి అర్హులకు, హక్కుదారులకు దక్కేలా చూస్తామని చెప్పారు. గతంలో మాన్యువల్‌గా ఉన్న పహాణీలో 32 కాలాలు ఉండేవని అవన్నీ గత ప్రభుత్వం తొలగించి ధరణి ముసుగులో ఒకే కాలం పెట్టి గందరగోళ పరిస్థితిని సృష్టించిందన్నారు. ఇదే కాలంలో మార్పులు చేసి సుమారు 14 కాలాలు ఉండేలా ధరణి పేరు మార్చి కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తేబోతున్నామన్నారు. ప్రతి రైతుకు క్లియర్ టైటిల్‌తో డాక్యుమెంట్ ఉండబోతోందని వివరించారు.

ఫోర్త్‌సిటీకి స్మార్ట్ సొబగులు!

(మొదటిపేజీ తరువాయి)

తదితర సేవలను సాంకేతికత సహాయంతో అందిస్తున్న తీరును అడిగి తెలుసుకుంది. తక్కువ భూభాగంలోనే ఈ నగరాలను అభివృద్ధి చేస్తున్నారని, ఇంతకంటే ఎక్కువ స్థలం ఉన్న ఫోర్త్‌సిటీని అన్ని హంగులతో నిర్మించవచ్చనే అభిప్రాయానికి వచ్చింది.

ఇంచియాన్‌లో స్మార్ట్‌గా సేవలు..

ఇంచియాన్ స్మార్ట్ సిటీలో ప్రజలకు అవసరమయ్యే అన్ని సేవలు దాదాపు ఆన్‌లైన్‌లోనే అందుతున్నాయి. ఐటీ, ఐవోటీలను ఉపయోగించి మొత్తం స్మార్ట్ సేవలకు శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, రక్షణ వ్యవస్థల నిర్వహణతో పాటు చలికాలం ఇళ్లలోని ఏసీల ద్వారా వేడి రావడం, వేసవిలో చల్లగాలి వచ్చేలా నియంత్రించడం వరకు అంతా స్మార్ట్‌గా అందిస్తున్నారు. అంతేకాదు.. దక్షిణ కొరియాలోనే మొట్టమొదటి ఫ్రీ ఎకనామిక్ జోన్ (ఎఫ్ఈజడ్) కూడా ఇక్కడే ఏర్పాటైంది. ఈ నగర అభివృద్ధికి ప్రైవేటు సంస్థలు కూడా ముందుకొచ్చాయి. పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో అభివృద్ధి జరిగింది. అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఇంచియాన్‌లోనే ఉంది. దీంతో హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో నిర్మించబోతున్న ఫోర్త్‌సిటీలో కూడా ఇంచియాన్ నగరంలోని స్మార్ట్ విధానాలనే అనుసరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా హైదరాబాద్, జిల్లాల కేంద్రాల్లో కూడా అవసరమైన మేరకు ఈ స్మార్ట్ సేవలను తీసుకువచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

శిక్షణ ఇచ్చేందుకు రావాలి..

కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా రాష్ట్ర మంత్రుల బృందం సందర్శించింది. అక్కడి సౌకర్యాలను పరిశీలించింది. యూనివర్సిటీలో శిక్షణ పొందిన అనేకమంది క్రీడాకారులు ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియాకు పతకాలు సాధించి పెట్టారు. కాగా, ఫోర్త్‌సిటీలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ కోసం కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో ఎంవోయూ చేసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఆగస్టులో దక్షిణ కొరియా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ యూనివర్సిటీని సందర్శించారు. ఆయన కూడా ఇక్కడి అధికారులతో మాట్లాడారు. ఇప్పుడు మంత్రులు ఆ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లారు. ఫోర్త్‌సిటీలో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలోని క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు రావాలని కోరారు. ఇందుకు అక్కడి అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ సహకారానికి సంబంధించి త్వరలోనే అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడానికి అంగీకారం కుదిరింది.

ఫోర్త్ సిటీలో పెట్టుబడులకు ప్రపంచంలోని పలు కంపెనీలు సిద్ధం

ఐటీ రంగంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉండే కాలుష్యరహిత కంపెనీలను స్మార్ట్ ఫోర్త్‌సిటీలో ఏర్పాటుచేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇంచియాన్ స్మార్ట్‌సిటీతో చూస్తే ఫోర్త్‌సిటీకి ఉన్న ప్రదేశం ఇంకా ఎక్కువ అని, భవిష్యత్తులో మరింత అద్భుతంగా అభివృద్ధి చేయవచ్చునని పేర్కొన్నారు. ఫార్మా రంగంలో కూడా కాలుష్య రహితమైనవే వస్తాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లోని పలు కంపెనీలు ఫోర్త్‌సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయన్నారు. కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన ఒక అమ్మాయే ఒలింపిక్స్‌లో ఏకంగా మూడు బంగారు పతకాలు సాధించిందని తెలిపారు. ఇక్కడి నుంచి వచ్చే కోచ్‌లు ఇచ్చే శిక్షణతో యంగ్ ఇండియా యూనివర్సిటీలో మెరికల్లాంటి క్రీడాకారులను తయారుచేస్తామన్నారు. భారత్ తరఫున హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా చేసి.. తెలంగాణ బిడ్డల్ని కూడా పతక విజేతలుగా చేస్తామని చెప్పారు.

ప్రతిపక్ష నేతలవి అవాకులు, చవాకులు..

ప్రధాన ప్రతిపక్ష నేతలు కొన్ని అవాకులు, చవాకులు పేలారని పొంగులేటి మండిపడ్డారు. ఒకరోజు పిల్ల కాలువ అని, మరో పెద్ద కాలువ అని రకరకాలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. సియోల్ నదులను ఎత్తుకొచ్చి తెలంగాణలో పెట్టమని, ఇక్కడ ఆ నదుల అభివృద్ధి కోసం అనుసరించిన విధానాలను అమలుచేస్తామని అన్నారు. దశాబ్దాలుగా మూసీలో మగ్గుతున్న వారికి మెరుగైన జీవితాలు ఇచ్చేలా, వారి పిల్లలకు ఉద్యోగ భవిష్యత్తు ఉండేలా విధానాలు రూపొందిస్తామన్నారు. మూసీని ప్రక్షాళన చేసే విషయంలో బాధితులను కష్టపెట్టబోమని స్పష్టం చేశారు. కాగా, బీజేపీ నేతలు మూసీ నదిని సందర్శించి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ తప్పుబట్టారు. వాళ్ల అవకాశవాద రాజకీయాలు మానుకోవాలని, తెలంగాణ అభివృద్ధి కావాలనుకుంటే మూసీ విషయంలో సహకరించాలని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే విమర్శలు మాని.. సూచనలు ఇవ్వాలన్నారు.



మలేషియా పర్యటనలో తుమ్మల, అధికారులు

ఆయిల్‌పామ్ పరిశ్రమ అభివృద్ధికి మలేషియా సహకారం

▸ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పరిశ్రమ అభివృద్ధికి రానున్నకాలంలో ఆయిల్‌పామ్ సాగులో అగ్రగామి ఉన్న దేశాల్లో ఒకటైన మలేషియా సహకారం తీసుకోనున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయిల్ పామ్ విస్తరణావకాశాలు, ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వహణ, సాగులో అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు, ఆయిల్‌పామ్ ఉత్పాదకాలపై శాస్త్రీయ అధ్యయనానికి మంత్రి తుమ్మల, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషాలు మలేషియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మలేషియా ప్లాంటేషన్, కమోడిటీస్ మంత్రి జోహరి అబ్దుల్ ఘనితో బుధవారం భేటీ అయ్యారు. పామాయిల్ ఉత్పత్తికి అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నామని, త్వరలోనే మలేషియా బృందం తెలంగాణలో పర్యటిస్తుందని తెలిపారు. అనంతరం ఎంఏటీఆర్ఏడీఈ చైర్మన్ డాటో సెరి రీజల్ మెరికన్ భేటీతో అయి మలేషియాతో వ్యవసాయపరంగా వ్యాపార అవకాశాలపై చర్చించారు. తమ దేశంలో నూకలకు అత్యంత డిమాండ్ ఉందని డాటో చెప్పారు. వెంటనే మంత్రి తుమ్మల... హాకా ఎండీ చంద్రశేఖర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. నూకలు ఎగుమతి చేయడానికి సంబంధించిన అంశాలను పరిశీలించాలని, తెలంగాణ వరి రైతులకు అదనపు ప్రయోజనం కలిగితే వచ్చే యాసంగి సీజన్‌కల్లా ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అనంతరం మలేషియా పామాయిల్ బోర్డును సందర్శించారు. ఎంపీవోబీ చైర్మన్ డా.అహ్మద్ పర్వేజ్ గులామ్‌ఖదీర్‌తో భేటీ అయ్యారు.

బాలికపై సీఐ అత్యాచారయత్నం

(మొదటిపేజీ తరువాయి)

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ హనుమకొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. తాను నివాసం ఉండే ప్రాంతానికి చెందిన ఓ బాలికపై కన్నేశాడు. ఈ నెల 9వ తేదీన సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికొచ్చిన సదరు బాలికకు చాక్లెట్ ఇస్తానని ఆశచూపి ఇంట్లోకి పిలుచుకున్నట్లు, స్కూల్ విషయాలు అడుగుతూ ఆమె శరీరాన్ని అభ్యంతకరరీతిలో తాకుతూ ప్రవర్తించినట్లు సమాచారం. అప్పటికే ఆ బాలిక.. తాను ఇంటి వెళ్లాలి అంకుల్ అంటూ విడిపించుకునేందుకు ప్రయత్నించినా విచక్షణ మరిచిన ఆ పోలీసు ఆ బాలికపై అత్యాచారయత్నం చేశాడు. అతడి నుంచి ఆ బాలిక ఎలాగోలా తప్పించుకుని ఇంటికి వెళ్లి జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పింది. నిందితుడు పోలీస్ అధికారి కావటంతో వారు ఫిర్యాదు చేసేందుకు కొంత వెనుకడుగు వేశారు. ఎట్టకేలకు మిత్రుల సలహాతో ఆ తల్లిదండ్రులు మంగళవారం కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు అక్కడ సీఐ రవికుమార్‌పై పోక్సో చట్టం 2012 కింద కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి పోలీసులు (సీఆర్ నెం.264/2024) కేసు నమోదైనప్పటికి బయటకు పొక్కకుండా స్థానిక పోలీసులు తీవ్రంగా ప్రయత్నాలు చేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ కేసుకు సంబంధించి మీడియా ప్రతినిధులు ఎస్‌హెచ్‌వోను సమాచారం అడగ్గా.. మూడు రోజులుగా అనారోగ్యం వల్ల డ్యూటీలో లేనని చెప్పాడని, అతడితో పాటు కేసు నమోదు చేసిన ఎస్ఐ, మరో ఎస్ఐ కూడా ఫోన్లు ఎత్తకుండా సమాచారాన్ని దాటవేసే ప్రయత్నాలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పై అధికారుల నుంచి కూడా ఇదే స్పందన వ్యక్తమైంది. ఎట్టకేలకు ఎఫ్ఆర్ఐ కాపీ బయటకు లీక్ కావటంతో సీఐ బాగోతం వెలుగులోకి వచ్చిందనే చర్చ జరుగుతోంది.

రవి కుమార్‌పై గతంలోనూ వివాదాలే

సీఐ రవికుమార్ గతంలోనూ వివాదాస్పదంగా వ్యవహరించారు. మడికొండ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పని చేస్తున్న క్రమంలో ఎంఆర్‌పీఎస్ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే ఈ కార్యక్రమానికి వెళ్లకుండా ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలను మడికొండ వద్ద అదుపులోకి తీసుకుని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. అయితే పైఅధికారులకు సమాచారం లేకుండా వీరిలో కొందరిని ఇంటికి పంపించటంపై అప్పట్లో ఉన్నతాధికారుల తీవ్రంగా పరిగణించడంతో బదిలీ వేటు పడింది. అలాగే మామునూరు సీఐగా పనిచేస్తున్న సమయంలో బ్యూటీపార్లర్ నిర్వహించే ఓ మహిళను రవికుమార్ వేధింపులకు గురి చేసినట్లుగా ఆరోపణలొచ్చాయి. దీనిపై విచారణ జరిపిన వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా రవికుమార్‌ను ఐజీకి అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న సీఐ రవికుమార్‌పై తాజాగా మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి సంబంధించి కేసు నమోదవడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఆర్నెల్లలో వచ్చింది 39 శాతమే!

(మొదటిపేజీ తరువాయి)



సంవత్సరం (2024-25)లో మాత్రం 39.41 శాతమే నమోదవడం గమనార్హం. నిరుటి కంటే 6.21 శాతం మేర ఆదాయం తగ్గింది. సాధారణంగా ఏ రాబడి మార్గాన్ని చూసినా.. 10-15 శాతం మేర పెరుగుదల ఉంటుంది. కానీ, ఈసారి కొన్ని రాబడుల్లో తగ్గుదల నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ, మూలధన రాబడుల కింద మొత్తం రూ.2,74,057.64 కోట్లు వస్తాయని అంచనా వేయగా.. సెప్టెంబరు నాటికి రూ.1,08,011.35 కోట్లు (39.41%) మాత్రమే సమకూరాయి. ఇందులో అప్పుల రూపంలో తీసుకున్న సొమ్మే 30 శాతం (రూ.32,556.94 కోట్లు) ఉండడం గమనార్హం. గత ఏడాదితో పోలిస్తే పన్ను రాబడి కూడా తగ్గింది. పన్నుల కింద మొత్తం రూ.1,64,397.64 కోట్లు వస్తాయని ఆశించగా.. రూ.68,905.80 కోట్లు (41.91%) సమకూరాయి. గత ఏడాది ఇది 43.73 శాతంగా ఉంది.

కేంద్ర గ్రాంట్లు నయాపైసా రాలే..

కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద సెప్టెంబరులో నయా పైసా విడుదల కాలేదు. ఈ పద్దు కింద ఏడాదిలో రూ.21,636.15 కోట్లను ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆగస్టు నాటికి రూ.2,447.03 కోట్లు సమకూరాయి. సెప్టెంబరులో మాత్రం పైసా కూడా విడుదల చేయలేదు. ఇక రాష్ట్ర పన్నేతర రాబడి కాస్త ఊరటనిచ్చింది. ఒక్క సెప్టెంబరులోనే దీని కింద రూ.2,652 కోట్లు సమకూరాయి. ఏప్రిల్‌లో రూ.354 కోట్లు, మేలో 373 కోట్లు, జూన్‌లో 271 కోట్లు, జూలైలో 256 కోట్లు, ఆగస్టులో 192 కోట్లు సమకూరగా.. సెప్టెంబరులో మాత్రం ఏకంగా రూ.2,652 కోట్లు రావడం విశేషం. ఈ ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వ్యయాల కింద మొత్తం రూ.1,01,131.57 కోట్లను ఖర్చు చేసింది.

తొలి ఆర్నెల్లలో రాబడులు ఇలా..

ఆదాయ మార్గం	సెప్టెంబరుకు వచ్చింది (రూ.కోట్లలో)	మొత్తం అంచనాలో శాతం	గతేడాది వచ్చిన నిధుల శాతం
పన్నురాబడి	68,905.8	41.91	43.73
జీఎస్టీ	24,732.12	42.21	44.45
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	7,251.21	39.78	37.87
అమ్మకం పన్ను	16,081.63	48.08	37.87
ఎక్సైజ్ సుంకాలు	9,492.98	37.06	61.63
కేంద్ర పన్నుల్లో వాటా	7,533.32	40.98	42
ఇతర పన్నులు, సుంకాలు	3,813.87	37.72	41.31
పన్నేతరాలు	4,101.58	11.65	74.08
గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్లు	2,447.03	11.31	8.77
అప్పులు	32,536.26	66.06	81.95

బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాల్సిందే!

- ▸ ఇచ్చిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపులు
- ▸ మిల్లింగ్ చార్జీలు పెంచేందుకూ ఓకే
- ▸ కీలక సిఫారసులతో ధాన్యం పాలసీ
- ▸ నేడు సీఎంకు ఇవ్వనున్న సబ్‌కమిటీ
- ▸ ఈ సారి రికార్డు స్థాయిలో కొనుగోళ్లు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గతంలో మాదిరిగా రైస్ మిల్లర్లకు అప్పనంగా ధాన్యం అప్పగించకుండా... బ్యాంకు గ్యారెంటీ తీసుకున్న తర్వాతే కేటాయించాలని మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదించింది. నిర్ణీత ధాన్యం పరిమాణానికి అనుగుణంగా బ్యాంకుల్లో ఆస్తులు తాకట్టుపెట్టి.. బ్యాంకు గ్యారెంటీ పత్రాలు తీసుకొని, పౌరసరఫరాల సంస్థకు అప్పగించిన రైస్ మిల్లర్లకే ఇకపై ధాన్యం కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు ధాన్యం సేకరణపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావుతో ఏర్పాటైన ఉప సంఘం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అన్ని వర్గాలతో చర్చించి, ఇతర రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేసి ఖరీఫ్ ధాన్యం పాలసీ-2024ని రూపొందించింది. సంబంధిత నివేదికను గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయనుంది. ఈనెల 26 న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఖరీఫ్ ధాన్యం పాలసీకి ఆమోద ముద్ర వేయనున్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని పౌరసరఫరాల భవన్‌లో బుధవారం మంత్రి వర్గ ఉప సంఘం భేటీ అయింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి తదితరులు అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదనలను మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై తుది నివేదిక సిద్ధమైందని, గురువారం సీఎం రేవంత్‌కు అందజేస్తామని వెల్లడించారు. బ్యాంకు గ్యారెంటీలతోపాటు మిల్లింగ్ చార్జీల పెంపుపైనా కీలక సిఫారసులు చేసినట్లు తెలిపారు. గోదాముల్లో 10 లక్షల టన్నుల ధాన్యం నిల్వ, ఆ సమయంలో తరుగు నష్టంపై ఉపసంఘం అధ్యయనం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం... 60.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని... 146.70 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో 30 లక్షల టన్నులు దొడ్డు రకం, 50 లక్షల టన్నులు సన్న రకం సేకరించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. సన్నధాన్యానికి క్వింటాల్‌కు అదనంగా రూ. 500 బోనస్‌ను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే నేరుగా రైతుల ఖాతాల్లో పడేలా ఏర్పాట్లు చేశామన్నారు. సన్న రకం ధాన్యం నిల్వకు ప్రత్యేకంగా గోదాములు ఉండాలని నిర్దేశించినట్లు తెలిపారు. మొత్తం 7,248 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రాంభిస్తున్నామని, ఇందులో 2,539 కేంద్రాల్లో ఇప్పటికే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు సరిపడా గన్నీ బ్యాగ్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం కొనుగోళ్లను ఎప్పటికప్పుడు ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు పర్యవేక్షిస్తుంటాయన్నారు. దళారుల చేతిలో రైతాంగం మోసపోకుండా ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించినంత వరకు ప్రతికూల వార్తలు వస్తే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకునేలా జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించమన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని ఉత్తమ్ తెలిపారు. 1,440 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు కొత్త రికార్డులను సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



వరంగల్ ఎంజీఎంలో చెట్టుకింద పడుకున్న బాలింత మౌనిక

తల్లడిల్లిన బాలింత!

- అబ్జర్వేషన్ రూమ్‌లో పసికందు..
- బెడ్ లేక చెట్టు కింద బాలింత అవస్థలు
- వరంగల్ ఎంజీఎంలో ఘటన

వరంగల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆస్పత్రిలో బెడ్ లేక ఓ బాలింత ఆవరణలోని చెట్టు కింద గడపాల్సి వచ్చింది. ఇంక్యుబేటర్‌లో ఉన్న బిడ్డను చూసుకుంటూ వార్డు ఎదుట నేలపై కూర్చొని పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ ఘటన వరంగల్ ఎంజీఎంలో చోటుచేసుకుంది. ములుగు జిల్లా ఏటూరునాగరం మండలం ముల్కనపల్లి గ్రామానికి చెందిన మౌనికకు మంగళవారం రాత్రి వాజేడు మండలం పేరూరు పీహెచ్‌సీలో సాధారణ ప్రసవమైంది. పుట్టిన బిడ్డ బరువు తక్కువగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకొచ్చారు. పరిశీలించిన వైద్యులు శిశువును పిల్లల వార్డులో అడ్మిట్ చేసి, ఇంక్యుబేటర్‌లో ఉంచారు. అయితే చంటిపాపతో పాటు వచ్చిన తల్లి మౌనికను బెడ్ ఖాళీ లేదని చెప్పి బయటకు పంపించారు. బిడ్డను చూసుకుంటూ వార్డు బయట నేలపైన పడిగాపులు కాసింది. చేసేది లేక చివరకు ఆస్పత్రి ఆవరణలోని చెట్టు కింద తలదాచుకుంది. ప్రసవం అయ్యి 24 గంటలు కూడా గడవముందే ఇలా చెట్టు కింద పడుకొని బాలింత పడిన వేదన అక్కడ ఉన్న వారిని కలిచివేసింది. ఈ విషయమై ఎంజీఎం వైద్యులకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు సమాచారమిచ్చినా డ్యూటీలోని వైద్యులు, సిబ్బంది తమకు తెలియదంటూ దాటవేస్తూ వెళ్లారు. బాలింత అవస్థలు చూడలేక చిన్నపాటి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి తన బెడ్‌ను బాలింతకు ఇచ్చారు. కాగా, వరంగల్ ఎంజీఎంలో బెడ్స్‌తో పాటు ఇతర సౌకర్యాలు కూడా లేవని పలువురు పేర్కొంటున్నారు.

'మత్తు'పై యుద్ధానికి యాంటీ డ్రగ్ సోల్జర్స్

- టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా

హైదరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్యా తెలిపారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించి విద్యార్థులు అటువైపు వెళ్లకుండా కట్టడి చేసేందుకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో 4,511 ప్రహరీ క్లబ్‌లు/యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో అన్ని విద్యాసంస్థల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తాజాగా 'మత్తు'పై యుద్ధానికి అన్ని విభాగాల సమన్వయంతో యాంటీ డ్రగ్ సోల్జర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువత, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఆశా వర్కర్లు అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, విలేజ్ అసిస్టెంట్లు, ఇతర రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్ వంటి విభాగాల నుంచి 940 మందిని ఎంపిక చేసి వారి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు శాండిల్యా తెలిపారు. అందులో భాగంగా ఎంపిక చేసిన వారిలో మొదటి విడత బ్యాచ్‌కు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమయిందని వెల్లడించారు.

మైలార్‌దేవుపల్లిలో అక్రమ నిర్మాణం కూల్చివేత

రాజేంద్రనగర్, వనస్థలిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాల అంశంలో అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. రాజేంద్రనగర్ మండల పరిధి మైలార్‌దేవుపల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీ- లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీల మధ్యలోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న ప్రహరీ గోడను రెవెన్యూ అధికారులు బుధవారం నేలమట్టం చేశారు. రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ బి.రాములు తెలిపారు. టీఎన్‌జీవోస్ కాలనీకి లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీకి మధ్యన ప్రభుత్వానికి చెందిన వెయ్యి గజాల స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తుండగా కూల్చివేశామని చెప్పారు. అయితే, సంబంధిత స్థలం తనేదనంటూ ఎక్స్‌కవేటర్ అద్దాలు పగులగొట్టి కూల్చివేతను అడ్డగించిన రవీందర్ రెడ్డి అనే వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తహసీల్దార్ తెలిపారు. మరోపక్క, బీఎన్ రెడ్డి నగర్‌లోని పలు కాలనీల్లో అనుమతులు లేకుండా నిర్మించిన ఐదు ఇళ్లను జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్లు 200/1, 201/2, 201/3లోని సాగర్ కాంప్లెక్స్, శ్రీపురం కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీ, బీఎన్‌రెడ్డినగర్‌ల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లు, భవనాలపై చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. కాగా, ఇళ్లను సీజ్ చేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. ఈ అంశంపై హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయశ్రీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవన్నారు.

ఏసీబీకి చిక్కిన పాల్వంచ లైన్‌ఇన్‌స్పెక్టర్

పాల్వంచ, అక్టోబరు 23: విద్యుత్ చౌర్యం ఘటనలో కేసు లేకుండా చేసేందుకు ఓ వ్యక్తి వద్ద నుంచి లంచం తీసుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ లైన్‌ఇన్‌స్పెక్టర్ జిలుగు నాగరాజు ఏసీబీకి చిక్కాడు. కరకవాగుకు చెందిన నాగరాజు అనే వ్యక్తి తాను నిర్మించుకుంటున్న ఇంటికి క్యూరింగ్ కోసం పక్కనే ఉన్న తన మేనమామ ఇంటి నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకుని వాడుకుంటున్నాడు. అయితే సాధారణ తనిఖీల్లో భాగంగా అక్కడకు వెళ్లిన లైన్ ఇన్‌స్పెక్టర్... నాగరాజు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న విషయాన్ని గుర్తించి విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేస్తానని హెచ్చరించాడు. అలా జరగకుండా ఉండాలంటే సెటిల్‌మెంట్ చేసుకోవాలని అతనిపై ఒత్తిడి తెచ్చాడు. రూ.68 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బేరమాడితే చివరకు రూ.26 వేలకు అంగీకరించాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వారి సూచన మేరకు లంచం ఇస్తుండగా లైన్‌ఇన్‌స్పెక్టర్‌ను అధికారులు పట్టుకున్నారు. అనంతరం అతణ్ని స్థానిక సబ్‌స్టేషన్‌కు తరలించి పంచనామా నిర్వహించారు.

వైసీపీకి వాసిరెడ్డి పద్మ గుడ్‌బై

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో మరో వికెట్ పడింది. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా తన నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రానికి, ప్రజలకు, పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు ఆయన మోసం చేశారని అన్నారు. పేద ప్రజల సంక్షేమం పేరిట జగన్ లూటీ చేశారని, మద్యం పేరుతో భారీగా దోపిడీ చేశారని ఆరోపించారు. ప్రజాతీర్పు వెలువడ్డాక కూడా ఆయనలో మార్పు రాలేదని, ఆత్మవిమర్శ చేసుకోలేదని అన్నారు. గుడ్‌బుక్ పేరిట పార్టీ నేతలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తననూ మోసం చేశారని, మభ్యపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో రాష్ట్రానికి, పేదలకు అన్యాయం జరిగిందన్నారు. సామాన్యులపై అధిక ధరల భారం వేశారని, ప్రతి సందర్భంలో ప్రజలను మోసం చేశారన్నారు. రాజకీయాల్లోకి వచ్చేటప్పుడు కుటుంబంలోని వ్యక్తుల గురించి ఏం చెప్పారో, ఇప్పుడు ఏమంటున్నారో గుర్తు చేసుకోవాలని జగన్‌కు సూచించారు. మహిళల విషయంలో జగన్ పాలనలో రోజుకో వికృత సంఘటన జరిగిందన్నారు. ఆ రోజు బాధితుల ఇళ్లకు వెళ్లి ఆయన ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలోని మహిళా హోం మంత్రులు ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. మహిళల భద్రత కోసమైనా రాజకీయాలకు అతీతంగా అందరూ కలసికట్టుగా ముందుకు రావాలని కోరారు. సంఘటన జరిగిన వెంటనే సీఎం కీచకుడంటూ జగన్ పత్రికలో రాయడం రాజకీయమేనన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మహిళల భద్రత కోసం జగన్ ఏం చేశారో చెప్పాలన్నారు. ఆయన పాలనలో అఘాయిత్యాలు, అత్యాచారాలు జరగలేదా, నాడు సీఎంగా ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు.

శారదా పీఠానికి భూకేటాయింపులు రద్దు

జీవోల రద్దుకు ఏపీ కేబినెట్ ఆమోదం

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ శారదాపీఠానికి గత ప్రభుత్వం జరిపిన భూకేటాయింపులను రద్దుచేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. సంబంధిత జీవోలను రద్దుచేయాలని తీర్మానించింది. అలాగే మహిళలకు దీపావళి కానుక ప్రకటించింది. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఈ నెల 31 నుంచి అమలు చేసేందుకు ఆమోదముద్ర వేసింది. బుధవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ప్రజలు ఉచితంగా ఇసుక పొందేలా సీనరేజ్ తదితర పన్నుల రద్దు, ఆలయ పాలకమండళ్లలో సభ్యుల సంఖ్య పెంపు, బ్రాహ్మణులు, నాయీబ్రాహ్మణుల నియామకం, శారదాపీఠానికి భూకేటాయింపులు రద్దు తదితర కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర వెల్లడించారు. శారదాపీఠానికి తిరుమలలో గత ప్రభుత్వం 9 వేల చదరపు అడుగులు కేటాయించగా.. పీఠం ఏకంగా 25 వేల చ.అడుగుల్లో నిర్మాణాలు చేసి అద్దెలకు ఇచ్చుకుంటోందని పార్థసారథి తెలిపారు. ఇసుక పూర్తిగా ఉచితంగా అందించేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందని రవీంద్ర చెప్పారు. గత ప్రభుత్వంలో మెట్రిక్ టన్నుకు రూ. 475 చొప్పున లెక్కాపత్రం లేకుండా ఇసుక విక్రయించారని.. కూటమి ప్రభుత్వం దీనికి స్వస్తి పలికిందన్నారు. ఎవరైనా సొంత వాహనం తెచ్చుకుని నదిలో ఇసుకను తీసుకెళ్లొచ్చని.. నదీ పరివాహక ప్రాంతాల గ్రామాలవారు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో తీసుకెళ్లవచ్చని.. అయితే వెబ్‌సైట్‌లో గ్రామ/వార్డు సచివాలయంలో సమాచారం కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. దీపావళి వారం ముందే వచ్చిందా అనే విధంగా సూపర్ సిక్స్ హామీ 3 సిలిండర్లు పంపిణీ చేయాలని నిర్ణయించడం శుభపరిణామమని అనిత అన్నారు.

కేబినెట్ కీలక నిర్ణయాలివీ..

- విశాఖపట్నం జిల్లా పెందుర్తిలోని శారదాపీఠానికి సర్వే నంబర్లు 102, 102/2, 103ల్లోని 15 ఎకరాల ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేస్తూ జారీ చేసిన జీవోలు 343, 64, 47ల రద్దు.
- ఇసుకపై సీనరేజ్ ఫీజు, డీఎంఎఫ్, ఎంఈఆర్‌ఐటీ మినహాయిస్తూ ఉచిత ఇసుక విధానం-2024లో సవరణలు. గ్రామ పంచాయతీల పరిధిలో సొంత అవసరాలకు ట్రాక్టర్లతో ఇసుక తరలింపునకు అనుమతి. పట్టాభూములతో పాటు, డీకేజీ పట్టా భూముల్లోనూ ఇసుక తవ్వకాలకు అనుమతి.
- జీవోలను అప్‌లోడ్ చేసేందుకు జీవోఐఆర్ వెబ్‌పోర్టల్ పునరుద్ధరణకు ఆమోదం.
- రివర్స్ టెండరింగ్ రద్దు.. కేంద్రం సహా అన్ని రాష్ట్రాలు టెండర్ల విధానంలో కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) గైడ్ లైన్స్‌నే అనుసరిస్తున్నాయి. ఏపీలోనూ వీటినే పాటించాలని నిర్ణయం.
- రూ.వంద కోట్లు దాటిన టెండర్లను పరిశీలించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన జ్యుడీషియల్ ప్రివ్యూ కూడా రద్దు.
- దేవాలయ ట్రస్టు బోర్డుల్లో మరో ఇద్దరు సభ్యుల పెంపు. బ్రాహ్మణ సంఘం నుంచి ఒకరిని, నాయీ బ్రాహ్మణ సంఘం నుంచి ఇంకొకరిని ఎంపిక చేస్తూ రూపొందించిన బిల్లుకు ఆమోదం.

నాన్నకు మాటిచ్చి తప్పావ్!

నైతికంగా పతనమయ్యావ్.. అన్నపై చెల్లెలు షర్మిల ఫైర్.. జగన్‌కు ఘాటుగా లేఖాస్త్రం

- తల్లిపై కేసులు పెట్టినందుకు ఆగ్రహం
- ఒప్పందం అమలు చేయకుంటే న్యాయపరమైన చర్యలు తప్పవు
- మాజీ సీఎంకు షర్మిల హెచ్చరిక



అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తన జీవితకాలంలో సంపాదించిన ఆస్తులను తన మనుమడు, మనుమరాళ్లకు సమానంగా పంచాలన్న తమ తండ్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాన్ని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధిక్కరించారని ఆయన చెల్లెలు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. తద్వారా నైతికంగా పతనమయ్యారని దుయ్యబట్టారు. తండ్రి అభీష్టం మేరకు ఆస్తులను సమానంగా పంచకపోతే.. న్యాయపరమైన చర్యలు తప్పవని ఓ లేఖలో హెచ్చరించారు. గత నెల 12న రాసిన ఈ లేఖను ఆమోదిస్తూ వారి తల్లి విజయలక్ష్మి కూడా సంతకం చేయడం విశేషం. తన మరణానికి ముందు ప్రారంభించిన భారతి సిమెంట్స్, సాక్షి, తదితర సంస్థల్లో మనుమడు, మనుమరాళ్లకు సమాన వాటా ఇవ్వాలని నాన్న సుస్పష్టంగా ఆదేశించారని.. అందుకు జగన్ కూడా అంగీకరించారని లేఖలో ప్రస్తావించారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు తమ మధ్య జరిగిన చర్చలు, లావాదేవీలకు అమ్మ సాక్షి మాత్రమే కాదు.. వాటిని దగ్గరగా గమనించింది కూడానని తెలిపారు. తనకు జగన్ ఇటీవల రాసిన లేఖపై షర్మిల అభ్యంతరం వ్యక్తంచేశారు. దానికి ఘాటుగా బదులిచ్చారు. షర్మిల లేఖలో ముఖ్యాంశాలివీ..

బుల్డోజ్ చేసుకుంటూ పోయావ్..

'2019లో కుదిరిన ఎంవోయూలో పేర్కొన్నట్లుగా 'ప్రేమాభిమానాలతో' నాకు కొద్దిపాటి ఆస్తులు బదిలీ చేశారు. తద్వారా మన తండ్రి ఆదేశాలను పాక్షికంగా మాత్రమే అమలు చేసినట్లు! పాక్షికం అని ఎందుకు చెబుతున్నానంటే.. భారతి సిమెంట్స్, సాక్షిలో మెజారిటీ వాటాలు నువ్వే ఉంచుకుంటానని ఒత్తిడి తెచ్చావ్.. అన్నీ బుల్డోజ్ చేసుకుంటూ పోయావ్.. అయినా ఎంవోయూలో ఉన్న ప్రకారం సెటిల్మెంట్‌కు అంగీకరించాం. నువ్వు నా అన్నవు కాబట్టి.. కుటుంబ వివాదాలను పరిష్కరించుకునే ఉద్దేశంతో సమాన వాటాను వదులుకునేందుకు నేను సమ్మతించాను. ఆ ప్రకారం 2019 ఆగస్టు 31న ఎంవోయూ అమలు చేశారు. కానీ కొద్ది ఆస్తులు మాత్రమే నాకు వచ్చాయి. ఇప్పుడు నీ సొంత తల్లిపైన కేసులు వేసి.. నీ చెల్లెలు, ఆమె పిల్లలకు చట్టబద్ధంగా రావలసిన ఆస్తులను రాకుండా చేయాలని చూస్తున్నావ్. నాన్న చూపిన దారిని తప్పి నువ్వు వ్యవహరించడం నాకు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. నాన్న ఆకాంక్షలు, నీవిచ్చిన హామీకి విరుద్ధంగా సదరు ఎంవోయూను ఏకపక్షంగా రద్దుచేయాలని కోరావు. నీవు నాకు రాసిన లేఖ చట్టబద్ధంగా ఎంవోయూకు వ్యతిరేకం. అందులో పవిత్రత లేదు. మన తండ్రి ప్రతి ఆదర్శాన్నీ పక్కనపెట్టావ్. ఆయనెంతో ప్రేమించే భార్య, మన అమ్మపై కేసులు పెట్టడం.. నాకు చట్టబద్ధంగా రావలసిన ఆస్తులను లాక్కోవాలనుకోవడం.. నాన్న ఎన్నడూ ఊహించి ఉండరు.'

నా వాటాగా సరస్వతి పవర్..

'ఎంవోయూ ప్రకారం నా వాటాగా వచ్చిన సరస్వతి పవర్‌కు సంబంధించిన షేర్లన్నీ దానిపై సంతకం చేసిన వెంటనే నాకు బదిలీచేస్తానని మాటిచ్చావు. కానీ ఏళ్ల తరబడి దానిని నిలబెట్టుకోలేదు. సరస్వతి పవర్ షేర్లపై అమ్మకు పూర్తి హక్కులు ఇస్తూ గిఫ్ట్ డీడ్స్‌ను అమలు చేశావు. ఇప్పుడు దానిపై ఫిర్యాదులు చేయడం.. ఏడవడం సరికాదు. షేర్లు వదులుకోవడానికి అంగీకరించి.. ఇప్పుడు అనవసరమైన వివాదాలు రేపుతున్నావు. సరస్వతి పవర్‌లో చట్టబద్ధమైన వాటా కలిగి ఉన్న నాకు అది లేకుండా చేయడానికే ఇలా చేస్తున్నావు. 2019నాటి ఎంవోయూ విషయానికొస్తే.. అది కొనసాగుతోంది.. దానికి కట్టుబడి ఉండాల్సిందే. దాని నుంచి నువ్వు ఏకపక్షంగా బయటకు వస్తానంటే.. దానికి చట్టబద్ధంగా ప్రాధాన్యం లేదు. ఎంవోయూలో ప్రస్తావించిన ఆస్తులకు సంబంధించి అందులో పేర్కొన్న ప్రతి మాటకూ నువ్వు కట్టుబడి ఉండాల్సిందే. ఎంవోయూలో ప్రస్తావించకపోయినా.. వీటిలో 20 ఎకరాల యలహంక హోం ప్రాపర్టీ కూడా ఉంది. అందులో నాకు వాటా ఉందని అమ్మ సాక్షిగా మౌఖికంగా అంగీకారం కుదిరింది.'

నన్ను నిర్దేశించలేవు..

'నా రాజకీయ కెరీర్ నా ఇష్టం. నా ప్రవర్తనను నువ్వు నిర్దేశించలేవు. నీకు, అవినాశ్‌కు వ్యతిరేకంగా మాట్లాడనంటూ ఓ క్లాజుపై సంతకం చేశానని.. దానికి కట్టుబడాల్సిందేనని నువ్వనడం హాస్యాస్పదం. నా పిల్లలు నీకు రక్తసంబంధీకులు. నువ్వు సంతకం చేసిన ఎంవోయూను వారికోసం అమలు చేయడం నా అన్నగా నీ బాధ్యత. నైతికంగా పతనమైన నువ్వు.. ఇప్పటికైనా నాన్న ఆకాంక్షలను నెరవేరుస్తావని.. ఎంవోయూకు కట్టుబడి ఉంటావని ఆశిస్తున్నాను. లేదంటే చట్టబద్ధమైన పరిష్కారాలు అన్వేషించే హక్కులు నాకు ఉన్నాయి. ఈ వాస్తవాలను ధ్రువీకరించేందుకు, అన్ని సంఘటనలకు సాక్షిగా ఉన్న మన అమ్మ కూడా దీనిపై సంతకం చేశారు' అని షర్మిల తెలిపారు.

మమకారం మాయమైంది!

(మొదటిపేజీ తరువాయి)

ఆ ఆలోచనను విరమించుకుంటున్నట్లు తెలిపారు. పిటిషన్‌లో జగన్ వాదన ఇదీ..

- గ్రంధి ఈశ్వరరావు, గ్రంధి శశికళ, గ్రంధి సతీశ్ స్థాపించిన సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎదుగుదలలో మా కష్టం ఎంతో ఉంది.
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్వార్జితంతోపాటు వారసత్వ ఆస్తులను భార్య, పిల్లలకు పంచారు. ఆ తర్వాత నేను (జగన్) నా సొంత సామర్థ్యంతో, తెలివితేటలతో వ్యాపారాలు చేశాను. ఇలా సంపాదించిన ఆస్తుల్లో కొన్నింటిని కేవలం 'ప్రేమ, అభిమానం'తో భవిష్యత్తులో షర్మిలకు ఇద్దామని భావించాను. ఇలా ఇవ్వాలనుకున్న ఆస్తుల జాబితాతో 2019 ఆగస్టు 31వ తేదీన షర్మిలతో ఎంవోయూ చేసుకున్నాను. ఈ ఆస్తులు నాకు, నా సతీమణికి చెందినవి. అయినప్పటికీ... చెల్లి అనే మమకారంతో షర్మిలకు ఇద్దామనుకున్నాను.
- ఈడీ, హైకోర్టు కేసులు ఉన్న నేపథ్యంలో... వాటి నుంచి బయటపడిన తర్వాత మాత్రమే వాటిని షర్మిలకు ఇచ్చేలా ఎంవోయూలో రాసుకున్నాం.
- సరస్వతీ పవర్ కంపెనీలో నా పేరుతో ఉన్న షేర్లను 2021లో మా తల్లికి బదిలీ చేశాం. భారతీ రెడ్డి షేర్లు కూడా బదిలీ అయ్యాయి. దీంతో ఆ కంపెనీలో విజయలక్ష్మికి 48.99 శాతం వాటా వచ్చింది. ఆ తర్వాత 2021 జూలై 26న నేను, భారతి కలిసి మాకున్న మిగిలిన షేర్లను కూడా విజయలక్ష్మికి గిఫ్ట్‌డీడ్ చేశాం. వాటిని భవిష్యత్తులో మా అనుమతితో షర్మిలకు బదిలీ చేయాలే తప్ప.. ఇప్పుడే షర్మిలకు ఇచ్చేసినట్లు కాదు.
- విజయలక్ష్మి తన పేరుతో ఉన్న ఆస్తులు ఎవరికైనా ఇవ్వొచ్చు. కానీ, ఈ ఆస్తులు లిటిగేషన్‌లో ఉన్నాయి. అందువల్ల ప్రస్తుతానికి సరస్వతీ పవర్‌లో మెజారిటీ వాటా ఇంకా మాకే (జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ) ఉన్నట్లు పరిగణించాలి.
- ఇప్పటిదాకా మేం షేర్ ట్రాన్స్‌ఫర్ పత్రాలు ఇవ్వలేదు. భవిష్యత్‌లో షర్మిలకు బదిలీ కావాల్సిన షేర్లకు విజయలక్ష్మి ట్రస్టీగా మాత్రమే ఉంటారు.
- ప్రేమాభిమానాలు కరిగిపోవడం వల్ల ఎంవోయూను ముందుకు తీసుకెళ్లి షర్మిలకు ఆస్తులు పంచాలనే ఆలోచనను ఉపసంహరించుకున్నాం. ఆస్తులు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఎంవోయూ, గిఫ్ట్ డీడ్ చేసుకున్నాం కానీ... వాస్తవమైన పంపకాలు జరగలేదు.
- షర్మిల, విజయలక్ష్మి, చాగర్రి జనార్దన్‌కు (0.25 శాతం వాటాదారు) సరస్వతి పవర్ కంపెనీ షేర్లపై ఎటువంటి హక్కు లేదు. వారికి వాటాలూ లేవు. ఈ ఏడాది జూలై 6వ తేదీన జరిగిన షేర్ల బదిలీ చట్టవిరుద్ధం. అది చెల్లదు.

కామారెడ్డి డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్ సస్పెన్షన్

- రూ. 6 లక్షలకే కిలో బంగారం ఇస్తానని వ్యక్తిని మోసగించిన డీఎస్పీ
- రూ.20 లక్షల విలువైన బంగారానికి ఒప్పందం.. రూ.17లక్షల వసూలు
- బంగారం ఇవ్వకపోయే సరికి డీఎస్పీపై ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు
- ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీపై కేసు
- డీజీపీ కార్యాలయం నుంచి డీఎస్పీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

కామారెడ్డి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని డీసీఆర్‌బీ (డిస్ట్రిక్ క్రైమ్ రికార్డు బ్యూరో) విభాగంలో పనిచేస్తున్న డీఎస్పీ మదన్‌లాల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. పలు అవినీతి ఆరోపణలతో మూడు రోజుల క్రితమే ఆయన్ను సస్పెండ్ చేస్తూ డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మదన్‌లాల్ డీసీఆర్‌బీ డీఎస్పీగా ఏడు నెలల క్రితం కామారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చారు. కామారెడ్డిలోనే నివాసం ఉంటూ వ్యాపారి మధుసూదన్‌తో పరిచయం పెంచుకున్నారు. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని అతడికి నమ్మ బలికాడు. దొంగల ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం ఉందని.. గుప్త నిధుల నుంచి లభించిన మరికొంత బంగారం ఉందని ఆ వ్యాపారిని నమ్మించాడు. రెండు కిలోల వరకు బంగారం ఉంటుందని.. రూ. 6 లక్షలకే కిలో చొప్పున ఇప్పిస్తానని చెప్పాడు. తక్కువ ధరకు బంగారం వస్తుందనే భావనతో మధుసూదన్ మూడు కిలోలకు పైగా బంగారం కోసం రూ. 20 లక్షలకు డీఎస్పీతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. బంగారం తన వద్ద సేఫ్‌గా ఉందని, మొత్తం డబ్బులు ముట్టజెప్పిన తర్వాతే బంగారం ఇస్తానని వ్యాపారికి డీఎస్పీ మదన్‌లాల్ స్పష్టం చేశాడు. ఫలితంగా సదరు వ్యాపారి తొలుత రూ. 17 లక్షలను డీఎస్పీకి ముట్టజెప్పాడు. నెలలు గడుస్తున్నా బంగారం ఇవ్వకపోవడంతో డీఎస్పీపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. దీంతో సదరు బాధితుడు మధుసూదన్ పోలీసు అధికారులను ఆశ్రయించాడు. ఈ విషయం కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధూశర్మ దృష్టికి రావడంతో.. ఆమె ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు జరిగిన ఘటనపై సింధూశర్మ ఇటీవల విచారణ చేపట్టారు. కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ వేసి విచారణ చేపట్టారు. కమిటీ నివేదిక ఆధారంగా జిల్లా ఎస్పీ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. అంతకుముందే మదన్‌లాల్‌ను ఐజీ కార్యాలయానికి సరెండర్ చేశారు. జిల్లా పోలీసు శాఖ నివేదిక ప్రకారం మూడు రోజుల క్రితం డీఎస్పీ మదన్‌లాల్‌ను సస్పెండ్ చేస్తూ డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీఎస్పీ మదన్‌లాల్ జిల్లాలోని పోలీసు శాఖలోనే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కూడా విచారణలో తెలిసింది. సదరు డీఎస్పీకి కామారెడ్డికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు సహకరించినట్లు సమాచారం.

పరిశ్రమలు తరలిపోతాయి

హెచ్‌టీ విద్యుత్ చార్జీల పెంపు.. ప్రతిపాదనపై ఫ్యాప్సీ అభ్యంతరం

- గతంలో అడ్డగోలుగా ఒప్పందాలు
- ఇక పునరుత్పాదక విద్యుత్ ఎందుకు?
- ఈఆర్సీ విచారణలో నిపుణులు ప్రశ్న
- 28న ఈఆర్‌సీ కొత్త టారిఫ్ ఆర్డర్
- పేదలు, మధ్య తరగతిపై భారం వేయం: దక్షిణ డిస్కం సీఎండీ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హెచ్‌టీ కేటగిరిలోని 33కేవీ, 133కేవీ విద్యుత్ చార్జీలను 11కేవీతో సమానంగా పెంచాలని, కొత్తగా స్టాండ్‌బై, గ్రిడ్ సపోర్ట్, అన్‌బ్లాకింగ్ చార్జీలు విధించాలని డిస్కమ్‌లు చేసిన ప్రతిపాదనలపై 'ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ (ఫ్యాప్సీ)' తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇలాగైతే పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతాయని ఆందోళన వ్యక్తం చేసింది. 2024-25లో రూ.1,221 కోట్ల విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదిస్తూ ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)పై బుధవారం విద్యుత్ భవన్‌లో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) నిర్వహించిన బహిరంగ విచారణలో పెద్ద సంఖ్యలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. ఈఆర్‌సీ చైర్మన్ టీ శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య నిర్వహించిన బహిరంగ విచారణలో తొలుత దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తమ ప్రతిపాదనలను వివరించారు. ఈ నెల 28న ఈఆర్‌సీ కొత్త టారిఫ్ ఆర్డర్ ఇవ్వనుంది. దాంతో పెరిగిన చార్జీలు నవంబరు 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అశాస్త్రీయ, అవాస్తవిక అంచనాల ఆధారంగా గతంలో అడ్డగోలుగా చేసుకున్న కొనుగోలు ఒప్పందాల (పీపీఏ)తోనే వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో పెద్ద మొత్తంలో మిగులు విద్యుత్ ఉండబోతోందని నిపుణులు, పారిశ్రామిక, వాణిజ్య సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ పరిస్థితిల్లో వచ్చే ఐదేళ్లలో కొత్తగా 20 వేల మెగావాట్ల పునరుత్పాద విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక ఔచిత్యం ఏమిటని ప్రశ్నించారు. ఫ్యాప్సీ ప్రతినిధి రమణ్‌దీప్ సింగ్, తెలంగాణ ఐరన్, స్టీల్ తయారీదారుల సంఘం ప్రతినిధి వినోద్ అగర్వాల్, ఏపీ, తెలంగాణ ప్లాస్టిక్ తయారీదారుల సంఘం ప్రతినిధి శంకర్ డిస్కమ్‌ల ప్రతిపాదనలను వ్యతిరేకించారు. అడ్డగోలు విధానాలే విద్యుత్ సంస్థల ఆర్థిక సంక్షోభానికి కారణమన్నారు. గత ప్రభుత్వం మూడు పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచిందని, చివరిసారిగా 2022-23లో ఒకే సారి ఏకంగా రూ.5,596 కోట్ల చార్జీలు పెంచిందన్నారు. రూ.1221 కోట్ల విద్యుత్ చార్జీల పెంపును మాత్రమే ప్రతిపాదించినట్లు ప్రస్తుత ప్రభుత్వం చెప్పుకోవడం ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు, 2024-25లో ఇంకా 5 నెలలే మిగిలి ఉన్నాయని, దాంతో ఏటా రూ.3వేల కోట్లకు పైనే చార్జీలు పెరుగుతాయన్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్లకు లైన్ చార్జీల వసూలుకు ప్రతిపాదించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దక్షిణ డిస్కం ప్రతిపాదనలు ఒప్పుకుంటే సామాన్యులకు తీవ్ర నష్టం జరుగుతుందని శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు రైతుల కష్టాలు

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని భారతీయ కిసాన్ సంఘ్ నేత డీ రాము తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది రాకపోవడంతో రైతులే మరమ్మతులకు ప్రయత్నించి విద్యుదాఘాతంతో మరణిస్తున్నారన్నారు. పాడి పరిశ్రమకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని యాదవ్ మహాసభ జాతీయ కార్యదర్శి రమేశ్ యాదవ్ కోరారు.

పేదలు, మధ్య తరగతిపై భారం వేయం: సీఎండీ

పేద, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం వేయట్లేదని, వారి విద్యుత్ చార్జీలపై ఎలాంటి పెంపు ఉండదని దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఇళ్లకు నెలకు 300 యూనిట్లకుపైగా వినియోగించేవారి ఫిక్స్‌డ్ చార్జీలపై స్వల్ప పెంపు ప్రతిపాదించినట్లు చెప్పారు. విద్యుత్ సరఫరా, మరమ్మతుల్లో పారదర్శకత కోసం టీజీఎయిమ్స్ యాప్‌ను తీసుకొస్తున్నామన్నారు. ఎలక్ట్రికల్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్లకు (ఎల్‌టీ-ఈవీ) ఫిక్స్‌డ్ చార్జీల నుంచి మినహాయింపు ఇస్తున్నామన్నారు.

జీనోమ్ వ్యాలీలో బయోప్రాసెస్ సెంటర్

- థెర్మో ఫిషర్ సైంటిఫిక్ సంస్థ ప్రకటన
- శ్రీధర్‌బాబు సమక్షంలో ఎంవోయూ
- గంగారెడ్డి హత్య వెనక ఎవరున్నా విడిచిపెట్టబోమన్న మంత్రి
- 'ముఖాముఖి'లో ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన థెర్మో ఫిషర్ సైంటిఫిక్ సంస్థ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో 'బయోప్రాసెస్ డిజైన్ సెంటర్ (బీడీసీ)'ను నెలకొల్పబోతోంది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో కంపెనీ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. 10 వేల చదరపు అడుగుల నిర్మిత స్థలంలో 2025 తొలి త్రైమాసికంలో డిజైన్ సెంటర్ పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తుందని మంత్రి తెలిపారు. బీడీసీ ఏర్పాటుతో స్థానిక ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. జీనోమ్ వ్యాలీ మూడో దశ విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయని వివరించారు. నవంబర్ 18న ఫార్మా రంగానికి అవసరమయ్యే కృత్రిమ మేధ సదస్సు జరుగుతుందని తెలిపారు.



మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న థెర్మో ఫిషర్ సైంటిఫిక్ కంపెనీ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు

ఎవరున్నా వదిలిపెట్టేది లేదు..

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడు, కాంగ్రెస్ నేత గంగారెడ్డి హత్య వెనుక ఎవరున్నా వదిలిపెట్టేది లేదని శ్రీధర్‌బాబు అన్నారు. అత్యంత సన్నిహితుడైన నేత చనిపోవడంతో జీవన్‌రెడ్డి బాధలో ఉన్నారని చెప్పారు. గంగారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖిలో పాల్గొన్న శ్రీధర్‌బాబు.. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ప్రజల నుంచి వినతిపత్రాలు, ఫిర్యాదులు స్వీకరించారు. టీపీసీసీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు తాను జీవన్‌రెడ్డిని కలిశానని, గంగారెడ్డి హత్యపై పూర్తి విచారణ జరిపి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డీజీపీకి, జిల్లా ఎస్పీకి ఆదేశాలిచ్చామన్నారు. ఈ సందర్భంగా పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి జీవో నెంబర్ 46తో తాము ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు అభ్యర్థులు మంత్రి దృష్టికి తెచ్చారు. దీనికి సంబంధించి ఈ నెల 26న సీఎస్‌తో సమావేశం ఏర్పాటు చేయిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. అలాగే వికలాంగులు, డీఎస్సీ అభ్యర్థులు, వీఆర్‌ఏలు తదితరులు కలిసి తమ సమస్యలను మంత్రికి వివరించారు. మొత్తం 328 వినతిపత్రాలు, ఫిర్యాదులు మంత్రి స్వీకరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.